అసెంబ్లీ ఆమోదించిన మూడు పేర్ల నుంచే

గవర్నర్ నియామకం!

రాష్ట్రపతి కట్టుబడి ఉండేలా

ఆర్టికల్ 155ని సవరించాలి 2

గవర్నర్లకు ఐదేళ్ల పదవీకాలం చాలు

కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై జస్టిస్ కురియన్

కమిటీ సిఫారసు.. తమిళ సర్కార్‌కు అందజేత

నివేదికను అసెంబ్లీ ముందుంచిన సీఎం స్టాలిన్

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

‘హార్ముజ్’లో 2

యుద్ధ మేఘాలు

అమెరికా యుద్ధ నౌకలు, బలగాల మోహరింపు

పశ్చిమాసియాకు 50కిపైగా యుద్ధ విమానాలు

ఇరాన్, రష్యా, చైనా ఉమ్మడి సైనిక విన్యాసాలు

జలసంధిని తాత్కాలికంగా మూసివేసిన ఇరాన్

అమెరికా యుద్ధ నౌకలు మునగవచ్చు: ఖమేనీ

గురువారం | 19-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 344 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: విదియ మ.3.59 తదుపరి తదియ, నక్షత్రం: పూర్వాభాద్ర రా.8.52 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: తె. 6.10 మొదలు, దుర్ముహూర్తం: ఉ.10.33-11.19, మ.3.10-3.56, అమృతఘడియలు: మ.1.00-2.34, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.43, సూర్యాస్తమయం: 6.14 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



నిందితుడు కులవర్ధన్



చెరువులో శవమై తేలిన కులవర్ధన్

చెరువులో శవమయ్యాడు

బాలిక రేపిస్టు కులవర్ధన్ ఆత్మహత్య!

పోలీసు వాహనంలో తరలిస్తుండగా తప్పించుకుని పారిపోయిన వైనం

రంగంలోకి ప్రత్యేక పోలీసు బృందాలు.. చివరికి చెరువులో దొరికిన మృతదేహం

రేపిస్టు మృతితో మదనపల్లెలో సంబరాలు.. సీఎం చిత్రపటానికి మహిళల పాలాభిషేకం

చిన్నారికి పూర్తయిన అంత్యక్రియలు

అన్నమయ్య, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కలవరం సృష్టించిన చిన్నారిపై హత్యాచారం కేసులో రేపిస్టు కులవర్ధన్ చెరువులో శవమయ్యాడు. మంగళవారం రాత్రి వాహనంలో తరలిస్తుండగా కులవర్ధన్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని

మిగతా 14వ పేజీలో...

‘గంగమ్మ’ రాస్తున్న మరణ శాసనం

నీళ్లలో తేలుతున్న రేపిస్టులు

మైలవరం డ్యామ్‌లో రహమతుల్లా.. తునిచెరువులో నారాయణ

తాజాగా ‘మదనపల్లె’ చెరువులో తేలిన కులవర్ధన్ 14

ఆడపిల్లల జోలికొస్తే ఊరుకోబోమని సీఎం హెచ్చరికలు

ఘటనలపై జనం ఆగ్రహావేశాలు.. అనూహ్యంగా కడతేరుతున్న కీచకులు

వాడు బతికుంటే నేనే చంపేసేదాన్ని

వాళ్ల ఇల్లు కూలదోయాలి.. చిన్నారి తల్లి ఆగ్రహం



విశాఖ తీరంలో జరిగిన ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్న యుద్ధ నౌకలు

బాంబుల వర్షం కురిపిస్తున్న పీ8ఐ యుద్ధ విమానం

ఐఎన్ఎస్ సుమేధ నౌక నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభివాదం. చిత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, భారత నౌకాదళాధిపతి దినేశ్ త్రిపాఠి

భళా.. నేవీ!

విశాఖ తీరంలో అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష

ఇది బలప్రదర్శన కాదు.. స్నేహానికి ప్రతీక: రాష్ట్రపతి ముర్ము

ఐఎఫ్ఆర్‌లో పాల్గొనడం గౌరవంతోపాటు ఆనందాన్నిస్తోంది

‘సురక్షిత సముద్రం-సమృద్ధి భారత్’.. ఇదే భారత నేవీ లక్ష్యం

సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధం, సముద్ర దోపిడీ నియంత్రణ వంటి అంశాల్లో దేశాలు పరస్పరం సహకరించుకోవాలని పిలుపు

రెండు గంటలకుపైగా సమీక్ష.. ఆకట్టుకున్న ఐఎన్ఎస్ విక్రాంత్

గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ హాజరు

నేడు విశాఖకు రాజ్‌నాథ్.. ‘మిలాన్-2026’ ప్రారంభం 14

ఎఫ్‌డీలు పెట్టు..

అక్రమాస్తులు పట్టు!

ఈడీ జప్తు చేసిన ఆస్తుల కోసం జగన్ కేసుల నిందితుల యత్నాలు

విశాఖ ఫార్మా సిటీలో 16 ఇండస్ట్రియల్ ప్లాట్ల విడుదలకు రాంకీ ఫార్మా పిటిషన్

వాటిని విడుదల చేయాలని గతంలో అడ్జుడికేటింగ్ అథారిటీ తీర్పు

అయితే వాటిలో నిర్మాణాలు చేపట్టరాదని, విక్రయించకూడదని స్పష్టీకరణ

దీనిపై టీ-హైకోర్టును ఆశ్రయించిన రాంకీ

ఆ ప్లాట్లకు ఎఫ్‌డీలు పెడతామని వినతి

విభేదించిన అదనపు సొలిసిటర్ జనరల్

అది నేరపూరిత సొమ్ము.. విడుదల చేయొద్దని అభ్యర్థన.. తీర్పు రిజర్వు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడో దశాబ్దం కింద తక్కువ ధర ఉన్నప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసిన ఆస్తులను.. జప్తు చేసిన నాటికి ఉన్న విలువకు సమానంగా ఫిక్స్‌డ్ డిపాజిట్ పెడతాం.. ఆ ఆస్తులను విడుదల చేయండి.. అంటే ఎలా ఉంటుంది..? ఉదాహరణకు.. రూ.10 కోట్ల విలువైన ఒక ఆస్తిని ఈడీ పదేళ్ల నాడు జప్తు చేసింది. ఇప్పుడు దాని విలువ

మిగతా 12వ పేజీలో...



ఎస్ఐపీబీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. హాజరైన మంత్రులు, అధికారులు

వేగంగా పట్టాలెక్కాలి

త్వరితగతిన ప్రాజెక్టులు కార్యరూపం దాల్చాలి

స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానమే ప్రాతిపదిక

అధికారులు నిరంతరం సంప్రదింపులు జరపాలి

గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, బీపీసీఎల్ వంటి మెగా ప్రాజెక్టులకు అడ్డంకుల్లేకుండా చూడాలి

సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు

పెట్టుబడుల సాకారంపై నిరంతరం దృష్టి

ఇక ప్రతినెలా ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష

ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు

29,021 కోట్ల పెట్టుబడులు

22,407 ఉద్యోగాలు

విద్యుత్తు రంగంలో 11,943 కోట్లతో 9,690 ఉద్యోగాల కల్పన

ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానమే పారిశ్రామిక ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ ప్రాతిపదిక కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టులు త్వరితగతిన కార్యరూపం దాల్చాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటి వరకూ ఒప్పందాలను కుదుర్చుకున్న సంస్థల యాజమాన్యాలతో అధికారులు నిరంతరం సంప్రదింపులు జరిపి ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తి చేసేలా చూడాలన్నారు. ప్రతిష్ఠాత్మక సంస్థలు గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, బీపీసీఎల్ వంటి మెగా ప్రాజెక్టులు వరుసగా ఏర్పాటు కావాల్సి ఉందన్నారు. ఈ ప్రాజెక్టుల విషయంలో ఎలాంటి

మిగతా 12వ పేజీలో...



రఫేల్ ఫైటర్లలో.. భారత్

వాటా పెంచాలి

- భారత్‌లో తయారైన విడిభాగాలు 50% వరకు వాడాలని ఫ్రాన్స్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విజ్ఞప్తి
- భారత్ అనుసరించదు.. నేతృత్వం వహిస్తుంది: మెక్రాన్
- 114 రఫేల్ ఫైటర్ల కొనుగోలు ఒప్పందంపై రాని స్పష్టత

బెంగళూరు/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: రఫేల్ ఫైటర్ల కొనుగోలు ఒప్పందంలో భాగంగా 50శాతం వరకు భారత్‌లో తయారైన విడిభాగాలను వినియోగించాలని ఫ్రాన్స్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విజ్ఞప్తి చేశారు. బెంగళూరులో జరిగిన భారత్-ఫ్రాన్స్ ఆరో వార్షిక రక్షణ సదస్సులో ఫ్రాన్స్ రక్షణ మంత్రి కేథరీన్ వోట్రిన్‌తో 114 రఫేల్ ఫైటర్ల కొనుగోలు ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా రఫేల్ ఫైటర్ల ఇంజన్లు, వాటి పునరుద్ధరణ (ఓవర్ హాలింగ్) భారత్‌లోనే జరగాలని, అది మేకిన్ ఇండియా ప్రయత్నాలకు తోడ్పడుతుందని రాజ్‌నాథ్ కోరినట్టు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. అయితే ఈ 114 రఫేల్ ఫైటర్ల కొనుగోలుకు సంబంధించి ఇంకా ఒప్పందమేదీ జరగలేదు. మరోవైపు ముంబైలో ప్రధాని మోదీతో భేటీ అనంతరం మాట్లాడిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్..

మిగతా 2వ పేజీలో...

మా హక్కులకు భంగం

కృష్ణా జలాల పంపిణీపై ‘సెక్షన్-3’ టీవోఆర్ చెల్లదు!

సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ వాదనలు

విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారమే నీటి కేటాయింపులు ఉండాలి

ప్రాజెక్టులవారీగా ఆంక్షలు సహేతుకం కాదు

అదనపు అంశాలను పరిశీలించే అధికారం బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు లేదు: ఏపీ

2002లోపు వచ్చిన ట్రైబ్యునల్ తీర్పులపై పునఃసమీక్ష కుదరదు: చీఫ్ జస్టిస్

వాటి కేటాయింపులకు చట్ట రక్షణ ఉంది

విభజన చట్టం, టీవోఆర్‌పై లోతైన పరిశీలన అవసరం

ఈ నెల 25న సమగ్రంగా వాదనలు వింటాం

త్రిసభ్య ధర్మాసనం వెల్లడి.. విచారణ వాయిదా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల వ్యవహారంలో కేంద్రం తీరుతో రాష్ట్రాల హక్కులకు భంగం కలుగుతోందని సుప్రీంకోర్టుకు ఆంధ్రప్రదేశ్ తెలిపింది. కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు కేంద్రం జారీ చేసిన సెక్షన్-3 నిబంధనావళి (టీవోఆర్) సరికాదని, ఈ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టం కలిగే అవకాశముందని తెలిపింది. కేంద్ర నిర్ణయం ఆమోదయోగ్యం కాదని, నదీ జలవివాద చట్టం ప్రకారం.. బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు ఇలా అదనపు అంశాలు పరిశీలించే అధికారం లేదని ధర్మాసనం దృష్టికి

మిగతా 12వ పేజీలో...

పోలవరం పనులు బాగుబాగు!

వచ్చే ఏడాది జూన్‌కు పూర్తవుతుంది.. నిపుణుల విశ్వాసం 12

డయాఫ్రం వాల్ నాణ్యత భేష్

బయట 19 మీటర్ల ఎత్తు ఉండేలా చూడండి.. వాటర్ బ్లీడింగ్‌పైనా దృష్టి

అంతర్జాతీయ నిపుణుల ప్రాథమిక నివేదిక.. త్వరలోనే తుది నివేదిక!



అన్నీ తప్పుడు ఆరోపణలు

బొత్సకు హెరిటేజ్ లీగల్ నోటీసులు

వెంటనే క్షమాపణలు చెప్పండి

సంస్థ ప్రతిష్ఠ దెబ్బతీసేలా కుట్ర 12

మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోండి

లేకుంటే సివిల్, క్రిమినల్ చర్యలు

నోటీసుల్లో హెచ్చరించిన సంస్థ

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యలో..

అనంతబాబు భార్యకూ పాత్ర! 14

కాల్‌డేటా, సీసీ ఫుటేజీ ఆధారంగా నిర్ధారణ

ఆమెను ఏ-2గా చేర్చిన ప్రాసిక్యూషన్

హత్యచేశాక వారిద్దరూ ఎక్కడ తిరిగారో, ఎవరితో మాట్లాడారో ఆధారాలు సమర్పణ



ఖాళీ స్థలాలపై పన్ను రాయితీ

నిర్మాణం పూర్తయ్యేవరకూ 50% చెల్లిస్తే చాలు.. సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం 13

ఏడాదిలో 4 సార్లు ఓటు నమోదు

జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరులో అవకాశం.. పంచాయతీరాజ్ చట్టానికి సవరణ



ఉపాధిలో ఏపీ టాప్

ఆరేళ్ల తర్వాత మెటీరియల్ పనుల్లో మొదటి స్థానం

ఇప్పటి వరకు రూ.1,884 కోట్ల బిల్లులు అప్‌లోడ్

ఇప్పటికే రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో నం.1.. ఢిల్లీలో తిరిగి పుంజుకుంటున్న రాష్ట్ర ప్రతిష్ఠ 14

ఉపాధి పథకాన్ని భ్రష్టు పట్టించిన వైసీపీ ప్రభుత్వం.. దొంగ మస్టర్లు, నిధుల దుర్వినియోగంతో తలవంపులు



ఫ్లైట్ టికెట్టూ నాదే.. మ్యాచ్ టికెట్టూ నాదే

నీ దుడ్డు ఏమైనా ఖర్చు చేస్తినా జగన్: లోకేశ్ 13

మహారాష్ట్రలో ముస్లింలకు 5% రిజర్వేషన్లు రద్దు

ముంబై, ఫిబ్రవరి 18: మహారాష్ట్రలో ముస్లింలకు విద్య, ఉద్యోగాల్లో కల్పించిన 5 శాతం రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. 2014 జులైలో అప్పటి కాంగ్రెస్- ఎన్సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో మరాఠాలకు 16 శాతం, ముస్లింలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్సు జారీ చేసింది. ముస్లింలను ప్రత్యేక వెనకబడిన తరగతుల (బీసీ-ఏ) జాబితాలో చేర్చి రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. కానీ 2014 నవంబరులో బాంబే హైకోర్టు స్టే విధించింది. సుప్రీంకోర్టు కూడా ఆ కోటా చెల్లదని ప్రకటించడంతో ఆ రిజర్వేషన్లు అమలులోకి రాలేదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఆనాటి ఉత్తర్వులను అధికారికంగా రద్దు చేయలేదు. ముస్లింలకు కల్పించిన 5 శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తూ తాజాగా జీవో జారీ చేసింది. అలాగే ఆ కోటాకు సంబంధించి కుల ధ్రువీకరణ, నాన్- క్రీమీలేయర్ పత్రాల జారీని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

ముగ్గురు ఐఏఎస్‌లను పెళ్లాడిన ఐఏఎస్ ఆఫీసర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: అబ్బాయిలకు పెళ్లి కావడం కష్టంగా మారిన ఈ రోజుల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ ఐఏఎస్ అధికారి మూడు పెళ్లిళ్లు చేసుకున్నారు. అంతేనా.. ఆయన పెళ్లాడిన ముగ్గురూ ఐఏఎస్ అధికారిణులే కావడం ఇక్కడ వింత. ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్‌కు చెందిన అవీ ప్రసాద్ 2013లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2014లో మరోసారి సివిల్స్ పరీక్షలు రాసి ఐఏఎస్ అయ్యారు. రాజకీయ కుటుంబనేపథ్యం కలిగిన అవీ ప్రసాద్.. సివిల్స్ పరీక్షకు సిద్ధమవుతున్నప్పుడు పరిచయమైన రిజు బాఫ్నా అనే అమ్మాయిని మొదట పెళ్లి చేసుకున్నాడు. ఆమె ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని షాజాపూర్ జిల్లా కలెక్టర్‌గా పని చేస్తుండగా.. అవీ ప్రసాద్, రిజు కొన్నేళ్లకు విడాకులు తీసుకున్నారు. తర్వాత ఏపీకి చెందిన 2016 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి మిషా సింగ్‌ను అవీ పెళ్లాడారు. పెళ్లి తర్వాత మధ్యప్రదేశ్ క్యాడర్‌కు మారిన మిషా సింగ్ ప్రస్తుతం రత్లాం కలెక్టర్‌గా పని చేస్తున్నారు. నాలుగేళ్లు కలిసి ఉన్న తర్వాత అవీ ప్రసాద్, మిషా సింగ్ విడాకులు తీసుకున్నారు. ఇక, ముచ్చటగా మూడో సారి అన్నట్టు ఈసారి 2017 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి అంకితా ధాకరేని అవీ ప్రసాద్ ఫిబ్రవరి 11న పెళ్లి చేసుకున్నారు.


అవీ ప్రసాద్

అమెరికా ఉద్యోగ వృద్ధిలో 88% క్షీణత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న కఠిన వలస విధానాల ప్రభావం అమెరికా ఉద్యోగ వృద్ధి రేటుపై పడింది. అగ్రరాజ్యానికి తగ్గుముఖం పట్టిన అనధికార వలసలకు అనుగుణంగా కొత్త ఉద్యోగాల సృష్టిలోనూ భారీ క్షీణత నమోదైంది. ముఖ్యంగా నిర్మాణ, తయారీ రంగాలపై ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. శాన్‌ఫ్రాన్సిస్కో ఫెడరల్ రిజర్వు మంగళవారం ప్రచురించిన నివేదిక ప్రకారం.. 2024లో అమెరికాలో దాదాపు 14,60,000 ఉద్యోగాలు అందుబాటులోకి రాగా, 2025లో ఉద్యోగ వృద్ధి దాదాపు 88 శాతం తగ్గి కేవలం 1,81,000కు పడిపోయింది. వలసలు తగ్గడమే ఈ మందగమనానికి కారణమని ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

యాంటీబయాటిక్స్ విఫలమవుతున్నాయా..?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ఇటీవలి కాలంలో యాంటీబయాటిక్స్ వాడకం ఎక్కువైంది. ఇలా మితిమీరిన వాడకం వల్ల యాంటీబయాటిక్ నిరోధకత పెరిగి మందులు పనిచేయని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది తీవ్రమైన ఇన్ఫెక్షన్లకు దారి తీస్తుంది. ఐసీఎంఆర్ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో వివిధ కారణాలతో ఆస్పత్రుల్లో చేరుతున్న రోగుల్లో 20% మందిలో ఇన్ఫెక్షన్లు అభివృద్ధి చెందుతున్నాయని, ఇలా ఇన్ఫెక్షన్లు సోకిన ప్రతి ఐదుగురిలోనూ ఒకరిలో కార్బాపెనెమ్స్ ఔషధ నిరోధకత కనిపించిందని గుర్తించారు. ఇన్ఫెక్షన్లు తగ్గించడానికి చివరి ప్రయత్నంగా ఇచ్చే అత్యంత శక్తిమంతమైన ఔషధం ఇది. అలాంటి పవర్‌ఫుల్ యాంటీబయాటిక్ కూడా పనిచేయని పరిస్థితి ఆందోళన రేపుతోంది.

దుబాయ్‌లో 2 వేల మంది ఖైదీల విడుదల

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: గల్ఫ్ దేశాలలో బుధవారం నుంచి రంజాన్ ప్రారంభమైంది. సాధారణంగా భారత్ కంటే ఒక రోజు ముందుగా గల్ఫ్ దేశాలలో రంజాన్ ప్రారంభమవుతుంది. ముస్లింల పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని దుబాయ్‌లో 2వేల మంది ఖైదీలను విడుదల చేస్తూ దుబాయి రాజు షేక్ మహమ్మద్ బిన్ ఆదేశాలు జారీ చేశారు. అబుదాబీ రాజు, యూఏఈ అధ్యక్షుడు కూడా అయిన షేక్ మహమ్మద్ బిన్ జాయేద్ అబుదాబీలో 1440మంది ఖైదీలను విడుదల చేశారు. షార్జా రాజు షేక్ సుల్తాన్ అల్ ఖాస్మీ 738 మంది ఖైదీలను విడుదల చేశారు. కాగా, భారత్‌లో రంజాన్ గురువారం నుంచి ప్రారంభం కానుంది.

నేను పోతే నిన్నెవరు చూసుకుంటారు..?

▸▸ భార్యను చంపేసిన ఇస్రో మాజీ ఉద్యోగి

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): 'నేను లేకుంటే నువ్వు ఒంటరి అవుతావు. అప్పుడు నిన్నెవరు చూసుకుంటారు..?' అని భార్యను గొంతు నులిమి హత్య చేశాడు ఇస్రో మాజీ ఉద్యోగి. ఈ ఘటన బెంగళూరులో జరిగింది. ఆవలహళ్లి పరిధిలోని విర్టుసో అపార్ట్‌మెంట్‌లో నాగేశ్వర రావు(70), సంధ్యాశ్రీ (65) దంపతులు ఉంటున్నారు. వీరి కుమార్తె అమెరికాలో స్థిరపడినట్టు సమాచారం. ఉద్యోగ విరమణ చేశాక, వృద్ధాప్యంలో నాగేశ్వరరావు మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. తాను మృతి చెందితే తన భార్యను చూసుకునేవారు ఎవరూ లేరని, ఆమె భవిష్యత్తు ఎలా ఉంటుందో అనే భయంతోనే చంపేశానని ఆయన అంగీకరించారు.

ఐటీయూ డైరక్టర్ అభ్యర్థిత్వానికి మద్దతివ్వండి

కేంద్ర కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయూ) రేడియో కమ్యూనికేషన్ బ్యూరో డైరెక్టర్ పదవికి పోటీపడుతున్న ఎం. రేవతి అభ్యర్థిత్వానికి యూకే మద్దతు ఇవ్వాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా యూకేకు చెందిన ఏఐ, ఆన్‌లైన్ భద్రత, పార్లమెంటరీ అండర్ సెక్రటరీ కనిష్క నారాయణ్‌తో పెమ్మసాని బుధవారం భేటీ అయ్యారు. గ్లోబల్ స్పెక్ట్రం నిర్వహణ, రేడియో కమ్యూనికేషన్ విధానాల రూపకల్పనలో భారత్ నాయకత్వాన్ని యూకే బలపరచాలని కోరారు. ఐటీయూ ప్లెనిపోటెన్షియరీ కాన్ఫరెన్స్ (పీపీ-2030) భారత్‌లో నిర్వహించాలన్న ప్రతిపాదనకు మద్దతు ఇవ్వాలన్నారు.

'హర్మూజ్'లో యుద్ధ మేఘాలు!

ఇటు అమెరికా యుద్ధ నౌకలు, బలగాల మోహరింపు.. అటు ఇరాన్, రష్యా, చైనా ఉమ్మడి సైనిక విన్యాసాలు

▸▸ జలసంధిని తాత్కాలికంగా మూసివేసిన ఇరాన్


హర్మూజ్ జలసంధిలో ఇరాన్ సైనిక విన్యాసాలు

వాషింగ్టన్/టెహ్రాన్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: పశ్చిమాసియాలో కీలకమైన హర్మూజ్ జలసంధిలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఓవైపు అమెరికా యుద్ధ నౌకలు, బలగాల మోహరింపు.. మరోవైపు ఇరాన్, రష్యా, చైనా యుద్ధ నౌకలతో సంయుక్త నావికాదళ విన్యాసాలతో కవ్వింపులతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ విన్యాసాల కోసమని హర్మూజ్ జలసంధిని ఇరాన్ పాక్షికంగా మూసివేయడమూ కలకలం రేపుతోంది. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో అమెరికా, ఇరాన్ చర్చలు సానుకూలంగానే జరిగాయని చెబుతున్నా.. కీలకమైన అణుశుద్ధి నిలిపివేత, క్షిపణుల గరిష్ఠ సామర్థ్యంపై పరిమితులు వంటి అంశాలను ఇరాన్ అంగీకరించకపోవడం ఆందోళన రేపుతోంది. అణుశుద్ధి విషయంలో ఇరాన్ దిగిరాకపోతే యుద్ధం మొదలుపెట్టేందుకు అమెరికా సిద్ధమైందని.. కనీసం రెండు, మూడు వారాల పాటు యుద్ధం కొనసాగేందుకు వీలుగా ఏర్పాట్లు జరుగుతున్నాయని అమెరికా రక్షణ వర్గాలను ఉటంకిస్తూ ఆక్సియోస్ న్యూస్, టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ తాజాగా కథనాలు ప్రచురించాయి. ఇరాన్‌కు సమీపంగా ఇప్పటికే యూఎస్ఎస్ లింకన్ విమాన వాహక యుద్ధ నౌకను మోహరించిన అమెరికా మరిన్ని బలగాలను పశ్చిమాసియా వైపు తరలిస్తోంది. మదురోను అదుపులోకి తీసుకునే సమయంలో కరీబియన్ ప్రాంతంలో మోహరించిన యూఎస్ఎస్ జెరాల్డ్ ఫోర్డ్ యుద్ధ నౌకను, క్షిపణి రక్షణ వ్యవస్థలను పశ్చిమాసియా వైపు పంపింది. తాజాగా 50కిపైగా ఎఫ్-22, ఎఫ్-35, ఎఫ్-16 తరహా యుద్ధ విమానాలు, వాటికి గాల్లోనే ఇంధనం నింపే రీఫ్యూయలింగ్ విమానాలను కూడా యూరప్, గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా స్థావరాలకు తరలించినట్టు విమాన ట్రాకింగ్ సంస్థలు వెల్లడించాయి. కాగా, స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో అమెరికా, ఇరాన్ మధ్య మంగళవారం రెండో దశ చర్చలు జరిగాయి. భవిష్యత్తు చర్చలకు సంబంధించిన మార్గదర్శక అంశాలపై ఇందులో కాస్త స్పష్టత వచ్చిందని ఇరాన్ పేర్కొంది.

రష్యా, చైనా, ఇరాన్.. యుద్ధ విన్యాసాలు

ఓవైపు అమెరికా బలగాల మోహరింపు పెరుగుతున్న సమయంలో.. హర్మూజ్ జలసంధిలోని ఇరాన్ నౌకాదళ స్థావరం బందర్ అబ్బాస్ వద్ద ఇరాన్, రష్యా, చైనా ఉమ్మడి నౌకాదళ విన్యాసాలు చేపట్టాయి. ఇందుకోసం రష్యాకు చెందిన 'కోర్వెట్ స్టోయికియ్' యుద్ధ నౌకతో కూడిన బాల్టిక్ ఫ్లీట్ ఇప్పటికే బందర్ అబ్బాస్ స్థావరానికి చేరుకుంది. చైనా కూడా తన నౌకాదళ బృందాన్ని పంపింది. 'మ్యారీటైమ్ సెక్యూరిటీ బెల్ట్-2026' పేరిట గురువారం నుంచి మూడు దేశాల ఉమ్మడి నౌకాదళ విన్యాసాలు ప్రారంభంకానున్నాయి. దీనితో హర్మూజ్ జలసంధిని తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు ఇరాన్ ప్రకటించింది. విన్యాసాలు ముగిసిన తర్వాత నౌకలు ప్రయాణించవచ్చని పేర్కొంది.

యుద్ధ నౌకలు మునిగిపోవచ్చు

అమెరికా నౌకాదళం, యుద్ధ నౌకలు అత్యంత భారీగా ఉండొచ్చని.. కానీ ఏదో ఒక సమయంలో అవి అంతే భారీగా దెబ్బతినే పరిస్థితి వస్తుందని ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ పేర్కొన్నారు. భారీ యుద్ధ నౌకలు కూడా మునిగి సముద్రం అడుగుకు చేరవచ్చని 'ఎక్స్'లో పోస్టు చేశారు. పౌర అవసరాల కోసం అణుశుద్ధి చేసుకునే హక్కు ఇరాన్ సహా ప్రతి దేశానికీ ఉందని స్పష్టం చేశారు. క్షిపణుల సామర్థ్యంపై నియంత్రణ విధించాలన్న అమెరికా ఒత్తిళ్లను ప్రస్తావిస్తూ.. క్షిపణుల సామర్థ్యం తగ్గించేందుకు అంగీకరించబోమని స్పష్టం చేశారు.

అసెంబ్లీ ఆమోదించిన 3 పేర్ల నుంచే గవర్నర్ నియామకం!

▸▸ జస్టిస్ కురియన్ కమిటీ సిఫారసు

▸▸ తమిళనాడు అసెంబ్లీలో నివేదిక


జస్టిస్ కురియన్ జోసెఫ్

చెన్నై, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ ఆమోదించిన పేర్ల ఆధారంగా గవర్నర్‌ను నియమించాలని కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలోని కమిటీ రూపొందించిన నివేదికలో సిఫారసు చేసింది. గవర్నర్లకు పునరుద్ధరించలేని ఐదేళ్ల పదవీకాలాన్ని నిర్ణయించాలని సూచించింది. ఇందుకోసం ఆర్టికల్ 156ని సవరించాలని పేర్కొంది. శాసనసభలోని మొత్తం సభ్యుల్లో మెజారిటీ ఆమోదించిన మూడు పేర్లలో ఒకరిని రాష్ట్ర గవర్నర్‌గా నియమించడానికి రాష్ట్రపతి కట్టుబడి ఉండేలా రాజ్యాంగంలోని ఆర్టికల్ 155ని సవరించాలని కమిటీ సిఫారసు చేసింది. కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై గత ఏడాది తమిళనాడు ప్రభుత్వం జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ కమిటీ తొలి నివేదికను రెండు రోజుల క్రితం సీఎం స్టాలిన్‌కు అందించగా, దానిని స్టాలిన్ బుధవారం శాసనసభ ముందుంచారు. భాషా వివాదంపైన కూడా కమిటీ పలు సిఫారసులు చేసింది. 'ఒక దేశం-ఒక భాష అనే భ్రమను వదిలేయాలి. ఎందుకంటే నిజమైన ఐక్యత భాషా ఏకరూపత నుంచి కాదు, భాషా సమానత్వం నుంచి పుడుతుంది. రాజ్యాంగబద్ధంగా భారతదేశ శాశ్వత అధికారిక భాషగా ఇంగ్లీషును చేర్చడానికి ఆర్టికల్ 343కు సవరణ చేపట్టాలి' అని సిఫారసు చేసింది. రాష్ట్ర స్వయంప్రతిపత్తిని ఉల్లంఘించే అనాగరిక ఆర్టికల్ 347ను వదిలివేయాలని సూచించింది.


ఫ్రాన్స్ రక్షణ మంత్రి కాథరిన్‌తో రాజ్‌నాథ్‌సింగ్

రఫేల్ ఫైటర్లలో.. భారత్ వాటా పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

'రఫేల్ ఫైటర్ల నుంచి జలాంతర్గాముల వరకు రక్షణ సహకారం పెంచుకుంటున్నాం' అని పేర్కొన్నారు.ఈ క్రమంలో ఫ్రాన్స్ నుంచి మరికొన్ని స్కార్పీన్ తరహాకు చెందిన జలాంతర్గాములను కొనుగోలు చేసే అవకాశం ఉందని అంటున్నారు. ప్రపంచ సృజనాత్మక రంగంలో భారత్ ప్రాభవం పెరుగుతోందని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ 'భారత్-ఫ్రాన్స్ ఇన్నోవేషన్ ఫోరమ్' కార్యక్రమంలో ప్రశంసించారు. "ఆల్ఫాబెట్ (గూగుల్) సీఈవో భారతీయుడే. మైక్రోసాఫ్ట్, ఐబీఎం, అడోబ్, పాలో ఆల్టో నెట్‌వర్క్స్ సీఈవోలు భారతీయులే. ప్రపంచ సృజనాత్మక రంగంలో భారత్ కేవలం భాగస్వామి కాదు.. దానిని ముందుండి నడిపిస్తున్న దేశమిది. భారత్ ఆవిష్కరణల శక్తి కేవలం ప్రతిభావంతులైన వ్యక్తులలో మాత్రమేకాదు.. ఆ ఆవిష్కరణలను క్షేత్రస్థాయిలోకి ప్రజల్లోకి తీసుకెళ్లే సామర్థ్యంలో ఉంది" అని పేర్కొన్నారు. కాగా, మూడు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం భారత్‌కు వచ్చిన మెక్రాన్.. రెండో రోజు బుధవారం ముంబైలో ఛత్రపతి శివాజీ రైల్వే టెర్మినస్‌ను సందర్శించారు. అనంతరం ఢిల్లీకి చేరుకున్నారు. గురువారం ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొననున్నారు.

ఏఐ సదస్సులో చైనా రోబో డాగ్‌పై వివాదం

▸▸ గల్గోటియాస్ వర్సిటీ క్షమాపణలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఓ వర్సిటీ నిర్వాకం తీవ్ర విమర్శలకు దారితీసింది. గ్రేటర్ నోయిడాకు చెందిన ప్రైవేటు యూనివర్సిటీ గల్గోటియాస్ ఏఐ సదస్సులో ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. అందులో 'ఓరియన్' పేరిట రూపొందించిన రోబో డాగ్‌ను ప్రదర్శించింది. దాన్ని తమ వర్సిటీలోనే అభివృద్ధి చేసినట్లు వర్సిటీ ప్రతినిధి మీడియాకు తెలిపారు. ఆ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అలాంటి రోబో డాగ్‌నే చైనా రోబోటిక్ కంపెనీ యూనిట్రీ జీవో2 పేరిట విక్రయిస్తోంది. భారత్‌లోనూ వాటిని విక్రయిస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన నెటిజన్లు యూనివర్సిటీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విదేశీ సాంకేతికతను తమ ఆవిష్కరణగా ప్రచారం చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో స్టాల్‌ను ఖాళీ చేసి వెళ్లిపోవాలని నిర్వాహకులు వర్సిటీని ఆదేశించారు. ఈ అంశంపై బుధవారం యూనివర్సిటీ వివరణ ఇచ్చింది. స్టాల్‌లో ఉన్న తమ ప్రతినిధి అవగాహనా రాహిత్యం వల్లే ఈ గందరగోళం ఏర్పడినట్లు తెలిపింది. ఆ రోబో డాగ్‌ను చైనా సంస్థ నుంచే కొనుగోలు చేశామని, విద్యార్థులు నేర్చుకోవడానికి ఒక సాధనంగా వాడుతున్నామని వెల్లడించింది. "ఏఐ సదస్సులో గందరగోళం నెలకొన్నందుకు క్షమాపణలు కోరుతున్నాం. మా ప్రతినిధి ఒకరు అవగాహనా రాహిత్యంతో మాట్లాడారు. ఆమెకు రోబోడాగ్‌కు సంబంధించిన సాంకేతిక అంశాల గురించి అవగాహన లేదు. కెమెరా ముందు అత్యుత్సాహంతో మాట్లాడుతూ తప్పుడు సమాచారం ఇచ్చింది. ఆ ఆవిష్కరణ గురించి తప్పుడు సమాచారం వ్యాప్తి చేయాలన్న ఉద్దేశం మాకు లేదు" అని వర్సిటీ అధికార ప్రతినిధి తెలిపారు. కాగా, బుధవారం ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ స్పందిస్తూ.. సదస్సులో ఎవరైనా ఇతరులు తయారు చేసిన వస్తువులను తాము అభివృద్ధి చేసినట్లుగా చెప్పుకోవడాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని చెప్పారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. సరైన ప్లానింగ్ లేకుండా, చైనా వస్తువుల గురించి కూడా ప్రచారం చేసుకుంటున్నారంటూ కేంద్రాన్ని ఉద్దేశించి విమర్శలు చేశారు. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ ఘాటుగా స్పందించింది. ఏ మాత్రం మేధస్సే లేని వారు కృత్రిమ మేధ గురించి రెడీమేడ్ ట్వీట్‌లు పోస్ట్ చేయకూడదని రాహుల్‌ని తీవ్రంగా విమర్శించింది. ప్రపంచ వేదికలపై భారతదేశం ప్రముఖ పాత్ర పోషిస్తున్న సమయంలో దేశ ప్రతిష్ఠను దిగజార్చడమే రాహుల్ పనిగా పెట్టుకొంటారని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ధ్వజమెత్తారు.

ఏడుగురు దేశాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు

▸▸ ఏఐ సమ్మిట్ నేపథ్యంలో మోదీ బిజీబిజీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ఒక్కరోజే ఏడు దేశాల అధ్యక్షులు, ప్రధానులతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రెండు కంపెనీల సీఈవోలతో సమావేశమయ్యారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఢిల్లీకి చేరుకున్న ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ గుటెర్రెస్, ఐఎంఎఫ్ ఎండీ క్రిష్టినా జార్జియేవా, శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే, భూటాన్ ప్రధాని త్సెరింగ్ తోబ్గే, మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గూలమ్, క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెంకోవిక్, సెర్బియా అధ్యక్షుడు అలెక్సాండర్ వుసిస్, స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్, ఫిన్‌లాండ్ ప్రధానమంత్రి పీటెరి ఆర్పో, ఎస్తోనియా అధ్యక్షుడు అలార్ కరిస్, షీసెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిల్లే, గ్రీస్ ప్రధాని కైరియాకోస్ మిట్సోటకిస్ గయానా ఉపాధ్యక్షుడు భార్రత్ జగ్దేవ్ తదితరులకు స్వాగతం పలికారు. ఏడుగురు దేశాధినేతలతో వేర్వేరుగా సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ప్రపంచ దిగ్గజ టెక్నాలజీ సంస్థ గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, కోస్లా వెంచర్స్ సహ వ్యవస్థాపకుడు వినోద్ ఖోస్లాతో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ జరుగుతున్న భారత్ మండపంలో సమావేశమయ్యారు. ఈ సదస్సుకు విచ్చేసిన దేశాధినేతలు, కంపెనీల సీఈవోలు, ప్రతినిధులకు ప్రధాని బుధవారం రాత్రి విందు ఇచ్చారు. ప్రధాని గురువారం ఏఐ సమ్మిట్‌లో ప్రసంగించనున్నారు.


ఆ బాలిక మీద జరిగింది అత్యాచార యత్నమే!

▸▸ పైజామా నాడా లాగటాన్ని ఆ విధంగానే పరిగణించాలి

▸▸ యూపీ బాలిక ఉదంతంపై సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: మహిళ పైజామా నాడా లాగటం, రొమ్ములను తడమటం.. అత్యాచార యత్నం కిందికే వస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. అటువంటి చర్యలను అత్యాచారం చేయటానికి సిద్ధమవటంగానే చూడాలి గానీ అత్యాచారయత్నంగా నిర్ధారించలేమన్న అలహాబాద్ హైకోర్టు తీర్పును కొట్టివేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని త్రిసభ్య ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. 2021 నవంబరు 10వ తేదీన యూపీకి చెందిన ఒక మహిళ 14 ఏళ్ల వయసున్న తన కుమార్తెతో బంధువుల ఇంటికి వెళ్లి.. తిరిగి తమ ఇంటికి నడిచి వస్తుండగా.. తమ గ్రామానికే చెందిన పవన్, ఆకాశ్, అశోక్ అనే ముగ్గురు యువకులు బైకు మీద వస్తూ వారికి తారసపడ్డారు. బాలికను బైక్ మీద ఇంటి వరకూ తీసుకెళ్తామని చెబితే, వారిని నమ్మి ఆ మహిళ కుమార్తెను వారితో పంపింది. కానీ, ఆ యువకులు ఆ బాలికను దారిలో ఓ కల్వర్టు కిందికి తీసుకెళ్లి.. ఆమె రొమ్ములు నిమరటం, పైజామా లాగే ప్రయత్నం చేయటం వంటి దుశ్చర్యకు పాల్పడ్డారు. బాలిక కేకలు వేయటంతో.. దారిన వెళ్తున్న కొందరు వచ్చి ఆమెను కాపాడారు. దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనపై బాలిక తల్లి.. యూపీలోని కాస్‌గంజ్ పోక్సో ప్రత్యేక కోర్టులో పిటిషన్ వేయగా.. నిందితుల్లో ఇద్దరిపై అత్యాచార యత్నం కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. 2023 జూన్‌లో ఈ ఉత్తర్వులు రాగా.. వాటిని నిందితులు అలహాబాద్ హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై 2025 మార్చిలో జస్టిస్ రాం మనోహర్ మిశ్రా తీర్పునిస్తూ.. నిందితుల చర్యను అత్యాచారానికి సిద్ధపడుతున్న ఘటనగానే పరిగణించాలి గానీ.. రేప్ యత్నంగా చూడవద్దంటూ తీర్పు ఇచ్చారు. ఈ తీర్పు మీద అప్పట్లో తీవ్రంగా విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, సుమోటోగా విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. హైకోర్టు తీర్పు నేరవిచారణ నిబంధనలను తప్పుడుగా అన్వయించినట్లు తెలుతోందని, కాబట్టే, ఆ తీర్పును కొట్టేస్తున్నామని తెలిపింది. పోక్సో కోర్టు విచారణ కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది.




సోనోవిజన్ వార్షికోత్సవ సంబరాలు
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్ అందించే అతిపెద్ద ఎలక్ట్రానిక్ స్టోర్
అతి తక్కువ ధరలు
Lowest Prices
GUARANTEED
Best Service
నమ్మకమైన సర్వీస్
సోనోవిజన్
Anniversary Sale
SONOVISION
Anniversary
SALE
SPECIAL
DISCOUNT
Anniversary SPECIAL OFFER
Upto 22.5% క్యాష్‌బ్యాక్ | 0% ఇంట్రస్ట్ | 1EMI Free
BAJAJ FINSERV HDB FINANCIAL SERVICES అన్ని క్రెడిట్ కార్డ్ EMI ఫైనాన్స్ కొనుగోలుదారులకు, సెలెక్టెడ్ మోడల్స్‌పై, షరతులు వర్తిస్తాయి. IDFC FIRST Bank HDFC BANK
LED UHD 4K Smart Tv's
LG
SAMSUNG
SONY
Panasonic
LLOYD
TCL
Haier
Home Theatre
195 Cm (77") Ultra HD 4K OLED
139 Cm (55") Ultra HD 4K Smart
189 Cm (75") LED 4K Ultra UHD
164 Cm (65") LED 4K Ultra HD Smart
108 Cm (43") LED 4K HD
108 Cm (43") Ultra 4K Google LED
108 Cm (43") 4K Google LED
108 Cm (43") UHD Google LED
Air Conditioners
LG LLOYD BLUE STAR SAMSUNG VOLTAS DAIKIN HITACHI Godrej Panasonic Haier
Refrigerators
LG SAMSUNG Whirlpool Haier Godrej VOLTAS beko LLOYD
SBS Ref. 630 Ltrs
SBS Ref. 650 Ltrs
FF Ref. 272 Ltrs
DC Ref. 210 Ltrs
DC Ref. 188 Ltrs
Washing Machines
LG SAMSUNG BOSCH IFB Whirlpool LLOYD
Automatic Washing Machines
12/7 KG Front Load
9 KG Front Load
7 KG Top Load
7 KG Semi Load
Air Coolers
VOLTAS
BAJAJ Electricals
Crompton
KENSTAR
orient electric
Symphony
Mobile Phones
vivo 5G V-60e
Upto 10% Cash Back 9/0, 10/2, 12/4 Schemes Available
oppo 5G F-31, F-31 Pro+
6/0, 7/0, 8/0, 11/2 Schemes Available
iPhone 17, 17 Pro Upto 4000/- Cash Back
17 Pro Max Upto 3000/- Cash Back
iPhone Air New Arrival
9/0, 12/0 Schemes Available ICICI Credit Cards and Selected Bank Cards (Exchange Bonus)
SAMSUNG S-25 Ultra 5G Discount Upto 7000/-
A-56 5G Instant Discount Upto 2000/-
9/0, 12/0, 24/0 Schemes Available
ONEPLUS 5G 15
CashBack 4500/- SBI, RBL Credit Card 12/4 Scheme Available
realme 5G 16 Pro, 16 Pro+
6/0, 8/2, 10/3 Schemes Available
mi Redmi 5G Note 15 Series
6/0, 8/0, 10/2, 12/4 Schemes Available
Laptops & Mobile Accessories
Upto 10000/- cashback on Laptops
hp 12/4 Scheme Available
Lenovo 12/4 Scheme Available
DELL 15/5 Scheme Available
ASUS 12/4 Scheme Available
MacBook 24/0 Scheme Available
Smart Watch
Ear Buds
Mobile Accessories Boat, Realme, Fastrack, Hapipola
boAt JBL Sound Bar
Kitchen Small Appliances
Water Dispenser
Water Purifier RO
Water Geyser 10 Litres
Microwave Oven
Air Chimney
3 Burner Glass Cooktop
Wet Grinder
Rice Cooker
Mixer Grinder 3 Jar, 750 Watts
Juicer
Air Fryer
Kettle
Iron Box
Blender
Conditions apply
LG SAMSUNG SONY LLOYD BLUE STAR VOLTAS DAIKIN HITACHI Godrej Panasonic Haier Whirlpool TCL BOSCH IFB BPL Carrier Crompton BAJAJ KENSTAR orient Symphony
iPhone vivo oppo realme ONEPLUS hp DELL ASUS Lenovo MacBook KENT EUREKA FORBES FABER pureit Livpure V-GUARD Sunflame AO Smith Butterfly Vidiem Prestige HAVELLS morphy richards BAJAJ Electricals Preethi
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
త్వరలో ప్రారంభం కానున్న మా నూతన షోరూం సోనోవిజన్, బాపట్ల మెయిన్ రోడ్, బాపట్ల. ఫోన్ : 9246666207.
జిన్నాటవర్ సెంటర్, గుంటూరు. 9154279910, 9440804185
లక్ష్మీపురం మెయిన్ రోడ్డు, గుంటూరు. 9246667373, 9154867822, 23, 24
బ్రాడిపేట, గుంటూరు. 9246666215, 9100991706
బ్రమ్మం గారి రోడ్డు, లక్ష్మీపురం, గుంటూరు. 9246666204, 9154279905.
అరండల్‌పేట, రైల్వేస్టేషన్ రోడ్, నరసరావుపేట. 8712648710, 11, 12.
రత్నా టాకీస్ దగ్గర, తెనాలి. 8333924937, 9154279903
టౌన్ చర్చ్ ఎదురు, బోస్‌రోడ్, తెనాలి. 9246666211, 9154279901
మునిసిపల్ ఆఫీస్ ఎదురు, రేపల్లె. 9390006609, 9154281200
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి. 7331149366, 367, 368
బాపూజీ మార్కెట్, ఒంగోలు. 9246666329, 9154279911, 12.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇమ్రాన్‌కు సంఘీభావం

పాకిస్తాన్ మాజీ ప్రధాని, ప్రముఖ క్రికెటర్ ఇమ్రాన్‌ఖాన్ ఆరోగ్యం విషయంలో యావత్ ప్రపంచానికి ఉన్న అనుమానాలను, భయాలను ఆ పద్నాలుగు మంది ప్రపంచస్థాయి క్రీడాకారుల లేఖ ప్రతిబింబిస్తోంది. జైలులో ఆయన తీవ్ర అనారోగ్యంతో ఉన్నారన్న వార్తల నేపథ్యంలో మాజీ కెప్టెన్లంతా కలసికట్టుగా పాకిస్తాన్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఒక బహిరంగ లేఖ విడుదల చేయడం సరైన సమయంలో, సరైన చర్య. టీమ్ ఇండియా మాజీ కెప్టెన్లు కపిల్‌దేవ్, సునీల్ గవాస్కర్ సహా ఆ లేఖమీద సంతకాలు చేసినవారంతా ప్రపంచవ్యాప్తంగా పేరుప్రఖ్యాతులున్నవారే కనుక, ఈ చర్య పాకిస్తాన్ మీద కచ్చితంగా ఒత్తిడిపెంచుతుంది. ప్రపంచ క్రికెట్‌కు ఇమ్రాన్ చేసిన సేవలు, అందించిన చోదక శక్తిని ప్రస్తావిస్తూ, కెప్టెన్‌గా ఆయన క్రీడారంగానికి, దేశానికి నాయకత్వాన్ని అందించిన విషయాన్ని వారు గుర్తుచేశారు. ఆయనకు చక్కని వైద్యచికిత్స దక్కాలని, అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా నిర్బంధ పరిస్థితులు ఉండాలని, కుటుంబ సభ్యులను, న్యాయవాదులను ఆయనను కలిసేందుకు అనుమతించాలని, ఏ అవరోధాలూ అడ్డంకులూ లేని న్యాయప్రక్రియకు అవకాశం దక్కాలని, అది పారదర్శకంగా సాగాలని వీరంతా విజ్ఞప్తి చేయడం బాగుంది. ఆటకు భౌగోళిక సరిహద్దులు లేవని, అది విశ్వవ్యాప్తమైనదని ఈ లేఖ చాటుతోంది.

ఇటువంటి లేఖలు అరుదు. ఇమ్రాన్ ఆరోగ్యం గురించి వినబడుతున్న వార్తలు తమకు ఆందోళన కలిగిస్తున్నాయని వీరంతా పేర్కొనడం పాక్ ప్రజలను సైతం అప్రమత్తం చేస్తుంది. పాకిస్తాన్ ప్రభుత్వానికి ఈ లేఖ పెద్ద ఎదురు దెబ్బ అని స్పందించిన తీరు, పడిన హడావుడి స్పష్టంగా కనిపిస్తోంది. ఇమ్రాన్ సుబ్బరంగా ఆరోగ్యంగా ఉన్నారంటూ ఆయన భోజనం చేస్తున్న చిత్రంతో పాటు, రోజూ తినే ఆహారపదార్థాల జాబితాను కూడా పాక్ ప్రభుత్వం విడుదల చేసింది. గాలీ వెలుతురూ చక్కగా ఉన్న ఏడు గదుల ప్రత్యేక సముదాయంలో ఉదయం అల్పాహారం నుంచి రాత్రి నిద్రపోయేవరకూ ఏమేమి తింటున్నారో వివరించింది. అయినప్పటికీ, ఆయన ఆరోగ్యం పట్ల సాగుతున్న ప్రచారం ఏ మాత్రం తగ్గలేదు. ఆయన కుమారులు, సోదరి అదేపనిగా ఆరోపణలు చేస్తున్నారు. ఆయన జైల్లోనే కన్నుమూశారంటూ అడపాదడపా ప్రచారం జరుగుతూనే ఉంది. అనేక కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఇమ్రాన్‌ఖాన్‌ను జైలు అధికారులు తీవ్ర మానసికక్షోభకు గురిచేస్తున్నారని, ఆయన పట్ల అమానవీయంగా వ్యవహరిస్తున్నారని వార్తలు వెలువడ్డాయి. నిబంధనలకు భిన్నంగా అధిక గంటలు జైలు గదిలో నిర్బంధించడం వల్ల ఆయన శారీరక, మానసిక ఆరోగ్యం క్షీణించిందని, కంటిచూపు కోల్పోతున్నారని, కుడి కన్ను అత్యధికంగా దెబ్బతిన్నదనీ చెబుతున్నారు. సుప్రీంకోర్టు నియమించిన న్యాయనిపుణుడి ప్రత్యేక పరిశీలనలో ఇటువంటివి అనేకం వెల్లడైన నేపథ్యంలో, ఇమ్రాన్ వైద్యపరీక్షలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించింది కూడా. అయితే, ఇది తాత్కాలిక ఉపశమనమే. దిగజారుతున్న ఇమ్రాన్ ఆరోగ్యాన్ని న్యాయస్థానాలు ఎప్పటికప్పుడు జోక్యం చేసుకొని కాపాడటం అసాధ్యం. సమీపకాలంలో ఇమ్రాన్ జైలునుంచి బయటకు రాలేడన్నది వాస్తవం. ఆయన కథని జైల్లోనే ముగించాలని పాకిస్తాన్‌లో అత్యంత శక్తిమంతుడైన సర్వసైన్యాధ్యక్షుడు ఆసిమ్ మునీర్ కంకణం కట్టుకున్నారని పాకిస్తాన్ ప్రజల నమ్మకం.

తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ అధినేతగా, రాజకీయ నాయకుడిగా మారిన ఇమ్రాన్‌ఖాన్‌ను సులభంగా చరిత్రలోకి నెట్టేయవచ్చునని పాక్ పాలకులు నమ్ముతున్నారేమో. ఒక క్రీడాదిగ్గజంగా ఆయనకున్న విశేష ప్రజాదరణ రాజకీయరంగంలో ఆయన మనుగడను ఎంతో తోడ్పడిందని పాక్ ప్రభుత్వం మరిచిపోకూడదు. ఆ ప్రజాబలం కారణంగానే, ప్రత్యర్థులంతా ఒక్కటై, అమెరికా ఆశీస్సులతో గద్దెదించి, వేలు కేసుల్లో భాగంగా జైల్లోకి నెట్టి, ఆ తరువాతి ఎన్నికల్లో పాల్గొననివ్వకుండా చేసిన సంగతి పాక్ ప్రజలకు తెలియనిదేమీ కాదు. ఆర్థికంగా అధోగతిలోకి జారుతూ, రాజకీయంగా అస్థిరపరిస్థితులను ఎదుర్కొంటున్న పాకిస్తాన్‌లో ఇమ్రాన్‌కు వీసమెత్తు హాని జరిగినా దేశం అగ్నిగుండమైపోతుంది. ప్రజాస్వామ్యం ముసుగులో ఒక కీలుబొమ్మ ప్రధానిని గద్దెమీద కూచోబెట్టి, సర్వమూ తానై, సకల వ్యవస్థలనూ నియంత్రిస్తున్న ఒక ఫీల్డ్ మార్షల్ చేతిలో పాకిస్తాన్ ఎటుపోతోందో అర్థం కావడం లేదు.

హక్కు ఆధారిత చట్టాలు ఇక ప్రభుత్వ దయ!

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MGNREGA) రద్దుతో దేశంలో ఒక కీలకమైన రాజకీయ ప్రశ్న ముందుకు వచ్చింది: సంక్షేమాన్ని పౌరుల హక్కుగా పరిగణించే ఆలోచన నుంచి భారత ప్రభుత్వం క్రమంగా పక్కకు తప్పుకుంటున్నదా? ఈ పరిణామం కేవలం ఒక పథకం ముగింపునకు సంబంధించింది కాదు. ఇది భారత ప్రజాస్వామ్యంలో పౌరుడికి, రాజ్యానికి మధ్య ఉన్న సామాజిక ఒప్పందం (social contract)లో వస్తున్న పెనుమార్పుకు సంకేతం.

ఒక్క 'నరేగా' విషయంలోనే కాదు; సమాచార హక్కు చట్టం (RTI), జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA), అటవీ హక్కుల చట్టం (FRA) వంటి హక్కుల ఆధారిత చట్టాల భవిష్యత్తుపైనా ఇలాంటి ఆందోళనే కలుగుతోంది. ముఖ్యంగా గత పదేళ్ళ మోదీ ప్రభుత్వ పాలనలో సంక్షేమాన్ని చట్టబద్ధమైన హక్కుగా నిర్వహించటం మానేసి, పరిపాలనా నిర్ణయాలు, కార్యనిర్వాహక నియంత్రణల ద్వారా నిర్వహించాలన్న ధోరణి పెరగటం చూస్తున్నాం.

స్వాతంత్ర్యానికి ముందు దశలో తొలి జాతీయవాదులు పేదరికం అనేది వ్యక్తిగత వైఫల్యం కాదనీ, వలస పాలనలోని దోపిడీకి వ్యవస్థాగత ఫలితమనీ వాదించారు. పేదరికాన్ని కేవలం వ్యక్తిగత సమస్యగా కాకుండా ఒక నిర్మాణాత్మక సమస్యగా చూడాలనే ఈ దృక్పథం, నాటి వామపక్ష రాజకీయ –ఆర్థిక ఆలోచనల ప్రభావంతో మరింత బలపడింది. "స్వతంత్ర భారతదేశ ప్రధాన కర్తవ్యాలు: ఆకలితో ఉన్న ప్రజలకు ఆహారం పెట్టడం; దుస్తులు లేని ప్రజలకు దుస్తులు ఇవ్వడం," అని రాజ్యాంగ సభలో జవహర్‌లాల్ నెహ్రూ చేసిన ప్రకటనలో ఇదే భావన ప్రతిఫలిస్తుంది.

అయితే స్వాతంత్ర్యం తర్వాతి కాలంలో పేదరిక నిర్మూలన అనేది ప్రధానంగా ప్రభుత్వ నేతృత్వంలోని అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల రూపంలోనే కొనసాగింది. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు సామాజిక న్యాయం పట్ల రాజ్యానికి ఉన్న బాధ్యతను స్పష్టంగా ప్రకటించినప్పటికీ, అవి చట్టపరంగా అమలు చేయాల్సిన హక్కులుగా మారలేదు. ఫలితంగా సంక్షేమం పౌరుల చట్టబద్ధ హక్కుగా కాకుండా, పాలనాపరమైన విచక్షణ పైన, రాజకీయ సంకల్పం పైన ఆధారపడిన అంశంగా కొనసాగింది. ఈ పరిమితిని రాజ్యాంగ రూపకల్పన దశలోనే చూడవచ్చు. పని హక్కును ప్రాథమిక హక్కులలో ఎందుకు చేర్చలేదని ప్రముఖ రచయిత ముల్కరాజ్ ఆనంద్ స్వయంగా అంబేద్కర్‌ను ప్రశ్నించినప్పుడు, ఆయన, "రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీలో నేనొక్కడినే లేను" అని సమాధానమిచ్చారు. అంటే పనిని హక్కుగా మలిచే రాజకీయ సంకల్పం అప్పుడే సంపూర్ణంగా రూపుదిద్దుకోలేకపోయింది. ఈ వైఖరే స్వాతంత్ర్యానంతర కాలంలో సంక్షేమ హక్కుగా గాక, పథకాల రూపంలో కొనసాగడానికి ఒక ముఖ్య కారణంగా మారింది.

1991లో కేంద్ర ప్రభుత్వం ఉదారవాద ఆర్థిక విధానాలను అమలు చేయడం ప్రారంభించిన తరువాత, వాటి ఫలితంగా ఏర్పడిన అసమానతలకు ప్రతిస్పందనగా దేశవ్యాప్తంగా



ప్రజా ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఆహారం, ఉపాధి, పారదర్శకత, గౌరవం వంటి మౌలిక అంశాల చుట్టూ సాగిన ఈ పోరాటాలు సంక్షేమాన్ని హక్కుల ఆధారంగా పునఃరూపకల్పన చేయాలన్న ఆలోచనకు బలమైన పునాదిని వేశాయి.

> సంక్షేమాన్ని ఒక ఉపకారం నుంచి ఒక హక్కుగా మార్చిన ఉపాధి హామీ, సమాచార హక్కు, అటవీ చట్టం, ఆహార భద్రతా చట్టం వంటి హక్కు ఆధారిత చట్టాలు బలహీనపడటం అంటే ప్రజలు కేవలం వాటి ప్రయోజనాలను మాత్రమే కోల్పోతున్నట్టు కాదు, తమ క్షేమానికి రాజ్యాన్ని జవాబుదారీగా నిలబెట్టే సామర్థ్యాన్ని కూడా కోల్పోతున్నట్టే! సంక్షేమాన్ని పౌరుల హక్కుగా చూడకుండా భారత ప్రభుత్వం వెనుకడుగు వేస్తోందా?

ఈ ఉద్యమాలలో అత్యంత ప్రభావవంతమైనది రాజస్థాన్‌లో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (MKSS) నేతృత్వంలో సాగిన సమాచార హక్కు ఉద్యమం. 'హమారా ఖర్చా, హమారా హిసాబ్' (మన సొమ్ము–మన లెక్కలు) అనే నినాదంతో ప్రజా పనులకు సంబంధించిన అవినీతిని బహిర్గతం చేసిన ఈ ఉద్యమం, 'పారదర్శకత'ను 'వేతనాలు', 'ఉపాధి' వంటి కార్మికుల మౌలిక హక్కులతో నేరుగా ముడిపెట్టింది. సమాచారాన్ని కేవలం ఒక సూత్రంగా గాక, న్యాయమైన, గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన అనివార్యమైన షరతుగా ప్రజల ముందుకు తెచ్చింది.

అదే సమయంలో, ఆర్థిక వృద్ధి జరుగుతున్నప్పటికీ ఆకలి, పోషకాహార లోపాలు ఎందుకు కొనసాగుతున్నాయన్న ప్రశ్నతో ఆహార హక్కుల ఉద్యమాలు మొదలయ్యాయి. 2001లో పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ సుప్రీంకోర్టును ఆశ్రయించి, ఆహార హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు) నుంచి ఉద్భవించిందని వాదించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తదుపరి ఉత్తర్వులు ప్రజా పంపిణీ వ్యవస్థను, మధ్యాహ్న భోజనం వంటి పథకాలను జీవించే హక్కుతో ముడిపడిన చట్టబద్ధ హక్కులుగా గుర్తించాయి.

2004లో యూపీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ఉద్యమాల ద్వారా వచ్చిన హక్కుల డిమాండ్లను చట్ట రూపంలోకి తేవడానికి ఒక రాజకీయ అవకాశం ఏర్పడింది. సామాన్యుడి కోసం పాలన అందిస్తామని ప్రకటించిన యూపీఏ ప్రభుత్వం ప్రజా ఒత్తిళ్లకు స్పందించక తప్పలేదు. అందువల్లనే– 'సమాచార హక్కు చట్టం' (2005), 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' (2005), 'అటవీ హక్కుల చట్టం' (2006), 'జాతీయ ఆహార భద్రతా చట్టం' (2013) వంటి కీలక హక్కుల ఆధారిత చట్టాల అమలు మొదలైంది. ఈ చట్టాలు సంక్షేమాన్ని పరిపాలనా విచక్షణ పరిధి నుంచి బయటకు తీసి, అమలు చేయాల్సిన చట్టబద్ధ హక్కులుగా మార్చాయి.

కానీ గత దశాబ్ద కాలంగా ఈ హక్కుల ఆధారిత చట్టాలు బలహీనమవుతూ వస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం వాటిని అమలు చేయాలన్న రాజకీయ సంకల్పం తగ్గడమే. సంక్షేమాన్ని పౌరుల చట్టబద్ధ హక్కుగా కాకుండా, నియంత్రణలు, పరిపాలనా విధానాల ద్వారా నిర్వహించాలన్న పాత దృక్కోణం మరలా బలపడింది. ఈ ధోరణి ఒకటి రెండు విధాన నిర్ణయాలకు పరిమితం కాకుండా, నిరంతర పరిపాలనా చర్యలు, మార్గదర్శకాలు, సాంకేతిక షరతుల రూపంలో వ్యవస్థాగతంగా లోతుగా పాతుకుపోయింది. అంతేకాదు, తీవ్ర రాజకీయ ప్రతిఘటనల మధ్య రూపొందిన ఈ చట్టాల్లోనే రాజ్యానికి విస్తృత కార్యనిర్వాహక వెసులుబాటు (Executive discretion) కల్పించే నిర్మాణ లక్షణాలు మొదటి నుంచీ అంతర్లీనంగా ఉన్నాయి.

ఉదాహరణకు ఉపాధి హామీ (నరేగా) చట్టబద్ధమైనదైనప్పటికీ– పనుల కేటాయింపు, నిధుల విడుదలపై కేంద్ర ప్రభుత్వ నియంత్రణ బలంగా ఉండేది. నిధులు ఆలస్యం అయినప్పుడు నిరుద్యోగ భృతిని డిమాండ్ చేయడం ఆచరణలో సామాన్యుడికి చాలా కష్టసాధ్యంగా మారింది. అలాగే సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) విషయానికి వస్తే– సెక్షన్ 8 వంటి మినహాయింపులు సమాచారాన్ని నిరాకరించేందుకు విస్తృత అవకాశాలను కల్పించాయి. అంతేకాక, సమాచార కమిషనర్ల నియామకంపై రాజకీయ నియంత్రణ కొనసాగడం వల్ల సంస్థాగత స్వాతంత్ర్యం పరిమితంగా మారింది. ఇక ఆహారభద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ)లో ఆహారాన్ని సార్వత్రిక హక్కుగా కాకుండా లక్షిత ప్రయోజనంగా పరిమితం చేయడం వల్ల, జనాభా పెరుగుతున్న కొద్దీ అనేక అర్హులు ఈ చట్ట పరిధి వెలుపలికి నెట్టబడ్డారు. అలాగే అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ) అమలు బాధ్యత మొత్తం చారిత్రకంగా ఆదివాసీ హక్కులకు వ్యతిరేకంగా వ్యవహరించిన అటవీశాఖ చేతుల్లోనే ఉండటం, ఈ చట్ట ఆత్మకు విరుద్ధమైన పరిస్థితిని సృష్టించింది. ఇలా ఆ చట్టాల్లో స్వతహాగా నిబిడీకృతమై ఉన్న నిర్మాణ లోపాలే, దరిమిలా రాజకీయ సంకల్పం తగ్గిన తరువాత, చట్టాలను రద్దు చేయకుండానే వాటిని లోపల్నుంచి డొల్లగా మార్చడానికి (hollowing out) సులభతర మార్గాలుగా మారాయి.

ప్రస్తుత పరిణామాలను ఈ కార్యనిర్వాహక వెసులుబాటు దృక్కోణంలోనే అర్థం చేసుకోవాలి. డిమాండ్ ఆధారితంగా అమలు చేయదగినవిగా రూపొందిన హక్కులు ఇప్పుడు సాంకేతిక షరతులు, విధానపరమైన ఆంక్షల ద్వారా పునఃరూపకల్పన చేయబడుతున్నాయి. దీనివల్ల వాటి సారాంశం క్రమంగా క్షీణిస్తోంది. సంక్షేమాన్ని ఒక ఉపకారం నుంచి ఒక హక్కుగా మార్చిన ఈ హక్కు ఆధారిత చట్టాలు బలహీనపడటం అంటే ప్రజలు కేవలం వాటి ప్రయోజనాలను మాత్రమే కోల్పోతున్నట్టు కాదు, తమ క్షేమానికి రాజ్యాన్ని జవాబుదారీగా నిలబెట్టే సామర్థ్యాన్ని కూడా కోల్పోతున్నట్టే!

ఇప్పుడు ఉపాధి హామీ పేరు మారిందా లేదా కొత్తగా రూపుదిద్దుకున్నదా అన్నది కాదు అసలు ప్రశ్న. సంక్షేమాన్ని పౌరుల హక్కుగా చూడకుండా భారత ప్రభుత్వం వెనుకడుగు వేస్తోందా అన్నదే కీలకమైన ప్రశ్న. దశాబ్దాల ప్రజా పోరాటాల ద్వారా సాధించుకున్న ఈ హక్కులను ప్రజా బాహుళ్యంలో విస్తృత చర్చ లేకుండా బలహీనపరిస్తే, వాటికి ఉన్న చట్టపరమైన రక్షణ క్రమంగా క్షీణిస్తుంది.

భారతదేశంలో సామాజిక భద్రత అనేది రాజ్యపు దయాదాక్షిణ్యాల మీద ఆధారపడిన 'ఉపకారం' కాదు; అది పౌరుల 'చట్టబద్ధమైన హక్కు'. సంక్షేమాన్ని తిరిగి హక్కుల కోణంలో ప్రతిష్ఠించడమే నేటి అసలైన రాజకీయ, సామాజిక సవాలు. ఈ మార్పుపై బహిరంగ చర్చ, నిరంతర ప్రజా పర్యవేక్షణ మాత్రమే దశాబ్దాల పోరాటాల ఫలితమైన ఈ చట్టాలను కాపాడగలవు.

• చక్రధర్ బుద్ధ
సీనియర్ పరిశోధకులు, లిబ్‌టెక్ ఇండియా

సామాజిక, ధార్మిక విప్లవకారుడు శివాజీ

ఛత్రపతి శివాజీ మహారాజ్ అనగానే ఓ గొప్ప పోరాట యోధుడు గుర్తుకువస్తారు. శక్తిమంతులైన మొగలాయి రాజులను తన యుద్ధ తంత్రాలతో ఓడించిన అద్వితీయమైన యుద్ధ నైపుణ్యమే గుర్తుకొస్తుంది. ఆయన భారతీయ సామాజిక ముఖ చిత్రాన్ని మార్చిన ఓ గొప్ప విప్లవకారుడిగా కూడా చరిత్రలో నిలిచి పోయారు. ఆయన పాలనలో నెలకొన్న సామాజిక సమానత్వం, రైతు సంక్షేమం, పారదర్శకతను మహాత్మా జ్యోతిబాఫూలే, డా. బి.ఆర్.అంబేడ్కర్ వంటి మహనీయులు అత్యంత లోతుగా విశ్లేషించారు. శివాజీ మహారాజ్‌లోని బహుముఖ ప్రజ్ఞ, సామాజిక దృక్పథం నేటికీ ఆదర్శం. చరిత్రను కేవలం యుద్ధాల కోణంలో చూస్తే శివాజీ ఒక వీరుడు. సామాజిక న్యాయం కోణంలో చూస్తే ఆయన ఒక యుగపురుషుడు. అణగారిన వర్గాల ఆత్మ గౌరవం, రైతుల శ్రేయస్సు కోసం ఆయన నిర్మించిన 'స్వరాజ్యం' నేటి ఆధునిక ప్రజాస్వామ్యానికి పునాది.

19వ శతాబ్దంలో శివాజీ మహారాజ్ అసలు చరిత్ర మరుగున పడిపోతున్న తరుణంలో, మహాత్మా జ్యోతిబాఫూలే దానిని వెలుగులోకి తెచ్చారు. శివాజీ వారసత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి మొదటిసారిగా జయంత్యుత్సవాలను నిర్వహించారు. రైతులను పీడించే దళారులను (జమీందార్లు) శివాజీ నిర్మూలించారు. వారికి ప్రయోజనం కలిగే విధంగా ప్రభుత్వ విధి విధానాలు రూపొందించి పాలకులకు, దుక్కి దున్నే వారికి అనుసంధానంగా నిలిచారు. రైతులకు విత్తనాలు, ఎద్దులు, రుణాలు అందించారు. కరువు సమయంలో పన్నులను నిలిపివేశారు. అలాగే వ్యవసాయ కార్మికులను, రైతులను ఏకం చేసి, భూస్వామ్య వ్యవస్థను (వతందారీ) వ్యతిరేకించి, సామాన్యుల రాజ్యాన్ని శివాజీ స్థాపించారని ఫూలే విశ్లేషించారు.



శివాజీని ఒక ఆదర్శ పాలకుడిగా, అణగారిన వర్గాల విముక్తి ప్రదాతగా బాబా సాహెబ్ అంబేడ్కర్ గౌరవించారు. అంటరానితనానికి వ్యతిరేకంగా 1927లో జరిగిన చరిత్రాత్మక మహద్ సత్యాగ్రహ వేదికపై శివాజీ చిత్రపటాన్ని ఉంచడం ద్వారా, ఈ పోరాటం శివాజీ ఆశయాల కొనసాగింపు అని అంబేడ్కర్ చాటి చెప్పారు. తన 'జనతా' పత్రికలో (1930–40 మధ్య) అంబేడ్కర్ రాసిన వ్యాసాల ప్రకారం శివాజీ సైన్యంలో కులవివక్షకు తావు లేదు. మహర్, మాంగ్ వంటి అణగారిన వర్గాలవారు సైన్యంలో, కోటల రక్షణలో కీలక బాధ్యతలు నిర్వహించారని అంబేడ్కర్ ఉదాహరణలతో వివరించారు. సైన్యం కోసం కఠినమైన నైతిక నియమాలను శివాజీ ఏర్పాటు చేశారు. మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించేటట్టు నిబంధనలు రూపొందించారు. అవినీతికి పాల్పడే వారిని కఠినంగా శిక్షించే వ్యవస్థను ఏర్పాటు చేశారు. రైతులపై భారం పడకుండా శివాజీ అమలుచేసే పన్నుల విధానం ఆధునిక ప్రజాస్వామ్యానికి పునాది అని అంబేడ్కర్ భావించారు.

అత్యంత శక్తిమంతమైన మొఘల్ సామ్రాజ్యాన్ని శివాజీ ఎదుర్కొన్న తీరు ప్రపంచ యుద్ధ చరిత్రలోనే అద్భుతం. సంఖ్యా బలం తక్కువగా ఉన్నా, భౌగోళిక పరిస్థితులను (కొండలు, అడవులు) ఆయుధాలుగా మార్చుకుని గెరిల్లా యుద్ధ తంత్రంతో మెరుపు దాడులు చేయడం ద్వారా మొఘల్ సైన్యాన్ని బెంబేలెత్తించారు. సుమారు 300 కోటలను నిర్మించి, వాటిని రక్షణ కవచాలుగా మార్చారు. మొఘలుల ఆర్థిక మూలమైన సూరత్ నగరాన్ని రెండు సార్లు ముట్టడించి, ఆ సంపదను స్వరాజ్య నిర్మాణానికి ఉపయోగించారు. విదేశీయుల ముప్పును ముందుగానే పసిగట్టిన శివాజీ, బలమైన నౌకాదళాన్ని నిర్మించి భారత తీర ప్రాంతాన్ని రక్షించారు.

ప్రభుత్వాన్ని సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి పర్షియన్ భాషకు బదులుగా మరాఠీ, సంస్కృతం వాడకాన్ని శివాజీ ప్రోత్సహించారు. శత్రువుల మహిళలను కూడా తల్లులుగా గౌరవించిన ఉన్నత సంస్కృతి శివాజీది. 1677లో శివాజీ మహారాజ్ హైదరాబాద్‌ను సందర్శించి అబుల్ హసన్ తానాషాతో సమావేశమయ్యారు. ఇది ఆయన రాజకీయ పరిణతికి నిదర్శనం. పుట్టుక కంటే ప్రతిభ ఆధారంగా వ్యక్తులను ప్రోత్సహించడం, ప్రతిభకు ఉద్యోగ అవకాశాలను అందించడం ద్వారా శివాజీ కుల అడ్డంకులను బద్దలుకొట్టారు. ఆయన పరిపాలన నిష్పాక్షికంగా, న్యాయంగా ఉండేది. మూర్తీభవించిన హిందూ ధర్మానికి, సంస్కృతికి శివాజీ మహారాజ్ ఒక గొప్ప ప్రతీక.

సామాజిక పురోగతిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని అర్థం చేసుకున్న శివాజీ అభ్యాసం, జ్ఞాన వ్యాప్తిని ప్రోత్సహించారు. విద్యా సంస్థలను స్థాపించారు, పండితులను పోషించారు, మేధో వృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని పెంపొందించారు. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలలో సమాజాల చురుకైన ప్రమేయాన్ని శివాజీ విశ్వసించారు. పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించారు. తద్వారా పౌరులలో యాజమాన్యం, బాధ్యతాభావాన్ని పెంపొందించారు.

○ టి.ఎన్.వంశతిలక్
సామాజిక సమరసత వేదిక

(నేడు శివాజీ మహారాజ్ జయంతి)

ఎందరికో స్ఫూర్తి.. మహిళలకు దీప్తి

నాలుగు గోడల మధ్యనే ఉంటూ, నాలుగు దిక్కుల పట్ల అవగాహన కలిగి ఉండటం, నాలుగు దశాబ్దాల కిందట అసాధ్యమే! పోలియో వల్ల కాళ్లు చచ్చుబడి నడవలేని స్థితిలో ఉంటే, చింతిస్తూ కన్నీళ్లతో కాలం గడుపుతారు ఎవ్వరైనా! కానీ ఎనిమిదేళ్ల వయస్సులో ఒక బాలిక అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. అంగవైకల్యం జీవనయాత్రకు అడ్డుకాదని, సృజనాత్మకతతో ఆలోచించి, జీవితాన్ని రంగులమయం చేసుకోవచ్చని నిరూపించింది ఆ బాలిక. కృషి, పట్టుదల ఉంటే ఎటువంటి క్లిష్ట పరిస్థితులనైనా మనకు అనువుగా మలచుకొని, స్వయంకృషితో సమాజ గుర్తింపు పొందవచ్చునని చాటి చెప్పింది. ఆ బాలికే రాగతి పండరి.



తొలి తెలుగు మహిళా కార్టూనిస్టుగా లక్షలాది పాఠకుల హృదయాల్లో చెదరని ముద్రవేసింది. కార్టూన్‌కు అర్థం తెలియని వయస్సులో ఆమె ఈ రంగంలోకి అడుగుపెట్టింది. కళపై ఉన్న మక్కువతోనే కార్టూన్ కళాకారిణి కాగలిగింది. పుట్టిన ఏడాదికే పోలియో వల్ల ఆమె రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. దాంతో ఆమె ఇంటికే పరిమితమైంది. రాగతికి తన రెండో అక్క రత్నకుమారి రాయడం, చదవడం నేర్పింది. ఇంటికి వచ్చే పుస్తకాలు చదవడం, అందులో వచ్చే కార్టూన్లు అర్థం చేసుకోవడంతో వాటిపై ఆమెకు అభిరుచి పెరిగింది. ఆమెకూ కార్టూన్లు గీయాలన్న కోరిక కలిగింది. తన ఎనిమిదవ ఏట ప్రారంభమైన కార్టూన్ల సృష్టి, ఆమె మరణించే వరకూ కొనసాగించింది.

ప్రముఖ తెలుగు కార్టూనిస్టులు జయదేవ్, బాపు, బాలి, గోపి, బి.ఎస్.రాజు వంటి వారు ఆమెకు తగిన సూచనలు, సలహాలను ఉత్తరాల ద్వారా, స్వయంగా కలిసినప్పుడు తెలిపేవారు. ఆమె ఆ మెళకువలు నేర్చుకుని, అవలీలగా అల్లుకుపోయారు. ప్రతి తెలుగు పత్రికలో ఆమె కార్టూన్లు ప్రచురితమై, విశేష ప్రాచుర్యం పొందాయి. ప్రతి పాఠకుడి మనసునూ మురిపించాయి. మూడున్నర దశాబ్దాల పాటు ఆమె 25వేలకు పైగా కార్టూన్లు గీశారు. అధిక ధరలు, వరకట్నం, ర్యాగింగ్, మంచినీటి కొరత, కాలుష్యం వంటి సామాజిక సమస్యలే కాక, సంక్రాంతి, ఉగాది, వినాయక చవితి, దసరా, దీపావళి వంటి పండుగల పైనా పలు కార్టూన్లు గీశారు. ఆమె మేధస్సులో మెరిసిన మెరుపులు అనేకం!

ప్రముఖ రచయిత ఎల్యా నారాయణరావుతో కలిసి 'యవ్వనం పిలిచింది, అయ్యో పాపం అబ్బాయిలు, దెయ్యాలు ఎక్కడ ఉన్నాయి?' వంటి కార్టూన్ కథలు అల్లారు. సికారాజకీయంలో, రాజకీయ'చెద'రంగం శీర్షిక పదేళ్ళు కొనసాగింది. అదేవిధంగా, పొడుగు–పొట్టి అమ్మాయిలు, నవగ్రహం–అనుగ్రహం, మగాడి చెవిలో పూవు, అంకాలమ్మ–అడవిలో వంటి కార్టూన్ సీరియల్స్ విశేష ఆదరణ పొందాయి. ఆమె చిత్రించిన 200 కార్టూన్లతో 'నవ్వుల విందు–కార్టూన్ల పసందు' పేరుతో విశాలాంధ్ర పుస్తకాన్ని ప్రచురించింది. ఆమె ఆత్మకథ 'నా గురించి నేను' విశాఖకు చెందిన చిత్రకళా పరిషత్ ప్రచురించింది.

మద్రాసు తెలుగు అకాడమీ 'ఉగాది' పురస్కారాన్ని నాటి గవర్నర్ రంగరాజన్ నుంచి, 'కళారత్న' ప్రతిభా పురస్కారాన్ని మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి నుంచి రాగతి పండరి అందుకున్నారు. ఆమె మృతి చెందడానికి వారం ముందు ఆసుపత్రి మంచంపై ఉండి కూడా రెండు చక్కని హాస్యకార్టూన్లు గీసి అక్కడి సిబ్బందిని ఆనందపర్చారు. మరణానంతరం తన దేహం సమాజానికి ఉపయోగపడాలని భావిస్తూ, విశాఖలోని ఎస్.ఆర్.వైద్యకళాశాలకు తన దేహాన్ని రాసిచ్చేయడం ఆమెలోని మానవతా విలువలకు నిదర్శనం. నేడు రాగతి పండరి వర్ధంతి. ఆమె భౌతికంగా మృతి చెందినా కార్టూనిస్టుల మనసుల్లో చిరకాలం నిలిచే ఉంటారు.

○ సుంకర చలపతిరావు

సీమ వ్యవసాయానికి కొత్తగా పెట్టుబడి కోణం!

రాయలసీమను 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'గా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించడం, అందుకు తగ్గట్టుగా బడ్జెట్‌లో నిధులు కేటాయించడం వ్యవసాయ రంగంలో ముఖ్యమైన మార్పును సూచిస్తుంది. ఎన్నో ఏళ్ల కరువుతో ఇబ్బందిపడిన రాయలసీమ నేడు అధిక విలువ కలిగిన ఉద్యాన పంటల ఉత్పత్తి, ప్రాసెసింగ్, ఎగుమతుల కేంద్రంగా మారింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

మన దేశంలోని వ్యవసాయం గురించి చర్చించినప్పుడు, మన దృష్టి పంజాబ్, హర్యానా, కోస్తా ఆంధ్రా లాంటి గ్రీన్ రెవల్యూషన్ విజయవంతమైన ప్రాంతాలపైనే కేంద్రీకృతమై ఉండేది. ఆయా ప్రాంతాలు అధిక దిగుబడి గల గోధుమ, వరి వంటి ధాన్య పంటల ద్వారా దేశ ఆహార భద్రతను స్థిరపరిచాయి. ఫలితంగా, వ్యవసాయం అంటే ధాన్యం ఉత్పత్తి, నీటి పారుదల, ఆహార కొరత నివారణ అనే సంకుచిత అవగాహన పాలకవర్గాల నుంచి మేధావుల వరకు ఉండేది. అయితే, గత మూడు దశాబ్దాలలో దేశ వ్యవసాయ దృశ్యం పూర్తిగా మారిపోయింది. మార్కెట్ ఆధారిత, పెట్టుబడి ఆధారిత, అధిక విలువ గల ఉద్యానవన పంటలపై ఆధారపడిన మూలధన సేకరణ రంగంగా వ్యవసాయ రంగం మార్పు చెందుతోంది. నేడు రాయలసీమలోనూ ఈ పరిస్థితిని గమనించవచ్చు.

> రాయలసీమలోని వ్యవసాయాన్ని కేవలం కరువు కోణంలో మాత్రమే అర్థం చేసుకోవడం ఇక సరిపోదు. ఇక్కడి వ్యవసాయ రంగ మార్పును మార్క్స్ ప్రతిపాదించిన మిగులు కూడబెట్టే విధానం వంటి భావనల ద్వారా అర్థం చేసుకోవచ్చు. మిగులును కూడబెట్టి తద్వారా వివిధ రంగాలలో తిరిగి పెట్టుబడులు పెట్టే ప్రక్రియ ద్వారా సీమలో ఒక కొత్త పెట్టుబడిదారీ రైతు వర్గం క్రమంగా నిర్మితమవుతోంది.



గత రెండు మూడు దశాబ్దాలుగా రాయలసీమ వ్యవసాయంలో గణనీయమైన మార్పు చోటుచేసుకుంది. ముఖ్యంగా సాగునీటి వ్యవస్థ (శ్రీశైలం నుంచి ప్రాజెక్టుల ద్వారా వరద నీటి తరలింపు), బోర్‌వెల్స్, సబ్‌మెర్సిబుల్ పంపులు, డ్రిప్ ఇరిగేషన్ వంటి సాంకేతికతతో అందుబాటులో ఉన్న భూగర్భ జలాలను విస్తృతంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. పెట్టుబడి లేమి కారణంగా ఈ సాంకేతికత చిన్న సన్నకారు, దిగువ కులాల రైతుల కంటే, ఆర్థికంగా బలమైన రైతులకే ఎక్కువగా ఉపయోగపడింది. అంతేగాక, 2000 సంవత్సరం తర్వాత హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న కుటుంబ సభ్యుల ఆదాయం కూడా తిరిగి కొంతమేరకు వ్యవసాయ రంగంలో పెట్టుబడిగా మారింది. ఈ పెట్టుబడులు వ్యవసాయాన్ని జీవనాధార రంగం నుంచి పెట్టుబడి ఆధారిత రంగంగా మార్చడంలో కీలక పాత్ర పోషించాయి.

2010 తరువాత ఈ పెట్టుబడులు ప్రధానంగా ఉద్యానవన పంటలపై పెట్టడంతో మామిడి, బత్తాయి, దానిమ్మ, అరటి వంటి అధిక విలువ గల దీర్ఘకాలిక పంటలు రాయలసీమ సంప్రదాయ ధాన్య పంటల స్థానాన్ని క్రమంగా భర్తీ చేశాయి. ఉద్యాన పంటలు మార్కెట్‌లో అధిక ధరలను (2019–2023 మధ్య) అందించడం వల్ల కూడబెట్టిన మిగులు తిరిగి భూమి కొనుగోలు, రియల్ ఎస్టేట్లో పెట్టుబడులు, కార్పొరేట్ విద్య, ఇతర వ్యాపార కార్యకలాపాలలో పెట్టుబడిగా మారింది. ముఖ్యంగా భూస్వామ్య కుటుంబాలు తమ మొదటి తరం పిల్లలను కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదివించడం, పట్టణాలలో నివాస స్థలాలను కొనుగోలు చేయడం, వ్యవసాయాన్ని ఒక మూలధన సేకరణ సాధనంగా ఉపయోగించడం వంటి మార్పులు విస్తరించాయి.

రాయలసీమలో జరుగుతున్న వ్యవసాయ రంగ మార్పును మార్క్సిస్టు వ్యవసాయ సిద్ధాంతం, ముఖ్యంగా కార్ల్‌మార్క్స్ ప్రతిపాదించిన మిగులు కూడబెట్టే విధానం, వర్గ విభజన వంటి భావనల ద్వారా అర్థం చేసుకోవచ్చు. మిగులును తిరిగి పెట్టుబడి చేయడం, మార్కెట్ కోసం ఉత్పత్తి చేయడం, శ్రామిక శక్తిని వినియోగించడం, ఉత్పత్తి సాధనాలపై నియంత్రణను కేంద్రీకరించడం వంటివి పెట్టుబడిదారీ వ్యవసాయరంగ ప్రధాన లక్షణాలు. రాయలసీమలో కూడా మిగులును కూడబెట్టి, తద్వారా వివిధ రంగాలలో తిరిగి పెట్టుబడులు పెట్టే ప్రక్రియ ద్వారా ఒక కొత్త పెట్టుబడిదారీ రైతు వర్గం క్రమంగా నిర్మితమవుతోంది.

అయితే, ఈ పెట్టుబడిదారీ పరివర్తన వల్ల అన్ని వర్గాలకు సమానంగా లబ్ధి చేకూరలేదు. దళితులు, భూమిలేని ఇతర అణగారిన వర్గాలవారు ఇంకా కార్మికులుగానే కొనసాగుతున్నారు. వారు ఉత్పత్తి ప్రక్రియలో కీలకపాత్ర పోషించినప్పటికీ, మిగులు కూడబెట్టే ప్రక్రియలో భాగస్వాములు కాలేకపోయారు. ఫలితంగా, వ్యవసాయంలో వస్తున్న పెట్టుబడిదారీ మార్పు ఇక్కడి సామాజిక అసమానతలను తగ్గించకపోగా, మరింత బలపరిచింది. వ్యవసాయంలోని మిగులు ఒకవైపు పెట్టుబడిదారీ రైతు వర్గాన్ని బలపరుస్తూ, మరోవైపు భూమిలేని వర్గాలను శాశ్వత శ్రామిక వర్గంగా స్థిరపరుస్తున్నది.

ఈ నేపథ్యంలో, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో ఉద్యానవన ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రైతాంగానికి సబ్సిడీలు, వివిధ రకాల ప్రోత్సాహకాలను అందిస్తామని చెప్తున్నది. అయితే, వాస్తవంగా లబ్ధి పొందుతున్న కులాలు, వర్గాలు ఎవరు అనేది ముఖ్యమైన ప్రశ్న! ఎందుకంటే, పెట్టుబడి సామర్థ్యం, భూమి యాజమాన్యం, మార్కెట్ అందుబాటు కలిగిన రైతులు మాత్రమే ఈ విధానాల నుంచి ఎక్కువగా ప్రయోజనం పొందే అవకాశముంది.

కాబట్టి, రాయలసీమ వ్యవసాయాన్ని కేవలం కరువు, నీటి కొరత, వెనుకబాటు కోణంలో మాత్రమే అర్థం చేసుకోవడం సరిపోదు. ఒకవైపు ఉన్నత వర్గాల్లోని వారు పెట్టుబడిదారీ రైతులుగా తమ ఆర్థిక, సామాజిక ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకోగలుగుతున్నారు. మరోవైపు భూమిలేని దళితులు, ఇతర అణగారిన వర్గాల వారు ఇప్పటికీ శ్రామిక శక్తిపైనే ఆధారపడి బతుకుతున్నారు. ఈ వర్గ విభజన, మిగులు కూడబెట్టే ప్రక్రియలే రాయలసీమ వ్యవసాయ భవిష్యత్తును, సామాజిక–ఆర్థిక నిర్మాణాన్ని నిర్ణయించే కీలక అంశాలు. కాబట్టి ప్రభుత్వాలు ముందుగా భూమిలేని దళితులకు, ఇతర వర్గాలకు భూ పంపిణీ లాంటివి చేపట్టి వ్యవసాయ రంగంలో వారిని భాగస్వాములను చేసినప్పుడే రాయలసీమ 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' కాగలుగుతుంది.

■ డా. చిన్నరంగయ్య దండు
పరిశోధకులు



ఏసీబీ వలలో ఎనర్జీ అసిస్టెంట్

రూ.70 వేలు లంచం తీసుకుంటూ చిక్కిన అతని తండ్రి 8

టిడ్కో ఇళ్లు.. ఇంకెన్నాళ్లు!

- సొంతింటి కోసం ఏళ్లుగా నిరీక్షణ
- లబ్ధిదారులపై వడ్డీ.. అద్దె భారం



నరసరావుపేటలో నిర్మించిన టిడ్కో గృహాలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పురోగతి ఇలా..

మునిసిపాల్టీ	నిర్మాణం	పూర్తయినవి	అప్పగించినవి
నరసరావుపేట	1504	1504	526
చిలకలూరిపేట	5520	4512	3738
వినుకొండ	1440	----	----
మాచర్ల	1056	----	----
పిడుగురాళ్ల	2835	1296	----
సత్తెనపల్లి	160	160	----
రేపల్లె	1344	----	-----
అమరావతి రాజధాని			
అనంతవరం	416	416	288
నవులూరు	672	672	641
పెనుమాక	608	608	595
మందడం	448	448	422
తుళ్లూరు	448	448	422
దొండపాడు	1184	1184	1032
ఐనవోలు	704	704	639
నిడమర్రు	544	544	489
మంగళగిరి, తాడేపల్లి	1728	1728	1719
పొన్నూరు	2368	2368	1342
తెనాలి	1856	848	830
గుంటూరు	7472	6080	4561

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

పట్టణాల్లో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. వైసీపీ పాలన ఐదేళ్లూ సొంతింటికి నోచుకోకపోగా.. ప్రస్తుతం ఆదే పరిస్థితి నెలకొందన్న ఆవేదన లబ్ధిదారుల నుంచి వ్యక్తమవుతోంది. అప్పులు చేసి తొమ్మిదేళ్ల క్రితం తమ వాటాగా రూ.50 వేలు చెల్లించిన లబ్ధిదారులకు వడ్డీ పెరిగిపోతోంది. మరో వైపు అద్దెల భారంతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్నా పేదలకు టిడ్కో ఇళ్లను పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం తాండవిస్తోంది. పూర్తయిన ఇళ్లను కూడా లబ్ధిదారులకు ఇవ్వడంలో పాలకులు, అధికార యంత్రాంగం ఆపసోపాలు పడుతోంది. మరో వైపు లబ్ధిదారుల పేరుపై తీసుకున్న అప్పుకు వాయిదాలు చెల్లించాలని బ్యాంకులు ఒత్తిడి తెస్తున్నాయి. ఇంటిలోకి వెళ్లకుండానే వాయిదాలు ఎలా (మిగతా 8వ పేజీలో)

ఆర్భాటమే.. ఆచరణ శూన్యం



అన్నదాతలతో మాట్లాడుతున్న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి


రైతుల సాధకబాధలను వారి ఇళ్లకు వెళ్లి వినడంతో పాటు.. సంక్షేమ పథకాలను వివరించి, లాభసాటి సాగు కోసం గతేడాది నవంబరు చివరిలో రైతన్నా... మీకోసం పేరిట ఆరు రోజుల పాటు కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించింది. నవంబరు 24 నుంచి 29 వరకు ప్రతి రైతు సేవా కేంద్రం యూనిట్‌గా 540 ఇళ్లను సిబ్బంది సందర్శించి పథకాలు వివరించారు. సేకరించిన వివరాలన్నీ క్రోడీకరించి డిసెంబరు 3న చర్చా వేదికలు నిర్వహించారు. ఇందులో రైతులు, స్థానిక నేతాగణాన్ని భాగస్వామ్యం చేశారు. లాభసాటి సాగుకు పంచసూత్రాల అమలు, రబీ ప్రణాళికలకు ఈ చర్చలో చోటు కల్పించారు. అయితే.. ఇంత అట్టహాసంగా నిర్వహించిన ఈ బృహత్తర కార్యక్రమం ఉద్దేశం మాత్రం నెరవేరలేదు. సాగులో సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవడం, ప్రభుత్వం దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడం ఆచరణలో మచ్చుకైనా కనిపించలేదు.

- రైతన్నా.. మీ కోసం.. కానరాని ఫలితం !
- గతేడాది నవంబరులో నిర్వహణ
- లాభదాయక సాగుపై చర్చా వేదికలు
- తర్వాత వాటిని పట్టించుకునే దిక్కే లేదు

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

రైతన్నా.. మీకోసం కార్యక్రమం జరిగి దాదాపు రెండు నెలలు దాటింది. సిబ్బంది సర్వే నివేదికలు, చర్చా వేదికల ప్రణాళికలు పట్టించుకుంటే ఒట్టు. ప్రభుత్వం కార్యక్రమం చేయమంది.. తాము చేశామనే రీతిలో వ్యవసాయశాఖ తీరు ఉంది. ఈ కార్యక్రమం దీర్ఘకాల ఉద్దేశం కొనసాగింపు నామమాత్రంగా కూడా కనిపించడం లేదు. వర్క్‌షాప్‌లో చేసిన తీర్మానాలనూ (మిగతా 8వ పేజీలో)





రైతుకే తొలి ప్రాధాన్యం

- మిర్చి యార్డు ప్రతిష్ఠ పెంచుతాం
- హమాలీల కోసం ప్రత్యేకంగా ఆరోగ్య కేంద్రం
- యార్డు చైర్మన్‌గా రేపు ప్రమాణ స్వీకారం చేయనున్న కుర్రా అప్పారావు



8

ఆర్‌టీఐహెచ్‌లో ఏఐ వ్యూహాత్మక సాధనం!

- ప్రొఫెసర్ సౌమిత్ర దత్తా

వెనుకబడిన వర్గాల సంక్షేమ దిక్సూచి రాష్ట్ర బడ్జెట్

- వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 21న వినుకొండ పర్యటనకు రానున్న నేపథ్యంలో.. పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎక్కడా చిన్నపాటి లోటుపాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమం పర్యటనలో భాగంగా వినుకొండలోని ఎన్ఎస్‌పీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేయనున్న ప్రజా వేదికను సర్వాంగ సుందరంగా సిద్ధం చేయాలన్నారు. ప్రజా వేదిక ప్రాంగణంలోనే ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన స్టాల్స్‌ను ఆకర్షణీయంగా ఏర్పాటు చేయాలని, అక్కడికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో నిమగ్నమై పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా డీఆర్డీఏ ద్వారా రూ.100 కోట్లు, మెప్మా ద్వారా రూ.50 కోట్లు రుణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా ఏరియా ఆసుపత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసూన, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రీజినల్ అధికారి నజీరా బేగం, ఆసుపత్రి సూపరింటెండెంట్ దయానిధి తదితర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

వినుకొండటౌన్: సీఎం చంద్రబాబునాయుడు పర్యటించే ప్రభుత్వ వైద్యశాలను ఎస్పీ కృష్ణారావు, డీఎస్పీ హనుమంతరావుతో కలిసి సందర్శించారు. జూనియర్ కళాశాలలో హెలీప్యాడ్‌ను, ఎన్ఎస్‌పీ కాలనీ గ్రౌండ్‌లో బహిరంగ సభ పనులను, పరిశీలించి, ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల పార్కింగ్ వంటి అంశాలపై పట్టణ సీఐ ప్రభాకర్‌కు పలు సూచనలు అందించారు. ఇక పార్టీ నేతలతో సీఎం ప్రత్యేక సమావేశంపై అధిష్ఠానం నుంచి సమాచారం లేదు. కార్యక్రమం ఎక్కడ నిర్వహించాలన్న దానిపై గురువారానికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఎన్నికల అనంతరం మొట్టమొదటిసారిగా సీఎం చంద్రబాబు వినుకొండకు వస్తున్న నేపథ్యంలో టీడీపీ కేడర్‌లో నూతనోత్సాహం నెలకొంది. పట్టణంలోని పలు కూడళ్లల్లో భారీఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.



ఎన్ఎస్‌పీ కాలనీలో సభావేదికను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

పీపీపీ విధానంలో.. నార్ల ఆడిటోరియం

- బిడ్స్ ఆమోదం, నిర్ధారణకు వేర్వేరు కమిటీలు

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి ఆలయం పక్కన నిర్మాణ దశలో నిలిచిపోయిన నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియాన్ని ప్రజా, ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేయాలని నగరపాలక సంస్థ చేసిన తీర్మానానికి మున్సిపల్ పరిపాలన శాఖ ఆమోదం తెలిపింది. కౌన్సిల్ తీర్మానం మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రతిపాదనలు తీసుకునేందుకు విజ్ఞప్తిని అనుమతించాలని లేఖ రాశారు. టెక్నికల్, ఆర్థిక వ్యవహారాలతో ముడిపడి ఉన్న నేపథ్యంలో బిడ్స్ ఆమోదించడానికి, వాటిని పరిశీలించి నిర్ధారించడానికి రెండు వేర్వేరు కమిటీలను నియమించాలని కోరారు. బిడ్ డాక్యుమెంట్స్ ఆమోదానికి కమిటీ వేశారు. కాగా నార్ల ఆడిటోరియం నిర్మాణం ప్రారంభమై దాదాపుగా రెండున్నర దశాబ్దాలు దాటిపోయింది. అక్కడి స్థలం గుంటూరు నగరపాలకసంస్థకు చెందినది కాగా అందులో 51 శాతం నిధులను నగరపాలకసంస్థ మాజీ మేయర్ కొల్లి శారద, మిగతా 49 శాతం నిధులు మున్సిపల్ కార్పొరేషన్ సమకూర్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఆ మేరకు నిర్మాణ పనులు ప్రారంభం కాగా అనివార్య కారణాలతో అర్ధంతరంగా పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అంచనాలు సవరించి కొంత మేరకు ఆడిటోరియం పనులను పూర్తి చేశారు. అయితే ఆడిటోరియం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడానికి ఇంకా నిధులు అవసరమౌతాయి. నిర్మాణం తర్వాత నిర్వహణకు ఖర్చు లుంటాయి. దీనిని పరిగణనలోకి తీసుకుని పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని నగరపాలకసంస్థ నిర్ణయం తీసుకుంది. బిడ్‌లు దాఖలై ఏజెన్సీ ఖరారైతే ఆడిటోరియానికి పట్టిన గ్రహణం వీడిపోతుంది.

నేటి నుంచి రంజాన్ ఉపవాసాలు

- ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన మసీదులు

పొన్నూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ ఉపవాసాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. 31 సంవత్సరాల తర్వాత రంజాన్ మాసం ఫిబ్రవరిలో రావడం విశేషం. 1995 ఫిబ్రవరి 1న ఉపవాస దీక్షలు ప్రారంభం కాగా మళ్లీ ఇదే నెలలో ఈ ఏడాది ప్రారంభమయ్యాయి. రంజాన్ మాసంలో కఠినంగా ఉపవాస దీక్షలను ముస్లింలు పాటిస్తారు. తొలి పది రోజుల ఉపవాస కాలాన్ని రెహమత్ అని, రెండో పది రోజుల కాలాన్ని బర్కత్ అని, చివరి పది రోజులు పాటించే ఉపవాస కాలాన్ని మగ్ఫిరత్ అంటారు. ఇస్లామియా సంప్రదాయం ప్రకారం చాంద్రమాన అనుసరించి 9వ నెలలో పవిత్ర రంజాన్ మాసంగా ముస్లింలు ఆచరిస్తారు. పవిత్ర గ్రంథం అయిన ఖురాన్ ఈ రంజాన్ మాసంలోనే ఆవిర్భవించిందని భక్తుల నమ్మకం. రంజాన్ పండుగను ఈద్ ఉల్ ఫిత్రా పేరుతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఖురాన్ ప్రకారం భక్తిశ్రద్ధలతో ధర్మ మార్గాలను అనుసరించడమే కాకుండా రోజా పేరుతో ఉపవాసాలను పాటించడం విధిగా భావిస్తారు. రంజాన్ మాసంలో ఇచ్చే ఇఫ్తార్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఆధ్యాత్మికతతో పాటు ధార్మిక చింతన, దైవ భక్తి, క్రమశిక్షణ, దాతృత్వం కలయికే ఈ పవిత్ర మాసం విశిష్టత.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సాయంత్రం 6.17 (గురువారం)

సహరి : ఉదయం 5.19 (శుక్రవారం)



ప్రార్థనలకు సిద్ధమైన పొన్నూరులోని మసీదు

పంచాయతీలపై ఆంక్షలు

మొన్నటి దాకా నిధులు లేక, రాక సర్పంచ్‌లు అల్లాడిపోయారు. ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి.. పాత బిల్లులు చేసుకోవచ్చు అని ఆనందంలో ఉన్న గ్రామ ప్రథమ పౌరులపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. పంచాయతీల ఖాతాల్లో జమ అయిన 15వ ఆర్థిక సంఘం నిధులను ఎలాగంటే అలాగ ఖర్చు చేయకూడదని నిబంధన విధించింది. దీంతో సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు.



- నిధుల వినియోగంపై సర్పంచ్‌లకు పరిమితి
- ఆర్థిక సంఘం నుంచి ఉమ్మడి జిల్లాకు రూ.70 కోట్లు
- విద్యుత్ బిల్లులు, జీతాలకే వాడాలని ప్రభుత్వ నిబంధన

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఏప్రిల్ 2వ తేదీతో సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తుంది. ఈలోపు గతంలో చేసిన పనులకు బిల్లులు పెట్టుకోవచ్చనుకున్న వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లిందని ఆవేదన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలో 227, పల్నాడు జిల్లాలో 519, బాపట్ల జిల్లాలో 426 గ్రామ పంచాయతీ లకు ఆర్థిక సంఘం నిధులు రూ.70 కోట్లు వరకు విడుదలయ్యాయి. అయితే సదరు నిధులను కేవలం విద్యుత్ బిల్లులు చెల్లింపు, గ్రీన్‌అంబాసిడర్లకు జీతాలు, చెత్త సేకరణ వంటి వాటికి మాత్రమే ఖర్చు చేయాలని ప్రభుత్వం ఆంక్షలు విధించింది. నిధుల వినియోగంపై పరిమితులు గ్రామస్థాయిలో తీవ్ర ప్రభావం చూపుతున్నాయని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, అంగన్వాడీ భవనాలు, పాఠశాల గదులు, సైడ్‌డ్రెయిన్లు, వీధి దీపాలు, మోటార్ మరమ్మతులు, బ్లీచింగ్, దోమల నివారణ ఫాగింగ్ వంటి పనులు నిర్వహించే వారు. ప్రస్తుతం ఆ పనులకు నిధులు వినియోగించలేని పరిస్థితి ఏర్పడటంతో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని సర్పంచులు తెలిపారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టేందుకు అవకాశం లేకపోవడంతో ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని స్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులు ఆమోదం పొందకపోవడంతో కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిసెంబర్‌లో అప్లోడ్ చేసిన సాధారణ నిధుల బిల్లులు, కార్మికుల జీతాలు కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని చెబుతున్నారు.

ఆందోళన బాట..

ప్రభుత్వ ఆంక్షలపై సర్పంచులు ఆందోళన కార్యక్రమాలకు దిగుతున్నట్లు సమాచారం. నిధుల వినియోగంపై విధించిన పరిమితులను సడలించి, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం సేచ్ఛగా ఖర్చు చేసుకునే అవకాశం ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పనులు నిలిచిపోతే ప్రజలకు నష్టం జరుగుతుందని, ఇప్పటికే చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకపోతే గ్రామాల్లో తీవ్ర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని సర్పంచులు హెచ్చరిస్తున్నారు.

ఆంక్షలు తొలగించాలి

ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై విధించిన ఆంక్షలు తొలగించాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సర్పంచ్‌లను ఎన్నో విధాలుగా ఇబ్బంది పెట్టిందని, ఈ ప్రభుత్వం వారి మనోభావాలు అర్థం చేసుకోవాలన్నారు.



టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

- పేదల ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

తెనాలి పర్యటనలో కలెక్టర్ అన్సారియా

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో ఐదు బ్లాకులుగా నిర్మిస్తున్న 1008 టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. పట్టణంలో జరుగుతున్న పనుల పరిశీలినతో పాటు అభివృద్ధి అంశాలపై బుధవారం కలెక్టర్ సమీక్షించారు. తొలుత పూలే కాలనీలో ఉన్న మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని, అక్కడే నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్ల పనులను పరిశీలించారు. బుర్రిపాలెం రోడ్డులోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని తనిఖీ చేసి వర్మి కంపోస్టు యూనిట్, కొబ్బరికాయలు పీచు తీసే యంత్రం పని తీరును తెలుసుకున్నారు. బుర్రిపాలెం అర్బన్ లేఅవుట్‌లో గృహాల నిర్మాణాలను సమీక్షించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో విద్యార్థుల శిక్షణను పరిశీలించారు. అనంతరం ట్రావెలర్స్ బంగ్లాలోని సీపీఏపీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది జూన్‌కల్లా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బుర్రిపాలెం లేఅవుట్‌లో నిర్మించిన ఇళ్లలో లబ్ధిదారులు చేరేలా హౌసింగ్ అధికారులు ప్రోత్సహించాలన్నారు. లేఅవుట్ ఫేజ్-1లో 2885 ఇళ్లు మంజూరు కాగా 539 ఇళ్లు పూర్తి అయ్యాయని ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి, పబ్లిక్ హెల్త్ ఈఈ సురేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ జేఆర్ అప్పలనాయుడు, సేతుబాబు, శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి మునునూరు సునీల్, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, తహసీల్దార్ గోపాలకృష్ణ, హౌసింగ్ డీఈ భాస్కర్, ఎంఈ శ్రీకాంత్, భాస్కరరావు, భవానీశంకర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం బాగుంది


పంటల పరిశీలనలో ఫ్రాన్స్ బృంద సభ్యులు

● ఫ్రాన్స్ బృందం ప్రశంసలు

కొల్లిపర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టడం చాలా బాగుందని ఫ్రాన్స్ దేశానికి చెందిన ఫ్రెంచ్ అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రతినిధుల బృంద సభ్యులు డాక్టర్ బ్రూనో డోరిన్, డాక్టర్ క్లేర్‌లేపాట్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అన్నవరం, మున్నంగి గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకు కూరల పంటలను ప్రతి నిధుల బృందం పరిశీలించింది. 365 రోజుల కిచెన్, న్యూట్రి గార్డెన్, ఏ గ్రేడ్ తదితర పంటలు, రైతులు అనుసరించే పద్ధతుల గురించి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. రాజకుమారి వారికి వివరించారు. ప్రకృతి వ్యవసాయశాఖాధికారులు, రైతులు పాల్గొన్నారు.

మిర్చియార్డు సమాచారం

(బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	1,06,635	
అమ్మకాలు	1,02,831	
నిల్వ	24,592	
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	20000
నెంబరు. 5	13500	22000
273	----	----
341	14000	23000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	17500
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	24000
దేవనూరు డీలక్స్	15500	24500
ఆర్మూరు	13000	16500
ఏసీ కామన్ వెరైటీ		
334	13500	19500
నెంబరు. 5	13000	20500
273	----	----
341	14000	22500
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	17000
బ్యాడిగి 355	14000	23000
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7500	11500

తెలుగులో కోర్టు తీర్పు


న్యాయమూర్తి పి. రాజశేఖర్

కొల్లిపర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెనాలి రెండవ అదనపు సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి పి.రాజశేఖర్ బుధవారం తెలుగులో తీర్పు వెలువరించారు. క్రైం నంబరు 197/ 2021 కొల్లిపర పోలీస్‌స్టేషన్‌లోని సీసీ 91/ 2022 కేసు పై ఈ తీర్పునిచ్చారు. మాతృ భాషలో తీర్పు ఇవ్వడంపై కక్షిదారులు సంతోషించారు.

గ్రంథాలయాల పురోభివృద్ధికి కృషి

● ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ వందనాదేవి

● రూ.56.90 కోట్ల బడ్జెట్ అంచనాలకు ఆమోదం


మాట్లాడుతున్న బీమినేని వందనాదేవి, పాల్గొన్న డీఈవో సలీం బాషా తదితరులు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయాల పురోభివృద్ధికి కృషి చేస్తున్నామని గ్రంథాలయ సంస్థ ఉమ్మడి గుంటూరు చైర్‌పర్సన్ బీమినేని వందనాదేవి పేర్కొన్నారు. అరండల్ పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రంథాలయాలకు మంచి భవనాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా సదుపాయాల కల్పనకు ఆలోచిస్తున్నట్లు చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరం రూ.56.90 కోట్ల బడ్జెట్ అంచనాల ప్రతిపాదనలను సమావేశంలో ఆమోదించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ.60లక్షలు, చుండూరుకు రూ.6.50 లక్షలు, తెనాలి గ్రేడ్-1కు రూ.23.50లక్షలు, నిడుబ్రోలుకు రూ.10.50లక్షలు, వట్టిచెరుకూరుకు రూ.12 లక్షలు, తాడికొండకు రూ.26 లక్షలు, చిలకలూరిపేటకు రూ.13.93 లక్షలు, నరసరావుపేటకు రూ.13.60 లక్షలు, సత్తెనపల్లికి రూ.6.10 లక్షలు, ఈపూరుకు రూ.12.50 లక్షలు, గురజాలకు రూ.18.50 లక్షలు, మాచర్లకు రూ.17.30 లక్షలు, అమరావతికి రూ.19 లక్షలతో ఆయా శాఖ గ్రంథాలయాల ఆధునికీకరణ అంచనాలను ఆమోదించారు. వివిధ గ్రంథాలయాల పరిధిలో ఉన్న వాణిజ్య సముదాయాలను అద్దెకు టెండర్ ప్రాతిపదికన ఇవ్వడంతో, ఇతర పరిపాలన, నిర్వహణ పరమైన అంశాలను ప్రతిపాదించారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, డీఈవో డా.షేక్ సలీం బాషా, వయోజన విద్యా శాఖ డీడీ కె.అంజనేయులు, ఐఅండ్‌పీఆర్ డీడీ లోచర్ల రమేష్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

పటిష్ట ప్రణాళికతో ఇంటర్ పరీక్షలు

● బోర్డు కార్యదర్శి రంజిత్ బాష

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పటిష్ట ప్రణాళికతో ఈ నెల 23 నుంచి జరిగే ఇంటర్ పరీక్షలు పూర్తి చేయాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి రంజిత్ బాష సూచించారు. బుధవారం చీఫ్ సూపరింటెండెంట్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, కస్టోడియన్లతో ఆయన వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరపాలని, సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. ఆర్జేడీ పద్మ, ఆర్ఐవో గన్నెపూడి సునీత, డీఈసీ సభ్యులు కె. సుచరిత, శ్రీనిరిపాల్, బీజీ రామారావు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నుంచి విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో ప్రయాణికుడు మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. బస్సు సత్తెనపల్లి బస్టాండ్‌లో ఆగగా.. వెనుక సీట్‌లో కూర్చున్న వ్యక్తి పడిపోయి ఉండటాన్ని ప్రయాణికులు గమనించారు. స్థానిక ఆర్టీసీ అధికారులకు తెలియజేశారు. ఆర్టీసీ సీఐ ఫాతిమా, బస్సు డ్రైవర్, కండక్టర్ 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అప్పటికే అతను మృతిచెందడంతో.. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రయాణికుడి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రభుత్వాస్పత్రిలో ఏఐ ఆధారిత క్యాన్సర్ వైద్య పరీక్షలు

● రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద జీజీహెచ్ ఎంపిక

● సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి


ఏఐ ఆధారిత క్యాన్సర్ పరీక్షలను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పాప్ స్మియర్ పరీక్షతో తొలి దశలోనే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను గుర్తిస్తే, వైద్య చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. రాష్ట్రంలో మహిళ ఆరోగ్య సంరక్షణ కోసం గ్రామస్థాయి నుంచి వైద్యుల నిపుణతకు కృత్రిమ మేధస్సును అనుసంధానం చేసే పైలెట్ ప్రాజెక్టును ఫిబ్రవరి 14 నుంచి మార్చి 27 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పెరినింకిల్ సొల్యూషన్స్ సంస్థ సహకారంతో నాట్కో కేన్సర్ సెంటర్‌లో గర్భాశయ ముఖద్వార కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఆసుపత్రి గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తామని వెల్లడించారు. సంప్రదాయ పాప్ స్మియర్ పరీక్షలకు కృత్రిమ మేధ సాంకేతికతను జోడిస్తున్నట్లు ఆయన వివరించారు. వైద్యులు, ఏఐ ఇచ్చే నివేదికలను సరిపోల్చుకోవడం ద్వారా మరింత మెరుగైన ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణ సాధ్యపడుతుందని తెలిపారు. ఈ శిబిరాన్ని మహిళలు సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు. నాట్కో ట్రస్ట్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ సునీత, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ ఆవుల విజయ కుమారి, గైనకాలజీ వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ పీజీ పరీక్షలు ప్రారంభం

ఏఎన్‌యూ ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయని వర్సిటీ పీజీ కోర్సుల సమన్వయకర్త మన్నం సుబ్బారావు తెలిపారు. 19 కేంద్రాల్లో పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటితో పాటు ఎల్ఎల్ఎం 3, బీఏ ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్, ఎంఈడీ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్సిటీలో హిస్టరీ, తెలుగు తెలుగు పరీక్షలను ఆయన పరిశీలించారు. కాపీయింగ్‌కు పాల్పడవద్దని, సమయపాలన పాటిస్తూ.. హాల్ టిక్కెట్లను దగ్గర ఉంచుకుని పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు.

ఆర్కిటెక్చర్ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ సెమిస్టర్, సప్లిమెంటరీ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. మొదటి, రెండో సెమిస్టర్లు, మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్, మూడు, నాలుగు సంవత్సరాల రెండో సెమిస్టర్ల సప్లిమెంటరీ ఫలితాలను ప్రకటించారు. ఈ నెల 26 వరకు రీవాల్యుయేషన్ దరఖాస్తు చేసుకోవాలని, పీజీ కో-ఆర్డినేటర్ కార్యాలయంలో 27లోగా దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఒక్కో సబ్జెక్టుకు ఫీజు రూ.2,070, పర్సనల్ వెరిఫికేషన్, జవాబు పత్రం నకలుకు రూ.2,190 చెల్లించాలని, ఫలితాలు ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొందరుపరిచినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి.

ఇంజనీరింగ్ కళాశాలకు వైఎస్సార్ పేరు మార్చాలి

ఏఎన్‌యూ టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు డాక్టర్ వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల పేరు మార్చాలని బుధవారం వీసీ కె.గంగాధరరావుకు వినతిపత్రం అందజేశారు. నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ల టెండర్లు క్యాన్సిల్ చేయాలని కోరారు. గత ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్ల వైఫల్యం కారణంగా వర్సిటీ ప్రతిష్ట దెబ్బతిందన్నారు. ఈ అంశంపై తక్షణ చర్యలు తీసుకోకపోతే.. సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. నాయకులు యశ్వంత్, శిరీష్ మోహన్ ,రాకేష్, విజయ్, ఉపేంద్ర, అనిల్ రెడ్డి, పూర్ణ పాల్గొన్నారు.

సమగ్ర ప్రణాళికతో పాఠశాలల అభివృద్ధి

● పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయుల స్థాయిలోనే సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి సూచించారు. పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. చినకాకానిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో డాక్టర్ ఎస్కే సలీం బాషాతో కలిసి ఆయన బుధవారం తనిఖీ చేశారు. ల్యాబ్‌లు, ఆవరణ శుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆవరణంతా చక్కగా ఉండడంతో అభినందించారు.

కోల్డ్‌స్టోరేజ్ యజమానికి నోటీసులు

● గద్వాల మిర్చి రైతులకు న్యాయం చేయాల్సిందేనని ఆదేశం

● మార్కెటింగ్ కమిషనర్, కలెక్టర్‌కు సమగ్ర నివేదిక

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతుల మిర్చిని వారికి తెలియకుండానే విక్రయించిన కోల్డ్‌స్టోరేజ్ యజమానికి గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నోటీసులు జారీ చేసింది. రైతుల పేర్లతో బాండ్లు జారీ చేసి వారికి కనీసం తెలియపరచకుండా అధీకృత ఏజెంట్ అయిన కమీషన్ వ్యాపారికి చెప్పి మిర్చిని విక్రయించామని సమాధానం చెప్పడం సబబు కాదని స్పష్టం చేసింది. ఇది నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. రైతులకు ఎట్టి పరిస్థితుల్లో న్యాయం చేసి తీరాల్సిందేనని ఆదేశించింది. ఈ ఘటనపై సమగ్ర నివేదికని రూపొందించి మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత, కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాకి అందజేస్తామని ఏఎంసీ అధికార వర్గాలు తెలిపాయి. తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన ఏడుగురు రైతులు మిర్చియార్డు సమీపంలోని తిరుపతమ్మ తల్లి గుడి వద్ద ఉన్న కోల్డ్‌స్టోరేజ్‌లో 1,148 మిర్చి టిక్కీలను 2023లో నిల్వ చేశారు. ఈ ఏడుగురు రైతులకు అధీకృత ఏజంట్‌గా కమీషన్ వ్యాపారి వ్యవహరించారు. దీంతో కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యం బాండ్లను రైతుల పేర్లతో జారీ చేసి అందులో అధీకృత ఏజంట్‌గా కమీషన్ వ్యాపారి పేరుని చేర్చారు. సాధారణంగా ఒక సీజన్‌లో నిల్వ చేసిన మిర్చి టిక్కీలను రైతులు తదుపరి సీజన్ నాటికి బయటకు తీసి విక్రయిస్తారు. ఒకవేళ ధర తక్కువగా ఉంటే వాటికి అద్దె చెల్లిస్తారు. అయితే మార్కెట్‌లో రేటు లేదని రైతులు రాకపోవడంతో తాను ఈ విషయాన్ని పలుమార్లు కమీషన్ వ్యాపారికి తెలియజేశానని కోల్డ్‌స్టోరేజ్ యజమాని మార్కెటింగ్ అధికారులకు చెప్పారు. కమీషన్ వ్యాపారి స్పందించకపోవడంతో మూడేళ్ల ఎదురు చూడటం వల్ల తమకు అద్దెల రూపంలో రూ. 20 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు. దాంతో ఆ మిర్చిని తాము విక్రయించాల్సి వచ్చిందన్నారు. రైతులు ప్రతి టిక్కీపై రూ.3 వేల రుణం కూడా తీసుకొన్నారని వివరణ ఇచ్చారు. ఈ వివరణని మార్కెటింగ్ అధికారులు అంగీకరించలేదు. బాండ్‌పై రైతు పేరు ఉన్నప్పుడు విక్రయించడానికి వీల్లేదన్నారు. ఏ కమీషన్ వ్యాపారి ద్వారా ఆ సరుకుని విక్రయించారో ఆ వివరాలన్ని తమకు డాక్యుమెంట్లతో సహా అందజేయాలని ఆదేశించారు.

పెరిగిన మిర్చి టిక్కీల రాక

గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు మిర్చి టిక్కీల రాక బుధవారం పుంజుకొంది. మహా శివరాత్రి తర్వాత కొద్దిగా మందగించిన సరకు ఆగమనం బుధవారం పెరిగింది. 1,06,635 టిక్కీలను రైతులు విక్రయానికి తీసుకురాగా.. 1,02 831 విక్రయాలు జరిగాయి. నాణ్యత బాగా ఉన్న మిర్చి రకాన్ని బట్టి క్వింటాల్‌కు రూ.17,500 నుంచి రూ. 24,500 వరకు ధర లభించింది. కొన్ని ప్రాంతాల నుంచి వస్తున్న క్వాలిటీ తక్కువ మిర్చీకి మాత్రమే కాస్త ధర తగ్గుతుందని, మిగతా వాటికి ఆశాజనకంగానే రేటు లభిస్తోందని మార్కెటింగ్ వర్గాలు తెలిపాయి. కొంతమంది ఎగుమతి వ్యాపారులు ఉదయం కమీషన్ దుకాణాల వద్దకు వెళ్లి ఒక రేటు చెప్పి.. తీరా బిడ్డింగ్ సమయంలో క్వింటాల్‌కు రూ.వెయ్యి తగ్గిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తోండటంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఉదయం రైతు, కమీషన్ వ్యాపారి సమక్షంలో ఎంతైతే ధర ఒప్పందం జరిగిందో ఆ రేటుని బిడ్డింగ్‌లో వేయాల్సిందేనని స్పష్టం చేశారు.

మెప్మా సిబ్బంది మోసంపై ఫిర్యాదు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెప్మా సిబ్బంది ఎనిమిది మంది నకిలీ గ్రూపులను సృష్టించి బ్యాంకు నుంచి రూ.9 కోట్ల మేరకు రుణం తీసుకుని మోసం చేశారని మొదటి పట్టణ పోలీస్ స్టేషన్లో బుధవారం కేసు నమోదైంది. మెప్మా సిబ్బంది టి.ఉమాదీప, విజయప్రణతి, ఉమర్‌వలి, మల్లికార్జున్, భూదేవి తదితరులు ఈ మోసానికి పాల్పడినట్లు పల్నాడు జిల్లా అర్బన్ సమాఖ్య అధ్యక్షురాలు షేక్ అఖిల ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షర్మిల పర్యటనను జయప్రదం చేయాలి

● జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల పర్యటన జయప్రదం చేయాలని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి కోరారు. బుధవారం పార్టీ నాయకులతో కలిసి పర్యటనలో షర్మిల పాదయాత్ర, బహిరంగ సభ అనుమతి కోసం డీఎస్పీ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. దేశంలో పేదలకు పని కల్పించి భుక్తి లభించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తోందన్నారు. ఈ పథకం పేరుమార్చి పేదలకు పని దొరక్కుండా చేసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందన్నారు. ఇందుకోసం జరుగుతున్న పాదయాత్ర, బహిరంగ సభలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు యన్నం సుధీర్, నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు, షేక్ ఖలీల్, కరీమ్, పొన్నూరు శశి, శివరామకృష్ణప్రసాద్, మోషే, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122 , 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

4,800 మిర్చి టిక్కీల అమ్మకం

దాచేపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం 5,300 మిరప టిక్కీలు విక్ర యానికి రాగా 4,800 టిక్కీల అమ్మకం జరిగింది. 334 రకం రూ.10 వేలు నుంచి రూ.22వే లు, తేజా రకం రూ .9వేలు నుంచి రూ.17,500, తాలు కాయాలు రూ.3 వేలు నుంచి రూ.9 వేలకు విక్రయించారు.

సంద్రంలో సమీక్ష


ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉన్న ఐఎన్ఎస్ సుమేధ నౌక

- ఉత్సాహంగా సాగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ
- విశాఖ తీరంలో వివిధ దేశాల నౌకల సందడి
- నేవీ సామర్థ్యాన్ని సమీక్షించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- హాజరైన గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు


ఫ్లీట్ రివ్యూలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు


రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నమస్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దంపతులు

విశాఖ తీరంలో బుధవారం ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ ఉత్సాహ భరిత వాతావరణంలో సాగింది. భారత నావికాదళాలతో పాటు వివిధ దేశాల నౌకలు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సంద్రంలో చేపట్టిన రివ్యూలో నావికా సిబ్బంది నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు. అనంతరం భారత నావికాదళం యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, ట్యాంకర్లతో చేపట్టిన విన్యాసాలు అబ్బురపరిచాయి. ప్రదర్శనలను తిలకించేందుకు వచ్చిన సందర్శకులతో ఆర్‌కే బీచ్ రోడ్డు కిక్కిరిసిపోయింది. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


ఐఎన్ఎస్ బరాతంగ్ నౌక



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జ్ఞాపిక బహూకరిస్తున్న నేవీ అధికారి, చిత్రంలో సీఎం చంద్రబాబు


ఐఎన్ఎస్ మకర్ ఇండియా


అమెరికన్ నౌక


కెడి ఎస్ఆర్ఐ ఇండెరా శక్తి మలేషియా నౌక




యుద్ధ విమానాల విన్యాసాలు


అల్ ఇమరత్ అరబ్ నౌక

మసీదులు వద్ద ఏర్పాట్లు చేయాలి : కమిషనర్


ఇంజనీరింగ్ అధికారుల సమావేశంలో ప్రసంగిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు (కార్పొరేషన్), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా నగరంలోని మసీదుల వద్ద పక్కాగా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ కె.మయూర్ అశోక్ ప్రజారోగ్య, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో ప్రజారోగ్య, ఇంజనీరింగ్ అధికారులతో రంజాన్ పండుగ సందర్భంగా మసీదుల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, వీఏఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, బయాలజిస్ట్ శేషయ్య, ఈఈ విష్ణు, ఎస్ఎస్‌లు రాజేష్, ఐజాక్, సాంబయ్య పాల్గొన్నారు.

జనన, మరణాలు జరిగిన 21 రోజుల్లోపు ఉచితంగా నమోదు చేసుకోవచ్చని, 21 రోజుల అనంతరం నిర్దేశిత ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని, జనన, మరణ నమోదులపై రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీవోఎంఎస్ 28 ద్వారా నూతన మార్గదర్శకాలు జారీ చేసిందని కమిషనర్ కె.మయూర్‌అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎస్ఈ, కాంట్రాక్టర్లతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, నగరపాలక సంస్థ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొండా రమేష్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌పై.. వైసీపీది దిగజారుడు రాజకీయం : బీజేపీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌పై వైసీపీ దిగుజారుడి రాజకీయం చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మండిపడ్డారు. బ్రాడీపేట, బీజేపీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో సజ్జల, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డిలకు మాత్రమే బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయని ఎద్దేవా చేశారు. మిగిలిన నిధులను జగన్ తన ఖాతాకు మళ్లించుకున్నాడని ఆరోపించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో తొలిసారి రూ.3లక్షల కోట్లకు పైగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం సంతోషంగా ఉందన్నారు.

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మార్చి 7న విజయవాడ, శ్రీతుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగే మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘ జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి కోరారు. కలెక్టరేట్ రోడ్డు, సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన హేమలతను సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం జిల్లా మహిళా విభాగపు అధ్యక్షురాలిగా జీజీహెచ్‌లో స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తు న్న షేక్ షబానా సుల్తానాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ పీడీకి వినతి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి (ఏపీ శ్యాక్స్) పరిధిలో పని చేసే ఉద్యోగులకు పే రివిజన్ కోసం జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (న్యాకో)కు సిఫార్సు చేయాలని కోరుతూ ఉద్యోగుల సంఘం నేతలు, బుధవారం ఏపీ శ్యాక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఐఎఎస్ అధికారి కే నీలకంఠరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్తి వేణు, రాష్ట్ర కోఆర్డినేటర్ కో కోటిరత్నం, నేతలు బీ నరేష్ తదితరులు బుధవారం విజయవాడలో ఏపీ శ్యాక్స్ పీడీని కలిసి వినతిపత్రం అందజేశారు. వీరి విజ్ఞప్తిపై పీడీ నీలకంఠరెడ్డి సానుకూలంగా స్పందించారు.

పరీక్షల్లో విజేతలుగా నిలవాలి

● ఇంటర్మీడియట్ విద్యార్థులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన కలెక్టర్


వీసీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాసి విజేతలుగా నిలవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆకాక్షించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా బుధవారం వసతి గృహా ల్లో ఉండి ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సందేశాన్ని ఇచ్చారు. జిల్లాలో 87 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, మొత్తం 68,898 మంది విద్యా ర్థులు హాజరవుతున్నారని తెలిపారు. వీరందరిలో సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు టాపర్స్‌గా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అన్నారు. వసతి గృహాల్లో ఉండి చది విన అనేకమంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత పదవుల్లో ఉన్నారని, వసతి గృహ విద్యార్థులు ఎవరికి తీసిపోరని నమ్మకం ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య, గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి పి.మురళీధర్ పాల్గొన్నారు.

స్వర్ణ వార్డు కార్యాలయాలను పరిశీలించిన కలెక్టర్

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ రోడ్డులోని ఎన్ఎస్‌పీ కెనాల్స్ క్వార్టర్స్ లో ఉన్న 83, 84 స్వర్ణ వార్డు కార్యాలయాలను కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పరిశీలించారు. బుధవారం సాయంత్రం ఆమె గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజా వలి ఇతర అధికారులతో కలిసి కార్యాలయాన్ని సందర్శించి స్వర్ణ వార్డులో రికార్డులు పరి శీలించారు. వార్డు పరిధిలో జరుగుతున్న యునిఫైడ్ ఫ్యామిలీ సర్వే పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాసరావు, తహసీల్దారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

● పుప్పాల సత్యనారాయణ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికు ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం తక్షణమే నిలబెట్టుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు (ఏఐటీ యూసీ) పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. కొత్తపేట, సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పిల్లల వివాహానికి, కాన్పుకు రూ.లక్ష, సహజ మరణానికి రూ.ఐదు లక్షలు, ప్రమాద బీమా పథకం కింద ఐదు లక్షలు మంజూరు చేయాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి పెన్షన్ అందించాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 23న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రావుల అంజిబాబు, మేడా హనుమంతరావు, రామారావు, మరియదాసు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయడం తగదు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొన్ని ఎయిడెడ్ పాఠశాలలకు గుర్తింపు రెన్యువల్ కోసం పాఠశాల కార్యదర్శులకు నోటీసులు ఇచ్చే సందర్భంగా సదరు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులను ఎంఈవో ఒత్తిడికి గురి చేస్తున్నారని యూఎస్ రాష్ట్ర కార్యదర్శి జగదీష్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. మేరకు బుధవారం డీఈవో డాక్టర్ సలీం బాషా వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు బోధనపై ఆసక్తి చూపలేక ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హెచ్ఎంలను ఆందోళనకు గురి చేయడం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ పాలేటి జగదీష్ బాబు, గౌరవ సలహాదారులు కే ఫణిదత్తు, పీటర్ పాల్ పాల్గొన్నారు.

ముస్లిం ఉద్యోగులకు తినుబండారాల పంపిణీ

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ముస్లిం ఉద్యోగులకు జడ్పీ సీఈవో వీర్ల జ్యోతి బసు శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం సాయంత్రం కార్యాలయంలో పనిచేస్తున్న ముస్లిం ఉద్యోగులకు ఇఫ్తార్ తినుబండారాలను పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఉపవాసం పాటిస్తున్న ముస్లిం ఉద్యోగుల సౌకర్యార్థం రంజాన్ మాసంలో ప్రతిరోజూ ఒక గంట ముందుగా కార్యాలయం నుంచి వెళ్లేందుకు ప్రత్యేక అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గత అక్టోబరు నెలలో సచివాలయ ఉద్యో గుల సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయా లని గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. స్వర్ణ గ్రామం-వార్డు శాఖ డైరెక్టర్ శివప్రసాద్‌కు వినతిపత్రం సమ ర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిష్టు నాగేశ్వరరావు మాట్లాడారు.

బీసీలు రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదగాలి : క్రాంతికుమార్

గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): బీసీలు రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ పేర్కొన్నారు. మార్కెట్‌యార్డు డైరెక్టర్లుగా నియమితులైన బీసీ నాయకులు నక్కల వంశీకృష్ణ, చంద్రగిరి బాబు, జాన్ సైదాలకు నల్లపాడు రోడ్డులోని సంఘం కార్యాలయంలో శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్, సంఘం నాయకులు ఎ.నాగమల్లేశ్వరరావు, ముప్పన వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ముగ్గురు తహసీల్దార్ల సర్దుబాటు

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముగ్గురు తహసీలార్లను పరిపాలన అవసరం దృష్ట్యా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా సర్దుబాటు చేశారు. కలెక్టరేట్ మేజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్ జీ సుజాత కొంతకాలంలో డిప్యూటేషన్‌పై ప్రత్తి పాడు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె డిప్యూటేషన్‌ని ఉపసంహరిస్తూ తన వద్ద రిపోర్టు చేయాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ కే వెంకటేశ్వరరావుని ప్రత్తిపాడు తహసీల్దార్‌గా నియమించారు. తూర్పు తహసీల్దార్ షేక్ మెహబూబ్ సుభానిని గుంటూరు పశ్చిమ మండలం పూర్తి అదనపు బాధ్యతలు కూడా కేటాయించారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళపై కేసు

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ సిబ్బంది జరిపిన దాడిలో ఐపీడీ కాలనీలో గంజాయి విక్రయిస్తున్న మహిళ బుధవారం పట్టుబడింది. లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐపీడీకాలనీలో ఎస్పీ సీఐ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ సెల్ సిబ్బంది, లాలాపేట పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వెంకట్రావు, సిబ్బంది కలసి, అక్కల వీర్లంకమ్మ ఇంట్లో తనిఖీ చేయగా తన బెడ్ రూంలో 120 గ్రాములు గంజాయిని గుర్తించారు. ఆమె తన మేనల్లు డు గుండి సాంబిరెడ్డి గంజాయిని అరకు ప్రాంతం నుంచి తెప్పించుకొని చిన్నచిన్న పొట్లాలు కట్టి తన ఇంట్లో ఉంచి తెలిసినవారికి అమ్ముతుంటా డని చెప్పింది. పోలీసులు వచ్చిన సమాచారం తెలుసుకొని పారిపోయా డు. గంజాయిని స్వాధీనం చేసుకొని లాలాపేట ఎస్ఐ వెంకట్రావు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం : ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తుందని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. ఇటీవల కర్నూల్‌లో నిర్వహించిన అమరావతి రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను బుధవారం ఆమె అభినందించారు. పవర్ లిఫ్టింగ్‌లో 76 కేజీల విభాగంలో నాగజ్యోతి బంగారు పతకం సాధించడమే కాకుండా 'ఉక్కు మహిళ' అవార్డును కూడా దక్కించుకుం ది. టీం ఛాంపియన్ షిప్‌లో ద్వితీయ స్థానం సాధించడంలో ఆమె కీలక పాత్ర పోషించింది. 53 కేజీల విభాగంలో పీ.రీహాన్ ఖాన్ ద్వితీయ స్థానం, 53 కేజీల విభాగంలో డెడ్ లిఫ్ట్‌లో కే.సత్యరామరాజు బంగారు పతకం, 74 కేజీల విభాగంలో డెడ్ లిఫ్ట్‌లో వినోద్ కుమార్ బంగారు పతకం సాధించారు. రోల్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా సింగరాయకొండలో నిర్వహించిన 'అస్మితా రోల్ బాల్ లీగ్' పోటీల్లో గుం టూరు నుంచి కైవల్యశ్రీ, మనస్విని, అమూల్య, హృతిక యశోద, లేహ శృతి ద్వితీయ స్థానంలో నిలిచారు. అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరిలో ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో టీ.నాగ జ్యోతి, జీ.స్వాతి పతకాలు సాధించారు. ఈ క్రీడాకారులను, కోచ్‌లను ఎమ్మెల్యే మాధవి అభినందించారు. కార్యక్రమంలో కోచ్ ఖమురుద్దీన్, షేక్ అబ్దుల్ రహీం, చంద్రగిరిబాబు, డాక్టర్ సుస్మిత, సయ్యద్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలు బంకుల్లో సదుపాయాలు కల్పించాలి : జేసీ

గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు నిబంధనల మేరకు కల్పించాల్సిన సదుపాయాలన్నీ అందుబాటులో ఉంచాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో జిల్లాలోని ఐవోసీ, హెచ్‌పీసీఎల్, జియో, నయారా కంపెనీల సేల్స్ ఆఫీసర్స్, పెట్రోలు బంకుల అసోసియేషన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ, పెట్రోలు డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అంబటికి బెయిల్

● జైలు నుంచి విడుదల.. నిబంధనలకు విరుద్ధంగా నేడు ర్యాలీకి సిద్ధం

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక నేరాలతో పాటు చీటింగ్ తదితర సెక్షన్ల కింద సత్తెనపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో రిమాండ్‌లో ఉన్న వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు గుంటూరు కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. ఆయన రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి బుధవారమే విడుదలయ్యారు. తొలుత ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న అంబటిని విచారించాలని ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ సత్తెనపల్లి పోలీసులు కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఇరుపక్షాల న్యాయవాదులు గుంటూరులోని ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి కుముదిని లాటరీ చీటింగ్ కేసులో నిందితుడైన అంబటికి బెయిల్ మంజూరు చేశారు. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్ కొట్టివేసింది. దీంతో బుధవారం సాయంత్రం అంబటి నేరుగా గుంటూరులోని నివాసానికి వచ్చే అవకాశం ఉంది. అయినా అంబటి రాజమండ్రిలోని వైసీపీ నాయకుడు జక్కంపూడి రాజా ఇంట్లో బస చేశారు. గురువారం ఉదయం విజయవాడకు చేరుకుని ర్యాలీగా గుంటూరులోని నివాసానికి చేరుకోనున్నట్లు ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. గుంటూరులో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నా వైసీపీ నాయకులు ఖాతరు చేయకుండా ర్యాలీకి సన్నద్ధం కావడం గమనార్హం. కాగా మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను గుంటూరు సిద్ధార్థనగర్‌లోని నివాసంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి బుధవారం పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక చేస్తోన్న దాడులను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు.

రైతుకే తొలి ప్రాధాన్యం

● మిర్చియార్డు ప్రతిష్ఠ పెంచుతాం ● హమాలీల కోసం ప్రత్యేకంగా ఆరోగ్య కేంద్రం ● యార్డు చైర్మన్‌గా రేపు ప్రమాణ స్వీకారం చేయనున్న కుర్రా అప్పారావు



కుర్రా అప్పారావు

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే మిర్చి రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకొంటూ వారికే తొలి ప్రాధాన్యం ఇస్తూ బాధ్యతలు నిర్వహిస్తామని యార్డు చైర్మన్‌గా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్న కుర్రా అప్పారావు తెలిపారు. మిర్చి యార్డులో తాను అమలు చేయబోయే కార్యక్రమాల గురించి 'ఆంధ్రజ్యోతి'కి బుధవారం వివరించారు. దేశ, విదేశాల్లో ప్రఖ్యాతి గాంచిన గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు)కి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించే అవకాశం దక్కడం తన అదృష్టమన్నారు. రైతులు యార్డుకు తీసుకొచ్చే మిర్చిని గేట్ ఎంట్రీ వద్దనే కమీషన్, ఎగుమతి వ్యాపారుల, క్వాలిటీ టెస్టింగ్ నిపుణులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి శాంపిల్స్ చూసి మార్కెట్‌లో లభించే ధరని తెలియజేసే యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతర్జాతీయ మార్కెట్లను అధ్యయనం చేసి అక్కడి వ్యాపారులు గుంటూరు నుంచి ఎగుమతి అయ్యే మిర్చి క్వాలిటీ ఎలా ఉండాలని ఆశిస్తున్నారో తెలుసుకుని రైతులకు వివరిస్తామన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీల్లో వినియోగించే అవకాశం ఉన్నందున ఏ రోజుకు ఆ రోజు మిర్చి తొడాలను కంపెనీల నుంచే తరలించే వ్యవస్థని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. మార్క్‌ఫెడ్ వలే మార్కెట్ కమిటీ కూడా రంగంలోకి దిగి రైతుల వద్ద మిర్చిని కొనుగోలు చేయగలిగితే కచ్చితంగా పోటీ పెరిగి రైతుకు మేలు జరుగుతుందన్నారు. అయితే ఈ విషయంలో మార్కెటింగ్ చట్టం నిబంధనలపై మార్కెటింగ్ మంత్రితో త్వరలో చర్చిస్తామన్నారు. యార్డులో రైతులకు పెట్టే అల్పాహారం, భోజనంలో నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. రైతులు, వ్యాపారులు, హమాలీలు యార్డుపై సానుకూలంగా లేరని తన పరిశీలనలో తేలిందన్నారు. తమ పాలకవర్గం బాధ్యతలు తీసుకున్న వెంటనే ఆయా అంశాలపై దృష్టి సారించి పరిధిలో ఉన్నంత మేరకు న్యాయబద్ధంగా అందరూ వ్యాపారం చేసేలా చూస్తామన్నారు. రైతుకు నష్టం జరగకుండా చూసేందుకు ప్రాధాన్యం ఇస్తూ, మిర్చియార్డు ఖ్యాతిని పెంచుతామన్నారు. యార్డులో దుమ్ము, ధూళి లేవకుండా ప్రతీ శని, ఆదివారాల్లో శుభ్రం చేస్తామని, శాశ్వత ప్రాతిపదికన ఒక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, అంబులెన్స్ సదుపాయాలను ఏర్పాటు చేసి ఉచిత వైద్యం, ఔషధాలు అందించేలా చూస్తామన్నారు. పచ్చదనాన్ని పెంచేందుకు చర్యలతో పాటు తాగునీరు, డ్రెయి నేజీ, సమస్యల పరిష్కారం, రోడ్లకు మరమ్మతులు చేపడతామన్నారు. రైతు విశ్రాంతి భవనాల్లో అన్ని రకాల సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ నిబంధనల మేరకు రైతుల నుంచి కమీషన్ తీసుకునేలా వ్యాపారులకు చెబుతా మన్నారు. కాటాలు సక్రమంగా జరిగేలా టెక్నాలజీని వినియోగిస్తామన్నారు. పాలక వర్గం నిజాయితీ, పారదర్శకతతో కూడిన పరిపాలన అందించడం ద్వారా కూటమి ప్రభుత్వానికి యార్డులో బలం పెరిగేలా చూస్తామని అప్పారావు తెలిపారు.

ఆర్‌టీఐహెచ్‌లో ఏఐ వ్యూహాత్మక సాధనం

● ప్రొఫెసర్ సౌమిత్ర దత్తా

మంగళగిరి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అమరావతిలో నెలకొల్పిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఏఐ వ్యూహాత్మక సాధనంగా ఉండబోతోందని గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ సృష్టికర్త సౌమిత్ర దత్తా అన్నారు. గత మంగళవారం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో 'ఏఐ యాస్ స్ట్రాటజీ, ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్- ఇండి యాస్ నెక్స్ గ్రోత్ ఫ్రాంటియర్' పేరుతో నాలెడ్జ్ పవర్ సెషన్‌ను నిర్వహించారు. ఎంటర్‌ప్రె న్యూర్‌షిప్, ఇన్నోవేషన్ డైరెక్టర్ డాక్టర్ తిరుమలై నేతృత్వంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సౌమిత్ర దత్తా పాల్గొన్నారు. సమ్మిళిత, స్థిరమైన భవిష్యత్తు కోసం కృత్రిమ మేధను ఉపయోగించడంపై ఆయన చర్చించారు. ఏఐని కేవలం ఒక సాధనంగా కాకుండా, అత్యంత వ్యూహాత్మక సామర్థ్యంగా చూడాలని ఆయన సూచించారు. ఆవిష్కరణను ఏఐ వేగంగా పునర్నిర్మిస్తుందన్నారు. 'స్టార్టప్‌లు, యువ ఆవిష్కర్తలకు ఏఐని వ్యూహంగా అర్థం చేసుకోవడం ద్వారా అభివృద్ధికి మార్గం ఏర్పడుతుందని, ప్రపంచంతో అనుసంధానం అవుతామని చెప్పారు. విద్యాసంస్థలు పరిశోధనా ప్రయోగశాలల నుంచి ఉద్భవించే డీప్ టెక్ స్టార్టప్‌లను పెంపొందించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు. పరిశోధకులు విద్యార్థులను ప్రోత్సహించే బలమైన 'ల్యాబ్ టు మార్కెట్' ఎకో సిస్టమ్ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఐహెచ్ సీఈఓ జి.కృష్ణన్, కిషోర్, బి.విష్ణుప్రియ, ఎం.సౌమ్య, జె.అరుణ, స్టార్టప్‌ల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్క్‌షాపునకు హాజరైన ప్రతినిధులతో ప్రొఫెసర్ సౌమిత్ర దత్తా

వెనుకబడిన వర్గాల సంక్షేమ దిక్సూచి రాష్ట్ర బడ్జెట్

● వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు



మాట్లాడుతున్న మల్లె ఈశ్వరరావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాల సంక్షేమ దిక్సూచి రాష్ట్ర బడ్జెట్ అని వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు అన్నారు. గుంటూరులోని హౌసింగ్ బోర్డు కాలనీలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.51 వేల కోట్లు బీసీలకు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కేటాయింపులతో మరోసారి బీసీ పక్షపాతిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలబడ్డారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి రూ.లక్ష కోట్లు కేటాయించారని తెలిపారు. వెనుకబడిన తరగతులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలనే చిత్తశుద్ధితో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పని చేస్తున్నారన్నారు. టీడీపీ బీసీ నాయకులు సూర్యనారాయణ, మణికుమారి, బాబు పాల్గొన్నారు.

చర్లపల్లి, తిరుచ్చిరాపల్లికి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, తిరుచ్చిరాపల్లికి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07615 చర్లపల్లి - తిరుచ్చిరాపల్లి రైలు మార్చి 3 నుంచి 31వ తేదీ వరకు ప్రతి మంగళవారం సాయంత్రం 5.50 గంటలకు బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల మీదగా మరుసటి రోజు సాయంత్రం 6.45కి తిరుచ్చిరాపల్లికి చేరుతుంది. 07616 తిరుచ్చిరాపల్లి - చర్లపల్లి రైలు మార్చి 4 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ప్రతి బుధవారం రాత్రి 9.30 గంటలకు బయలుదేరి గుంటూరు మీదగా మరుసటి రోజు రాత్రి 9.30గంటలకు చర్లపల్లి చేరుకొంటుందని తెలిపారు.

ఏసీబీ వలలో ఎనర్జీ అసిస్టెంట్

● రూ.70 వేలు లంచం తీసుకుంటూ చిక్కిన అతని తండ్రి

నకరికల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చేజర్ల స్వర్ణ గ్రామంలో ఎనర్జీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నక్కనబోయిన నాగేంద్రబాబు రూ.70 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు బుధవారం పట్టు బడ్డాడు. మండలంలో ఇదే తొలి ఏసీబీ దాడి కావడం గమనార్హం. ఏసీబీ గుంటూరు రీజియన్ అడిషనల్ ఎస్పీ ఎం.మహేంద్ర వివరాల మేరకు.. గుండాల యోహాను తల్లి, పెదమ్మకు చేజర్ల గ్రామంలో మూడున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ పొలంలో మామిడి, బత్తాయి తోటకు నీరు అందించడానికి బోరు వేయించగా.. విద్యుత్ లేన్ కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని జనవరి 17న విద్యుత్ ఏఈ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయాలని కోరారు. దీంతో నాగేంద్రబాబు ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ చేశాడు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ లైన్ ఏర్పాటుకు రూ.80వేలు లంచంగా డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వడం ఇష్టం లేని యోహాన్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. నాగేంద్రబాబు తండ్రి శ్రీనివాసరావు రూ.70 వేలు నగదు చేజర్ల గ్రామ సచివాలయ సమీపంలో తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తండ్రి, కొడుకులను అరెస్టు చేసి, వారి నివాసం, కార్యాలయంలో సోదాలు చేశారు. నిందితులను విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు. నాగేంద్రబాబు ఎనర్జీ అసిస్టెంట్‌గా 2019లో ఎన్నికై గుంటూరులోని డీ-5 సెక్షన్‌లో 2024 వరకు పనిచేశాడు. 2024 జూలై నుంచి చేజర్లలో పని చేస్తున్నాడు. అవినీతి కార్యకలాపాలపై ఏసీబీ టోల్ ఫ్రీ నంబరు 1064 లేదా 94404 440057 నంబరుకు తెలియ జేయాలని కోరారు. ఈ దాడిలో ఇన్‌స్పెక్టరు డి.నాగరాజు, ఎ.మన్మథరావు, వి.సురేష్‌బాబు, ఎస్ఐలు జయభారతరెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు.. ఇంకెన్నాళ్లు!

(5వ పేజీ తరువాయి)

చెల్లించగలమని పాలకులను లబ్ధిదారులు నిలదీస్తున్నారు.

పదేళ్లుగా పెండింగ్

టీడీపీ ప్రభుత్వం 2017లో వేలాదిగా టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టి, పూర్తి చేసింది. ఈ ఇళ్లను వైసీపీ ప్రభుత్వం పాడుబెట్టింది. అలాగే లబ్ధిదారుల పేర్లను మార్చేసింది. దీంతో కొన్ని మునిసిపాలిటీల్లో ఉన్న ఇళ్ల కన్నా లబ్ధిదారుల సంఖ్య పెరిగింది. వైసీపీ హయాంలో రూ.25 వేలు వసూలు చేసి ఇళ్లకు పేర్లు నమోదు చేశారు. ఉదాహరణకు నరసరావుపేటలో 1,504 ఇళ్లు నిర్మిస్తే లబ్ధిదారుల సంఖ్య కన్నా 260 పేర్లు అధికంగా ఉన్నాయి. కనీసం పూర్తయిన ఇళ్లను కూడా లబ్ధిదారులకు అప్పగించడంలో అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కపెడుతోంది. లబ్ధిదారులు ప్రజా ప్రతి ప్రతినిధులు చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నా.. మొర ఆలకించడం లేదు. ప్రభుత్వం తమకు ఇళ్లను అప్పగించే వరకు బ్యాంకు వాయిదాలను నిలిపివేయాలని, అప్పుపై వడ్డీని కూడా రద్దు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో మునిసిపాల్టీలు, గుంటూరు కార్పొరేషన్‌తో సహా రాజధానిలోని పలు గ్రామాల్లో 32,307 టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టారు. 23,520 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. వీటిలో లబ్ధిదారులకు 17,244 ఇళ్లను మాత్రమే అప్పగించారు. ఇంకా 6,276 ఇళ్లు అప్పగించకుండా వదిలేశారు.

ఆర్భాటమే.. ఆచరణ శూన్యం

(5వ పేజీ తరువాయి)

అటకెక్కించారు. కనీసం రికార్డులు నిర్వహించారో లేదోననే అనుమానం కలిగేలా వ్యవసాయశాఖ పూర్తి విస్మరించింది.

90 వేల కుటుంబాల సర్వే..

రైతు సేవా కేంద్రం యూనిట్‌గా 540 రైతు కుటుంబాల వద్దకు సిబ్బంది వెళ్లేలా రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం డిజైన్ చేసింది. బాపట్ల జిల్లాలోనే 29,340, గుంటూరు, పల్నాడు జిల్లాలతో కలుపుకుంటే మొత్తంగా దాదాపు 90 వేల రైతు కుటుంబాల ఇళ్లకు వెళ్లి.. నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు వంటి పంచ సూత్రాలను అన్నదాతలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను కరపత్రం రూపంలో అందించారు. సిబ్బంది నమోదు చేసుకున్న అభ్యంతరాలే మూడు జిల్లాల పరిధిలో దాదాపు 7,500 వరకు ఉన్నట్లు సమాచారం.

ప్రణాళికలు ఆ రోజుకే పరిమితమా?

ఆర్ఎస్‌కే యూనిట్‌గా నిర్వహించిన వర్క్‌షాప్‌లో ప్రస్తుత రబీతో పాటు 2026-27 సాగు ప్రణాళికలపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ప్రస్తుత రబీకి సంబంధించి వర్క్‌షాప్‌ల వేదికగా తీసుకున్న నిర్ణయాల్లో ఎన్ని అమలు చేశారంటే వ్యవసాయశాఖ వద్ద సమాధానమే లేదు. ఈ వేదికలపై దాదాపు 2 వేల వరకు సమస్యలను గుర్తించామని, వీటిపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమం త్వరలోనే చేపడతామని వ్యవసాయశాఖ ప్రకటించింది. రెండునెలలు గడిచినా కనీసం సమీక్ష కూడా జరప లేదు.

చిత్రజ్యోతి

SINCE 1965

నవ్వుల విందు



తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను నవ్వించే శ్రీవిష్ణు మరోసారి ఎంటర్‌టైన్ చేసేందుకు వస్తున్నారు. ఆయన హీరోగా యదునాథ్ మారుతీరావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'విష్ణు విన్యాసం'. ఈ నెల 28న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. శ్రీవిష్ణు తన మార్క్ టైమింగ్‌తో ఆకట్టుకోగా, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిశోర్ వంటి కామెడీ దండు అలరించింది. ఈ సందర్భంగా శ్రీవిష్ణు మాట్లాడుతూ 'ఇది మంచి సెలబ్రేషన్ లాంటి సినిమా. ప్రథమార్థం యువతను, ద్వితియార్థం కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'శ్రీవిష్ణు నుంచి ప్రేక్షకులు ఆశించే అన్ని అంశాలతో ఈ సినిమా కథ సాగుతుంది. ఇది కేవలం లవ్ స్టోరీ మాత్రమే కాదు, సందర్భానుసారం వచ్చే హాస్యం ప్రేక్షకులను అలరిస్తుంది' అని చెప్పారు. శ్రీవిష్ణు విన్యాసాలు థియేటర్లలో ప్రేక్షకులను అలరిస్తాయి అని నిర్మాత సుమంత్ నాయుడు జి. అన్నారు.


అందరూ 'సుహాస్ సినిమా' అనే అంటారు

సందీప్ కిషన్



'ఈ చిత్రం టైటిల్ 'హే బల్వంత్'గా మారినా దీన్ని అందరూ 'సుహాస్ సినిమా' అనే అంటారు. కథను నమ్మి, ప్రాణం పెట్టి పని చేసే నటుడు సుహాస్.ఈ చిత్రంతో ఆయన మరోసారి ప్రేక్షకుల మనసు గెలుచుకోవడం ఖాయం' అని హీరో సందీప్ కిషన్ అన్నారు. సుహాస్ కథానాయకుడిగా గోపీ అచ్చర దర్శకత్వంలో బి. నరేంద్రరెడ్డి నిర్మించిన చిత్రమిది. ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు సందీప్ కిషన్ ముఖ్య అతిథిగా హాజరై సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. సుహాస్ మాట్లాడుతూ 'నా కెరీర్ ప్రారంభంలో నన్ను తక్కువ చేసి మాట్లాడినవారు ఉన్నారు. ఇప్పుడు కీర్తిసురేశ్ లాంటి పెద్ద హీరోయిన్లతో నటించే స్థాయికి చేరుకున్నాను. కష్టపడితే ఏదైనా సాధించవచ్చు. 'హే బల్వంత్' చిత్రాన్ని నరేంద్రరెడ్డి రాజీపడకుండా నిర్మించారు. నా కెరీర్‌లో ఇదొక పెద్ద కమర్షియల్ హిట్ అవుతుందని నమ్ముతున్నాను' అని అన్నారు. నిర్మాత వంశీ నందిపాటి మాట్లాడుతూ 'ఈ చిత్రంలో తండ్రీ కొడుకుల ఎమోషన్ కదిలిస్తుంది. ప్రేక్షకులకు ఇది పక్కా పైసా వసూల్ చిత్రం. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో దర్శకుడు గోపికి ఇప్పుడే నా తదుపరి సినిమా అడ్వాన్స్ ఇస్తున్నాను' అని చెప్పారు.

సైకలాజికల్ థ్రిల్లర్‌లో..



హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. గతేడాది దాదాపు అరడజను సినిమాలతో ప్రేక్షకులను పలకరించారు ఆమె. బుధవారం ఆమె పుట్టినరోజు. ఈ సందర్భంగా అనుపమ నటించనున్న ఓ బాలీవుడ్ చిత్రం గురించి అప్డేట్ ఇచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్. సైకలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి ఆర్జే షాన్ దర్శకుడు. ఎస్‌కేగీ ఎంటర్టైన్‌మెంట్స్, బెంచ్‌మార్క్ స్టోరీ టెల్లర్స్ బ్యానర్లపై శివిన్ నారంగ్, ప్రేరణ్ అరోరా, కిరణ్ బల్లపల్లి నిర్మించనున్నారు. మే నుంచి చిత్రీకరణ మొదలుకానుంది.

పెళ్లి కూతురిగా

అనుపమ నటిస్తున్న తాజా చిత్రం 'క్రేజీ కల్యాణం'. దర్శకుడు తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. బద్రప్ప గాజుల దర్శకత్వంలో బూసమ్ జగన్మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా ఆమెకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. పెళ్లి కూతురి గెటప్‌లో సంతోషంగా డ్యాన్స్ చేస్తున్న ఆమె లుక్ ప్రస్తుతం అందర్నీ ఆకట్టుకుంటోంది.

వినోదాత్మక చిత్రం



సత్యదేవ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న కొత్త చిత్రం బుధవారం ప్రారంభమైంది. సత్యదేవ్ నటిస్తున్న 15వ చిత్రమిది. లక్ష్మీనారాయణ పుట్టంచెట్టి దర్శకత్వంలో బి. నరేంద్రరెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి హీరో, హీరోయిన్లపై క్లాప్ ఇచ్చి షూటింగ్‌ను ప్రారంభించారు. నిర్మాత వంశీ నందిపాటి కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇది ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తే ఒక చక్కని వినోదాత్మక చిత్రం. రామ్ మిరియాల గారు తొలిసారి ఒక పూర్తి స్థాయి సినిమాకు సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అని చెప్పారు. ఈ సినిమా సత్యదేవ్ కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలవాలని నిర్మాత వంశీ నందిపాటి ఆకాంక్షించారు.

న్యాయం చేయరా దేవుడా!




ఇటీవలి కాలంలో వార్తల్లో నిలిచిన నృత్య దర్శకురాలు శ్రుష్టి వర్మ ఇప్పుడు తెర వెనుక నుంచి తెరపైకి వస్తున్నారు. సుమన్, సాయికుమార్, నటరాజ్, వరుణ్‌సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'ధర్మస్థల నియోజకవర్గం' చిత్రంలో ఐటెం సాంగ్‌తో ఆమె ఎంట్రీ ఇస్తున్నారు. ఈ పాటకు ఆమె నృత్య దర్శకురాలు కావడం విశేషం. 'న్యాయం చేయరా దేవుడా' అంటూ సాగే ఆ పాటలో శ్రుష్టి తన అందచందాలతో ఆకట్టుకోనున్నారు. జై జ్ఞానప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మిస్తున్న పొలిటికల్ ఎంటర్‌టైనర్ 'ధర్మస్థల నియోజకవర్గం'లో శ్రుష్టి పాట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఇప్పటికే షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలోనే శ్రుష్టి వర్మ పాటను విడుదల చేయనున్నారు. త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని దర్శకనిర్మాతలు చెప్పారు.

రుచి.. వాసన కోల్పోయాను



మలయాళ హీరో మమ్ముట్టి గతేడాది అనారోగ్యంతో నటనకు విరామం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై తాజాగా ఆయన స్పందించారు. 'వినికిడి శక్తి, చూపు మనిషికి అత్యంత కీలకం. ఒక్కోసారి శ్వాసను పీల్చుకుంటున్నా, వాసనను పసిగట్టే సామర్థ్యాన్ని కోల్పోతాం. ఆ పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంటుంది. నేను ఆ సమస్యను అనుభవించా. కొంత కాలం రుచి, వాసన సామర్థ్యాల్ని కోల్పోయాను. ఇప్పుడిప్పుడే తిరిగి పొందుతున్నాను. అటువంటి సామర్థ్యాలను కోల్పోయినప్పుడే వాటి విలువ మనకు తెలుస్తుంది. ఎవరైనా గట్టిగా మాట్లాడితే చిన్నగా మాట్లాడమని అడుగుతాం. మనకు వినికిడి శక్తి ఉంది కాబట్టే అలా చెప్పగలుగుతున్నాం. అయితే వినికిడి శక్తి లేనివారు అలా చెప్పలేరు. వారికి ఎలా మాట్లాడినా తేడా అనిపించదు. వినికిడి శక్తి దేవుడిచ్చిన వరం' అని చెప్పారు. ప్రస్తుతం మమ్ముట్టి నటిస్తున్న 'పేట్రియాట్' చిత్రం ఏప్రిల్ 23న విడుదలవుతోంది. మోహన్‌లాల్, ఫహాద్ ఫాసిల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలాగే సీనియర్ దర్శకుడు ఆదూర్ గోపాలకృష్ణన్ దర్శకత్వంలో 'పాదయాత్ర'లో.. ధనుష్ 'డీ 55'లో చిత్రాల్లో నటిస్తున్నారు మమ్ముట్టి.

కొత్త ప్రయాణం మొదలు



వైవిధ్యమైన పాత్రలు పోషించి హీరోయిన్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నిత్య మీనన్. ఓ వైపు తన నటనతో ప్రేక్షకులను అలరిస్తూనే.. నిర్మాతగా మరో కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. కేయూరి అనే నిర్మాణ సంస్థను ప్రారంభిస్తున్నట్లు సోషల్‌మీడియా ద్వారా తెలిపారు. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశారు. 'నా దృష్టిలో సినిమాలు తీయడం అంటే కేవలం కథలు చెప్పడమే కాదు. ప్రేక్షకులకు లోతైన భావోద్వేగాల్ని అందించడం. ఓ మార్పును తీసుకురావడం. నటిగా ప్రయాణం మొదలుపెట్టినప్పుడు ఇదే దృక్పథంతో ముందుకెళ్లా. నిర్మాతగాను ఇదే పద్ధతి పాటిస్తాను. కేయూరి ప్రొడక్షన్స్ ద్వారా విభిన్నమైన సినిమాలను మీకు అందిస్తాను' అని పేర్కొన్నారు. ఈ బ్యానర్‌పై ఆమె నిర్మించనున్న ప్రాజెక్ట్ వివరాలు తెలియాల్సి ఉంది.





అశేష భక్తజనం మధ్య ఉత్సవమూర్తులను చక్రతీర్థ స్నానానికి తీసుకెళ్తున్న దృశ్యం

శ్రీముఖలింగేశ్వరుడికి చక్రతీర్థ స్నానం

జలుమూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలంలో వెలసిన శ్రీముఖలింగేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం చక్రతీర్థ స్నానం వైభవంగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాక ఒడిశా నుంచి కూడా భక్తులు చక్రతీర్థ స్నానాలకు తరలి వచ్చారు. బుధవారం తెల్లవారుజాము నుంచే వంశధార నదిలో స్నానం చేసి శ్రీముఖలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. ఉదయం 11.30 గంటలకు పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను నంది వాహనంపై ఆశీనులను చేశారు. స్వామివారిని ఊరేగింపుగా వంశధార నది మిరియాపల్లి రేవుకు తీసుకుని వెళ్లారు. అనంతరం ఆలయ అర్చకులు ఉత్సవమూర్తులకు చక్రతీర్థ స్నానాలు జరిపించారు.



అశ్వవాహనంపై ఆది దంపతులు

ఆలయోత్సవంలో స్వామి, అమ్మవార్లు

- శ్రీశైలంలో ముగిసిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. 11వ రోజు నవవాహ్నిక దీక్షతో అర్చక వేదపండితులు భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అశ్వవాహన సేవ నిర్వహించారు. అనంతరం ఆలయోత్సవం జరిపారు. చెంచుల నృత్యాలు, డప్పుచప్పుళ్లు, కోలాటల నడుమ ఆలయోత్సవం సాగింది. పుష్పోత్సవంలో భాగంగా 21 రకాలైన సుగంధ పుష్పాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం నుంచి ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలను పునఃప్రారంభించనున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

బాలిక కిడ్నాప్.. అత్యాచారయత్నం

- శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో వైసీపీ కార్యకర్త అరాచకం
- మూడు రోజుల తరువాత వెలుగులోకి..
- పోక్సో కేసు నమోదు



వైసీపీ నాయకుడు వేణురెడ్డితో గోవర్ధన్

హిందూపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో వైసీపీ కార్యకర్త ఓ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచార యత్నం చేశాడు. హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ ఆంజనేయులు తెలిపిన మేరకు, కర్ణాటకకు చెందిన ఓ మహిళ తన కూతురితో కలిసి కొన్నేళ్ల క్రితం హిందూపురం ప్రాంతానికి వలస వచ్చారు. ఇదే మండలంలోని ఓ ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. బాలిక తండ్రి మృతి చెందగా, తల్లి అనారోగ్యంతో బాధపడుతున్నారు. పేదరికం కారణంగా బాలిక(15) చదువు మానేసి తల్లి ఆలనా పాలనా చూసుకుంటోంది. ఈ క్రమంలో హిందూపురం మండలం కెబినవనపల్లికి చెందిన వెంకటరమణ కుమారుడు, వైసీపీ కార్యకర్త గోవర్ధన్ ఇన్‌స్టాగ్రామ్‌లో బాలికను ట్రాప్ చేశాడు. చంపేస్తానని బెదిరించి, మూడు రోజుల క్రితం కిడ్నాప్ చేసి అత్యాచారానికి యత్నించాడు. బాలిక తప్పించుకుని, ఇతరుల సాయంతో ఇంటికి చేరుకుంది. తన తల్లి అనారోగ్యంతో బాధపడుతుండటంతో జరిగిన విషయాన్ని చెప్పేందుకు సంకోచించింది. స్థానికులు ఇచ్చిన ధైర్యంతో తల్లితో కలిసి బుధవారం హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. నిందితుడు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దీపిక భర్త వేణురెడ్డికి సన్నిహితుడు.

పెరిగిన గోదావరి నీటి మట్టం

పోలవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో గోదావరి నీటిమట్టం బుధవారం అనూహ్యంగా పెరిగింది. ఎగువ కాఫర్ డ్యాం వద్ద నీటిమట్టం పెరగడంతో సమీపాన ఉన్న మాతృశ్రీ గండి పోశమ్మ ఆలయం నీట మునిగింది. దీంతో దేవదాయ శాఖ అధికారులు ఈ ఆలయానికి రాకపోకలను నిషేధించారు. ఎగువ ప్రాంతాల్లో సీలేరు ఇతర ప్రాజెక్టుల నుంచి దిగువకు వస్తున్న జలాలను కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల్లో గోదావరి నీటిమట్టం క్రమబద్ధీకరణ కోసం గేట్లను మూసివేసిన కారణంగా నదిలో నీటి మట్టం పెరిగింది. ప్రాజెక్టు స్పిల్వే 48 గేట్లకు గాను ఉదయం నుంచి 11 గేట్ల ద్వారా నీటిని విడుదల చేయగా సాయంత్రం నుంచి 14 గేట్ల ద్వారా నీటి విడుదల చేస్తున్నారు.



రాజమహేంద్రవరంలో కోర్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న బాంబు స్క్వాడ్



అనంతపురం జిల్లా కోర్టులో తనిఖీలు నిర్వహిస్తున్న బాంబు, డాగ్ స్క్వాడ్

కోర్టులకు బాంబు బెదిరింపులు

- ఉమ్మడి తూర్పుగోదావరి, అనంతపురం జిల్లాల్లో కలకలం

రాజమహేంద్రవరం/అనంతపురం క్రైం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో కోర్టులకు బాంబు బెదిరింపులు రావడంతో కలకలం రేగింది. రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో 25 వరకూ వివిధ కోర్టులు ఉన్నాయి. వందలాది మంది న్యాయవాదులు రోజూ విధులు నిర్వర్తిస్తుంటారు. బాంబు సరిగ్గా మధ్యాహ్నం 12.35 గంటలకు పేలుతుందని కాల్ రావడంతో ఉదయం 10 గంటల సమయంలో ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో బాంబ్, డాగ్ స్క్వాడ్‌లు రంగంలోకి దిగాయి. అన్ని కోర్టులు, బార్ అసోసియేషన్ గది, జడ్జిల చాంబర్లలో క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. సుమారు 4 గంటలపాటు తనిఖీలు జరిపి నకిలీ కాల్ అని పోలీసులు తేల్చారు. మరోవైపు.. అనంతపురం జిల్లా కోర్టును బాంబులతో పేల్చేస్తామని బుధవారం ఉదయం 9 గంటలకు కోర్టు అధికారిక మెయిల్‌కు బెదిరింపు సందేశం వచ్చింది. అదే మెయిల్‌కి మధ్యాహ్నం 12.15 గంటలకు మరో మెయిల్ వచ్చింది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం కోర్టును 12 ఆర్డీఎక్స్ బాంబులతో పేల్చి వేస్తామని అజ్ఞాత వ్యక్తి మెయిల్ పంపించాడు. గుంతకల్లులోని జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సైతం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో న్యాయాధికారులు, న్యాయవాదులు, కక్షిదారులను బయటకు పంపి, పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పేలుడు పదార్థాల ఆనవాళ్లు లేకపోవడంతో ఉత్తుత్తి బెదిరింపులుగా తేల్చారు. అనంతరం కోర్టులలో కార్యకలాపాలు యథావిధిగా కొనసాగాయి. జనవరి 8వ తేదీ కూడా అనంతపురం కోర్టు కాంప్లెక్స్‌కు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.

ఒకదాని వెంట మరొక అల్పపీడనం

- 21 నుంచి సీమ, 22 నుంచి దక్షిణ కోస్తాకు వర్షసూచన

విశాఖపట్నం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): హిందూ మహాసముద్రం, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. దీనిపై ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అల్పపీడనం రానున్న 24 గంటల్లో పశ్చిమ వాయువ్యంగా పయనించే క్రమంలో తీవ్ర అల్పపీడనంగా బలపడి శ్రీలంక వైపు రానున్నది. మరో అల్పపీడనం ఈ నెల 21న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడుతుందని ఐరోపా వాతావరణ శాఖ తెలిపింది. ఆ తరువాత పశ్చిమ వాయువ్యంగా పయనించి 23వ తేదీకల్లా శ్రీలంకకు సమీపంగా రానున్నదని వెల్లడించింది. ప్రస్తుతం నైరుతి బంగాళాఖాతంలో ఉన్న అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 20వ తేదీ తరువాత దక్షిణ తమిళనాడు, కేరళల్లో ఎక్కువగా వర్షాలు కురుస్తాయి. అల్పపీడనం బలపడి శ్రీలంక వైపు రావడంతో సముద్రం నుంచి తూర్పుగాలులు తమిళనాడు వైపు వీయనున్నాయి. దీంతో ఈ నెల 21 నుంచి మూడు రోజులు రాయలసీమలో, 22 నుంచి రెండు రోజులపాటు దక్షిణ కోస్తాలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం కోస్తాలో పలుచోట్ల పొగమంచు కురిసింది. పగటి ఉష్ణోగ్రతలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రానున్న 24 గంటల్లో కోస్తాలోని పలు జిల్లాల్లో పొగమంచు కురుస్తుందని, ఎండ తీవ్రత స్వల్పంగా పెరుగుతుందని తెలిపింది.

23న కౌలు రైతు సంఘం నిరసనలు

వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్

విజయవాడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు మొత్తం బడ్జెట్‌లో కేవలం 4.31 శాతం మాత్రమే నిధులు కేటాయించి చేతులు దులుపుకొందని కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య విమర్శించారు. వ్యవసాయ సంక్షోభం నుంచి రైతాంగాన్ని కాపాడడానికి ఈ నిధులు ఏమాత్రం సరిపోవని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యాన,మత్స్య, పశుసంవర్థక, పట్టు, జలవనరుల, విద్యుత్, ఉపాధి హామీ తదితర పథకాలకు గతంలో కంటే ఈసారి నిధులు తగ్గించారని చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం నూతన కౌలు చట్టం గురించి బడ్జెట్‌లో ప్రస్తావనే లేదని జమలయ్య విమర్శించారు. ఈ నెల 23 తేదీన రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిరసన వ్యక్తంచేయాలని కౌలు రైతుల సంఘం నిర్ణయించినట్టు తెలిపారు.

ఉపాధిలో ఏపీ టాప్

- ఆరేళ్ల తర్వాత మెటీరియల్ పనుల్లో మొదటి స్థానం
- ఈ నెల 18 నాటికి రూ.1,884 కోట్ల బిల్లులు అప్‌లోడ్
- ఇప్పటికే రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో నం.1
- ఢిల్లీలో తిరిగి పుంజుకుంటున్న రాష్ట్ర ప్రతిష్ఠ
- ఉపాధి పథకాన్ని భ్రష్టు పట్టించిన వైసీపీ ప్రభుత్వం
- దొంగ మస్టర్లు, నిధుల దుర్వినియోగంతో తలవంపులు



అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధుల పనుల్లో ఏపీ టాప్‌లో నిలిచింది. ఆరేళ్ల తర్వాత జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్ఠ మళ్లీ పుంజుకుంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఉపాధి పథకానికి సంబంధించి అన్నీ విభాగాల్లోనూ రాష్ట్రమే ముందుండేది. జగన్ సర్కారు వచ్చిన తర్వాత ఈ పథకాన్ని భ్రష్టు పట్టించారు. దొంగ మస్టర్లుకు అవకాశం ఇవ్వడం, పనులు చేయకుండానే వైసీపీ కార్యకర్తలు మెటీరియల్ నిధులు పంచుకోవడం తదితరాలతో ఢిల్లీలో రాష్ట్ర ప్రతిష్ఠ మసకబారింది. కేంద్ర అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తే ఇక్కడి అధికారులు సమాధానం చెప్పలేని దుస్థితి ఉండేది. ఒక దశలో రాష్ట్రానికి ఉపాధి పనిదినాలు నిలిపేశారు. ఏ నిధులు విడుదల చేయాలన్నా అనేక తనిఖీలు నిర్వహించి మంజూరు చేసేవారు. అయితే కూటమి సర్కారు వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రోత్సాహంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజ గ్రామీణాభివృద్ధి, పీఆర్ శాఖలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేశారు.

స్వర్ణ పంచాయతీతో సరికొత్త రికార్డు

పంచాయతీల్లో పారదర్శకత పెంచి ఆదాయం పెంచేందుకు రూపొందించిన సరికొత్త స్వర్ణ పంచాయతీ పోర్టల్ అద్భుత ఫలితాలు సాధిస్తోంది. పన్నులు చెల్లిస్తే ఎవరికి చేరతాయో తెలియని స్థితి నుంచి ఆన్‌లైన్ ద్వారా పన్ను చెల్లిస్తే వెంటనే బిల్లు మొబైల్‌కు వచ్చే పరిస్థితి ఏర్పడింది. 88 లక్షల అసెస్‌మెంట్లతో పంచాయతీల ఆదాయం రూ.450 కోట్ల నుంచి రూ.1,000 కోట్లకు చేరింది. ఇప్పటికే రూ.500 కోట్లకు పైగా పన్నులు జమయ్యాయి. ఆర్థిక సంఘం నిధుల వ్యయం, సిబ్బంది డేటాబేస్‌ను పోర్టల్‌లో ఉంచడం ద్వారా పంచాయతీరాజ్ శాఖ సరికొత్త చరిత్రను సృష్టించనుంది. స్వర్ణ పంచాయతీల విధానం ఇప్పుడు దేశానికి ఆదర్శంగా మారింది. మరోవైపు ఘన వ్యర్థాలను సంపదగా మార్చే వినూత్న కార్యక్రమానికి ఈ శాఖ శ్రీకారం చుట్టింది. ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ప్రతిఫలంగా కుటుంబానికి నిత్యావసరాలు అందజేసేందుకు గ్రామాల్లో స్వర్ణ రథాలు సంచరిస్తున్నాయి. అడవితల్లి బాట లాంటి పథకాల ద్వారా ఏజెన్సీలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు.

ఆర్‌జీఎస్‌ఏలోనూ టాప్‌లోకి

గత టీడీపీ హయాంలో ప్రతి శాఖకు సంబంధించి లక్ష్యాలు సాధించడంలో ముందున్న రాష్ట్రాన్ని జగన్ ప్రభుత్వం వెనుక వరుసలో నిలబెట్టింది. రాష్ట్ర వాటా ఇవ్వకుండా పలు కేంద్ర పథకాలను అమలు కానీయకుండా అడ్డుకున్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల శిక్షణకు ఉద్దేశించిన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్(ఆర్‌జీఎస్‌ఏ)ను కూడా అటకెక్కించారు. ఒక్క ప్రజాప్రతినిధికి కూడా శిక్షణ ఇవ్వకపోవడంతో అప్పట్లో రాష్ట్రానికి ఈ పథకం కింద కేంద్రం ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. వైసీపీ హయాంలో ఆర్‌జీఎస్‌ఏ అమల్లో ఏపీ 24వ స్థానంలో నిలిచింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల నిరంతర కృషితో ఇప్పుడు ఈ పథకం కింద శిక్షణ ఇవ్వడంలో రాష్ట్రం టాప్‌లోకి చేరుకుంది.

మెటీరియల్ నిధుల్లో ముందు వరుసలో..

మొదటినుంచీ ఉపాధి పథకం వినియోగంలో ఏపీ ముందు వరుసలో ఉండేది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో మెటీరియల్ కాంపోనెంట్ వినియోగంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఆ ఐదేళ్లలో సుమారు 120 అవార్డులు కైవసం చేసుకుంది. ఆ తర్వాత వైసీపీ హయాంలో అంతా రివర్స్ అయింది. ఉపాధి పథకంలో అనుమతి లేని పనులు ప్రారంభించడంతో కన్నెర్ర చేసిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సచివాలయాల భవనాలు, జగనన్న కాలనీల్లో లెవలింగ్ పనులను నిలిపివేసింది. ఈ పనుల పేరుతో వైసీపీ కార్యకర్తలకు రూ.1,500 కోట్లు దోచిపెట్టినా అవి ఎక్కడా ఉపయోగపడలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పల్లెపండుగ 1.0 పేరుతో 4 వేల కి.మీ. సిమెంట్ రోడ్లతో పాటు 25వేల మినీ గోకులాలు నిర్మించారు. పల్లెపండుగ 2.0 కింద ఇప్పటికే 50శాతం సిమెంట్ రోడ్లు, మినీ గోకులాలను పూర్తి చేశారు. బుధవారం నాటికి రూ.1,884 కోట్ల మెటీరియల్ బిల్లులు అప్‌లోడ్ చేసి దేశంలోనే ఏపీ టాప్‌లో నిలిచింది.

సీబీఐ మాకు న్యాయం చేయలేదు

- చంద్రబాబు వంటి నేతనే అరెస్టు చేశారు
- మా కుమార్తె కేసులో ఎలాంటి అరెస్టు జరగలేదు
- జ్యుడీషియల్ కమిటీతో విచారణ చేయాలి
- కోర్టులో అయేషామీరా తల్లిదండ్రులు

విజయవాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): "మాకు సీబీఐ న్యాయం చేయలేదు. మా కుమార్తె హత్య జరిగి 19 ఏళ్లు కావస్తోంది. ఈ కేసులో ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదు. చంద్రబాబు వంటి నేతలను అరెస్టు చేసి, కస్టడీకి తీసుకున్నారు. మా కేసులో సీబీఐ ఏమీ చేయలేదు" అని బీఫార్మసీ విద్యార్థిని అయేషా మీరా తల్లిదండ్రులు బాషా, శంషాద్‌బేగం న్యాయాధికారి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కేసును సీబీఐకి అప్పగించిన తర్వాత సమాధి నుంచి అయేషామీరాకు సంబంధించిన కొన్ని భాగాలను అధికారులు సేకరించి రీపోస్టుమార్టం చేయించారు. ఆ భాగాలను విజయవాడ సీబీఐ కోర్టుకు అప్పగించారు. వాటిని తమకు అప్పగించాలని కొద్దిరోజుల క్రితం ఆమె తల్లిదండ్రులు సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారణ జరిగింది. వారి తరపున న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ వాదనలు వినిపించారు. రీపోస్టుమార్టం జరిగిన తర్వాత రెండు నెలల్లో శరీర భాగాలను అప్పగించాలని.. కానీ, సీబీఐ వాటిని తమ వద్దే పెట్టుకుందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అయేషా శరీర భాగాలను ఇవ్వడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని సీబీఐ తరపున కౌన్సిల్ వాదించారు. వాదప్రతివాదనలు విన్న న్యాయాధికారి ఎల్.అన్నపూర్ణ, అయేషా శరీర భాగాలను తీసుకెళ్తామంటే ఇప్పుడే ఇస్తామని ఆమె తల్లిదండ్రులకు చెప్పారు. అయితే..రంజాన్ మాసం ప్రారంభమవుతున్నందున వాటిని ఇప్పుడు తీసుకెళ్లవచ్చా లేదా అన్న విషయాన్ని మతపెద్దలను సంప్రతించి చెబుతామనడంతో విచారణను 20వ తేదీకి వాయిదా వేశారు. అనంతరం కోర్టు బయట బాషా, శంషాద్‌బేగం మీడియాతో మాట్లాడుతూ అయేషామీరా హత్యకేసును పునః దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు అధికారంలో ఉన్నారు కాబట్టి కేసు విచారణకు జ్యుడీషియల్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

ఉరితాడైన ఊయల!

- చీర మెడకు బిగుసుకుని బాలిక మృతి

మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సరదాగా ఊగుతున్న ఊయలే చిన్నారి ఉసురుతీసింది. మార్కాపురం టౌన్ ఎస్ఐ ఎం.సైదుబాబు కథనం మేరకు.. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన చేబ్రోలు జయకుమార్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతని కుమార్తె సునంద భాగ్యలక్ష్మి(7) మంగళవారం రాత్రి ఇంట్లో ఊయల ఊగుతూ ఉంది. ఈ క్రమంలో ఊయల చీర ఆమె మెడకు చుట్టుకుంది. మళ్లీ పక్కకు తిరిగేందుకు బాలిక ప్రయత్నించినా మెడకు చీర ఒరుసుకుపోవడంతో ఊపిరాడలేదు. గమనించిన తల్లి వెంకటమ్మ కుమార్తెను కాపాడేందుకు ప్రయత్నించినా అప్పటికే భాగ్యలక్ష్మి ఊపిరాడక మృతి చెందింది. తండ్రి జయకుమార్ ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రంప్‌నకు దేశం తాకట్టు

- ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మోదీ పేరు
- అందుకే ఆయన యూఎస్‌కు సాగిలపడ్డారు
- వ్యవసాయ, చేనేత రంగాలకు తీరని నష్టం
- లడ్డూ కల్తీ బాధ్యులను శిక్షించాలి: నారాయణ



కాకినాడ సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'ట్రంప్ విధానాలకు సాగిలపడి బానిసగా మారిన ప్రధాని మోదీ... దేశాన్ని తాకట్టు పెట్టారు. అమెరికా వ్యవహరిస్తున్న తీరు వల్ల భారత్‌లోని వ్యవసాయ, చేనేత రంగాలకు తీరని నష్టం వాటిల్లుతోంది' అని సీపీఐ జాతీయ నేత కె.నారాయణ విమర్శించారు. కాకినాడలో జరుగుతున్న ఆ పార్టీ రాష్ట్ర సమితి సమావేశాల సందర్భంగా బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'జాతీయ స్థాయిలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ రూ.కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేస్తుంది. బ్యాంకులకు రుణా లు ఎగ్గొట్టిన వారిలో 28 మంది దిగ్గజాలు ఉన్నారు. అందులో గుజరాత్‌కు చెందిన వారు 27 మంది. వారు రూ.27 లక్షల కోట్ల రుణాలను ఎగ్గొట్టారు. వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఆ రుణాలను మాఫీ చేస్తున్నారు. ప్రపంచాన్ని కుదిపివేస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మోదీ పేరు వచ్చింది. దీంతో ఆయన అమెరికాకు సాగిలపడి దేశం పరువు తీశారు. కార్పొరేట్ల మేలు కోసం అటవీ చట్టాలను మార్చి, అటవీ సంపదను వారికి దోచిపెడుతున్నారు. బిల్‌గేట్స్‌ను తీసుకువచ్చి అమరావతిలో అరటి తోటలను చూపించిన సీఎం చంద్రబాబు... కేంద్రంలో వ్యవసాయ రంగానికి అన్యాయం చేస్తున్న మోదీని నిలువరించడానికి మాత్రం భయపడుతున్నారు. వ్యవసాయ భూములను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తూ, వారికి ఊడిగం చేయడంలో మోదీ, బాబు పోటీ పడతున్నారు. పాలకులకు ఐఏఎస్‌లు, ఐపీఎస్ అధికారులు బానిసలుగా ఉండొద్దు. పాలకుల మాటలు విని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి నేటికి కూడా విచారణను ఎదుర్కొంటున్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో బాధ్యులైన వారిని శిక్షించాలి.' అని నారాయణ డిమాండ్ చేశారు.

ఈసారి యానాం ఎమ్మెల్యే అశోక్ ఓటమికి కృషి చేస్తా

'పుదుచ్చేరి రాష్ట్రంలోని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ బీజేపీ పంచన చేరి అత్యంత అవినీతిపరుడి మారాడు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన అశోక్ తరపున ఆ ఎన్నికల్లో నేను ప్రచారం చేశా. గెలిచిన కొద్ది రోజుల తర్వాత ఆయన బీజేపీ పంచన చేరాడు. ఈసారి ఎన్నికల్లో అశోక్ పోటీ చేస్తే ఆయన ఓటమికి నేను ప్రచారం చేస్తా' అని నారాయణ ప్రకటించారు.

67 ఏళ్లలో తొలిసారి..

రంజీ ఫైనల్‌కు జమ్మూకశ్మీర్
బెంగాల్‌కు ఝలక్



కల్యాణి (పశ్చిమ బెంగాల్): జమ్మూ కశ్మీర్ జట్టు 67 ఏళ్ల తమ రంజీ ట్రోఫీ చరిత్రలో తొలిసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. రెండుసార్లు చాంపియన్ బెంగాల్‌ను సెమీఫైనల్లో ఆరు వికెట్లతో చిత్తుచేసింది. చివరిగా 2013-14 సీజన్‌లో అత్యుత్తమంగా నాకౌట్‌కు చేరిన ఆ జట్టు.. ఆ తర్వాత అంతకుమించిన స్థాయి ప్రదర్శన చేయడం ఇదే తొలిసారి. 126 పరుగుల ఛేదనలో భాగంగా ఓవర్‌నైట్ స్కోరు 42/3తో నాలుగో రోజైన బుధవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జమ్మూ 34.4 ఓవర్లలోనే 126/4 స్కోరు చేసి చరిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఆకాశ్ దీప్ 3 వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో బెంగాల్ 328, జమ్మూ 302 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో బెంగాల్ 99 పరుగులకే కుప్పకూలింది. మొత్తంగా 9 వికెట్లు తీసిన అకీబ్ నబీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇక, పాతికేళ్లుగా రంజీల్లో ఆడుతున్న జమ్మూ కెప్టెన్, 41 ఏళ్ల పరాస్ డోగ్రా.. రంజీల్లో వేగంగా (147 ఇన్నింగ్స్) 10వేల పరుగులు పూర్తి చేసిన తొలి ఆటగాడయ్యాడు. ఈ క్రమంలో వసీం జాఫర్ (196 ఇన్నింగ్స్) రికార్డును అధిగమించాడు. ఇక.. ఈ 25 ఏళ్లలో 3 జట్ల తరపున ఆడిన డోగ్రా తొలిసారి రంజీ ఫైనల్ బరిలో దిగుతున్నాడు.

కర్ణాటక 299/6: రంజీ ట్రోఫీ మరో సెమీస్‌లో ఉత్తరాఖండ్‌పై కర్ణాటక భారీ ఆధిక్యం దిశగా దూసుకెళ్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 149/5తో నాలుగోరోజైన బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఉత్తరాఖండ్ 233 పరుగులకే కుప్పకూలింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన కర్ణాటక.. స్మరణ్ (127) సెంచరీకి తోడు కేఎల్ రాహుల్ (70 నాటౌట్), కృతిక్ (52) అర్ధ శతకాలతో సత్తాచాటడంతో ఆట ముగిసేసరికి 299/6 స్కోరు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 736 పరుగులు చేసిన కర్ణాటక.. ఓవరాల్‌గా 802 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. గురువారం ఆటకు ఆఖరిరోజు కావడంతో కర్ణాటకకు ఫైనల్ బెర్త్ లాంఛనమే కానుంది. మ్యాచ్ డ్రాగా ముగిసినా, తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కర్ణాటక ఫైనల్ చేరుతుంది.

నేటి మ్యాచ్‌లు

వెస్టిండీస్ X ఇటలీ (ఉ. 11 గం. నుంచి)
శ్రీలంక X జింబాబ్వే (మ.3 గం.)
అఫ్ఘానిస్థాన్ X కెనడా (రా.7 గం.)

సూపర్-8 షెడ్యూల్

21 ఫిబ్రవరి	పాకిస్థాన్ X న్యూజిలాండ్	కొలంబో	రాత్రి 7 గం.
22 ఫిబ్రవరి	శ్రీలంక X ఇంగ్లండ్	పల్లెకెలె	మ. 3 గం.
	భారత్ X దక్షిణాఫ్రికా	అహ్మదాబాద్	రాత్రి 7 గం.
23 ఫిబ్రవరి	జింబాబ్వే X వెస్టిండీస్	ముంబై	రాత్రి 7 గం.
24 ఫిబ్రవరి	ఇంగ్లండ్ X పాకిస్థాన్	పల్లెకెలె	రాత్రి 7 గం.
25 ఫిబ్రవరి	శ్రీలంక X న్యూజిలాండ్	కొలంబో	రాత్రి 7 గం.
26 ఫిబ్రవరి	వెస్టిండీస్ X దక్షిణాఫ్రికా	అహ్మదాబాద్	మ. 3 గం.
	భారత్ X జింబాబ్వే	చెన్నై	రాత్రి 7 గం.
27 ఫిబ్రవరి	ఇంగ్లండ్ X న్యూజిలాండ్	కొలంబో	రాత్రి 7 గం.
28 ఫిబ్రవరి	శ్రీలంక X పాకిస్థాన్	పల్లెకెలె	రాత్రి 7 గం.
1 మార్చి	జింబాబ్వే X దక్షిణాఫ్రికా	ఢిల్లీ	మ. 3 గం.
	భారత్ X వెస్టిండీస్	కోల్‌కతా	రాత్రి 7 గం.

దూబే దంచేశాడు

వరుణ్ తిప్పేశాడు



శివం దూబే (31 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 66)

నెదర్లాండ్స్‌పై భారత్ విజయం
టీ20 వరల్డ్‌కప్

అహ్మదాబాద్: శివం దూబే (31 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లతో 66) అర్ధ శతకంతోపాటు స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (3/14) రాణించడంతో.. గ్రూప్ దశను భారత్ అజేయంగా ముగించింది. టీ20 వరల్డ్‌కప్‌లో బుధవారం గ్రూప్-ఎ ఆఖరి మ్యాచ్‌లో భారత్ 17 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై గెలిచింది. తొలుత భారత్ 20 ఓవర్లలో 193/6 స్కోరు చేసింది. సూర్యకుమార్ (34), తిలక్ వర్మ (31), హార్దిక్ పాండ్యా (30) రాణించారు. లోగన్ వాన్ బీక్ మూడు, ఆర్యన్ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో నెదర్లాండ్స్ 176/7 స్కోరు మాత్రమే చేసింది. బాస్ డి లీడ్ (33), జాచ్ లయన్ (26) టాప్ స్కోర్లు. దూబే రెండు వికెట్లు దక్కించుకొన్నాడు. దూబే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

అభిషేక్ మళ్లీ విఫలం: దూబే, పాండ్యా డెత్ ఓవర్లలో మెరుపులు మెరిపించడంతో.. భారత్ భారీ స్కోరు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న భారత్‌కు ఆశించిన ఆరంభమైతే దక్కలేదు. ఓపెనర్ అభిషేక్ శర్మ (0)ను డకౌట్ చేసిన ఆర్యన్.. జోరు మీదున్న ఇషాన్ కిషన్ (18) కూడా వెనక్కిపంపాడు. అయితే, తిలక్, కెప్టెన్ సూర్య ఆచితూచి ఆడడంతో ఆరు ఓవర్లకు భారత్ 51/2తో నిలిచింది. మధ్య ఓవర్లలో డచ్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేస్తూ పరుగులను కట్టడి చేశారు. ఈ క్రమంలో 9వ ఓవర్‌లో తిలక్‌ను అవుట్ చేసిన వాన్ బీక్.. మూడో వికెట్‌కు 30 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన దూబే కూడా షాట్లు ఆడడానికి ఇబ్బందిపడ్డాడు. కానీ, 12వ ఓవర్‌లో డి లీడ్ బౌలింగ్‌లో సూర్య సిక్స్ బాదగా.. ఆ తర్వాతి ఓవర్‌లో దూబే 6,4,6తో మొత్తం 19 పరుగులు రాబట్టడంతో టీమ్ స్కోరు కూడా సెంచరీ మార్క్ దాటింది. స్కోరు వేగం పుంజుకొంటున్న సమయంలో సూర్యను క్లైల్ క్యాచవుట్ చేయడంతో.. నాలుగో వికెట్‌కు 41 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో దూబే, పాండ్యా ధాటిగా ఆడడంతో.. టీమ్ స్కోరు 190 మార్క్‌ను అందుకొంది. ఆఖరి ఓవర్‌లో వీరిద్దరినీ వాన్‌బీక్ అవుట్ చేశాడు.

స్కోరుబోర్డు

భారత్: అభిషేక్ (బి) ఆర్యన్ 0, ఇషాన్ (బి) ఆర్యన్ 18, తిలక్ (సి) మెర్వే (బి) వాన్ బీక్ 31, సూర్య (సి/సబ్) గుగ్టెన్ (బి) క్లిన్ 34, దూబే (సి/సబ్) గుగ్టెన్ (బి) వాన్ బీక్ 66, హార్దిక్ (సి) మెర్వే (బి) వాన్ బీక్ 30, రింకూ (నాటౌట్) 6; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 193/6; వికెట్ల పతనం:** 1-0, 2-39, 3-69, 4-110, 5-186, 6-193; **బౌలింగ్:** ఆర్యన్ 4-0-19-2, లోగన్ వాన్ బీక్ 4-0-56-3, ఎకర్‌మన్ 3-0-36-0, క్లిన్ 4-0-38-1, బాస్ డి లీడ్ 4-0-28-0, మెర్వే 1-0-15-0.

నెదర్లాండ్స్: లెవిట్ (సి) సుందర్ (బి) పాండ్యా 24, ఓ డౌడ్ (బి) వరుణ్ 20, లీడ్ (సి) వరుణ్ (బి) దూబే 33, ఎకర్‌మన్ (సి) రింకూ (బి) వరుణ్ 23, ఆర్యన్ (బి) వరుణ్ 0, ఎడ్వర్డ్స్ (బి) బుమ్రా 15, జాచ్ లయన్ (సి) సుందర్ (బి) దూబే 26, క్రోయస్ (నాటౌట్) 25, వాన్ బీక్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 176/7; వికెట్ల పతనం:** 1-35, 2-51, 3-94, 4-94, 5-112, 6-125, 7-172; **బౌలింగ్:** అర్షదీప్ 3-0-22-0, బుమ్రా 3-0-17-1, సుందర్ 4-0-36-0, వరుణ్ 3-0-14-3, హార్దిక్ 3-0-40-1, అభిషేక్ 1-0-10-0, దూబే 3-0-35-2.

అభిషేక్ ట్రిపుల్ డక్



అభిషేక్ వరుసగా మూడోసారి డకౌట్ అయ్యాడు. ఈ క్రమంలో 2024 టీ20 వరల్డ్‌కప్‌లో తొలి మూడు మ్యాచ్‌ల్లోనూ డకౌట్ అయిన ఉగాండా ప్లేయర్ రోజర్ ముకాసా తర్వాత ఆ చెత్త రికార్డును అందుకొన్న రెండో బ్యాటర్‌గా అభిషేక్ నిలిచాడు.

పథిరన స్థానంలో మధుశంక

కొలంబో: గాయపడిన పథిరన స్థానంలో పేసర్ దిల్షాన్ మధుశంకకు శ్రీలంక జట్టులో చోటు కల్పించారు. ఈమేరకు ఐసీసీ సాంకేతిక కమిటీ శ్రీలంకకు అనుమతిచ్చింది. గత సోమవారం ఆస్ట్రేలియాతో గ్రూప్ 'బి' మ్యాచ్ సందర్భంగా పథిరన గాయపడ్డాడు.

మ్యాచ్‌కు ముందు అంట్లు తోమాల్సి వచ్చింది

పాక్ హాకీ కెప్టెన్ షకీల్ ఆవేదన



కరాచీ: పాకిస్థాన్ హాకీ జట్టు పరిస్థితి మరీ దయనీయంగా మారింది. హాకీ ప్రొ లీగ్ కోసం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన పాక్ ఆటగాళ్లు.. అక్కడ తమకు కనీస సౌకర్యాలు లేకుండా ఎలాంటి ఇబ్బందులు పడ్డామో జట్టు కెప్టెన్ షకీల్ బట్ వివరించాడు. దేశం కాని దేశంలో తమను రోడ్ల వెంట పరిగెత్తేలా చేసి, కిచెన్‌లో అంట్లు తోముకునేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇందుకు తమ దేశ హాకీ సమాఖ్య (పీహెచ్‌ఎఫ్)నే కారణమని మండిపడ్డాడు. జట్టు ఆటగాళ్లతో కలిసి బుధవారం స్వదేశం చేరిన షకీల్.. లాహోర్ ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో మాట్లాడాడు. హాకీ ప్రొ లీగ్‌కు వేదికైన ఆస్ట్రేలియాలోని కాన్‌బెర్రాలో తమ ఆటగాళ్లకు సరైన సౌకర్యాలు కల్పించడంలో పీహెచ్‌ఎఫ్ విఫలమైంది. గదులు బుక్ చేయని కారణంగా వారంతా లగేజీతో పాటు రోడ్డు మీదే పడిగాపులు కాయాల్సి వచ్చింది. చివరకు స్థానిక పాకిస్థానీల సహాయంతో ఆటగాళ్లు అక్కడి ఓ అపార్ట్‌మెంట్ తరహా అద్దె భవనంలో బస చేశారు. దాంతో ఆటగాళ్లే అన్ని పనులు చేసుకోవాల్సి వచ్చింది. కొసమెరుపు ఏమిటంటే పాక్ హాకీ సమాఖ్యకు ఆ దేశాధ్యక్షుడు షాబాజ్ షరీఫ్ చీఫ్ పాట్రన్‌గా ఉన్నారు.

పాక్ కూడా వచ్చేసింది

● ఫర్హాన్ శతకం ● నమీబియాపై భారీ గెలుపు

సూపర్-8లో ఆఘా సేన



సాహిబ్జాదా ఫర్హాన్ (100 నాటౌట్)

కొలంబో: పాకిస్థాన్ టీ20 వరల్డ్‌కప్ సూపర్-8కు చేరుకుంది. సాహిబ్జాదా ఫర్హాన్ (100 నాటౌట్) సెంచరీతోపాటు స్పిన్నర్లు చెలరేగడంతో.. గ్రూప్-ఎలో బుధవారం జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పాక్ 102 పరుగుల తేడాతో నమీబియాను ఓడించింది. మొత్తం ఆరు పాయింట్లతో తర్వాతి రౌండ్‌కు చేరుకొంది. తప్పనిసరిగా నెగ్గాల్సిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 199/3 స్కోరు చేసింది. కెప్టెన్ సల్మాన్ ఆఘా (38), షాదాబ్ ఖాన్ (36 నాటౌట్) రాణించారు. జాక్ బ్రెసెల్ రెండు వికెట్లు పడగొట్టాడు. భారీ లక్ష్య ఛేదనలో నమీబియా 17.3 ఓవర్లలో 97 పరుగులకే కుప్పకూలింది. లోరెన్ స్టీన్ క్యాంప్ (23), అలెగ్జాండర్ బుసింగ్ (20) టాప్ స్కోరర్లు. ఉస్మాన్ తారిఖ్ నాలుగు, షాదాబ్ మూడు వికెట్లు దక్కించుకొన్నారు. ఫర్హాన్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

2028 టీ20 వరల్డ్ కప్..
ఈ జట్లకు బెర్త్‌లు ఖరారు

చెన్నై: తదుపరి (2028) టీ20 వరల్డ్ కప్‌లో నేరుగా ప్రవేశం పొందిన జట్లను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం ప్రకటించింది. ప్రస్తుత ప్రపంచ కప్‌లో సూపర్-8కు చేరిన జట్లన్నీ తర్వాతి మెగా టోర్నీకి నేరుగా అర్హత సాధించినట్టు తెలిపింది. ఆతిథ్య దేశాల హోదాలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తోపాటు సూపర్-8కు అర్హత సాధించిన భారత్, పాకిస్థాన్, శ్రీలంక, జింబాబ్వే, వెస్టిండీస్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్లు బరిలోకి దిగుతాయి. అలాగే పైజట్ల తర్వాత ఐసీసీ ర్యాంకుల్లో ఉత్తమ స్థానాల్లో ఉన్న బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, ఐర్లాండ్ కూడా చేరతాయి. మిగిలిన 8 బెర్తులను రీజినల్ క్వాలిఫికేషన్ విధానం ద్వారా ఎంపిక చేస్తారు.

సఫారీల జైత్రయాత్ర

యూఏఈ చిత్తు

న్యూఢిల్లీ: టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశను దక్షిణాఫ్రికా ఓటమన్నదే లేకుండా అజేయంగా ముగించింది. ఇప్పటికే సూపర్-8 బెర్త్ ఖరారు చేసుకున్న సఫారీలు.. గ్రూప్-డిలో భాగంగా బుధవారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో ఆరు వికెట్లతో యూఏఈ జట్టును చిత్తు చేశారు. మొదట బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ.. 20 ఓవర్లలో 6 వికెట్లకు 122 పరుగులకే పరిమితమైంది. షరాఫు (45) టాప్ స్కోరర్. బాష్ (3/12) సూపర్ స్పెల్‌తో యూఏఈ బ్యాటర్ల భరతం పట్టగా.. నోకియా (2/28), జార్జ్ లిండే (1/17) ఆకట్టుకున్నారు. స్వల్ప ఛేదనలో దక్షిణాఫ్రికా 13.2 ఓవర్లలోనే 123/4 స్కోరు చేసి గెలిచింది. బ్రెవిస్ (36), రికెల్టన్ (30), మార్‌క్రమ్ (28) రాణించారు. బాష్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది. ఈ ఓటమితో టోర్నీలో యూఏఈ పోరాటం ముగిసింది. ఈ గ్రూప్ నుంచి దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ ఇప్పటికే సూపర్-8కు చేరాయి.

బిజినెస్

డాక్టర్ రెడ్డీస్ నుంచి జనరిక్ 'వెగోవీ'

60 శాతం తక్కువ ధరతో విడుదల!

ముంబై: స్థూల కాయం తగ్గించే నోవో నార్డిస్క్ కంపెనీ 'వెగోవీ' బ్లాక్‌బస్టర్ ఔషధానికి త్వరలో జనరిక్ వెర్షన్ రానుంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ఈ జనరిక్ వెర్షన్ వెగోవీ ఔషధాన్ని మార్కెట్‌లో విడుదల చేయనుంది. దీని ధర బ్రాండెడ్ వెగోవీ కంటే 50 నుంచి 60 శాతం తక్కువగా ఉంటుందని మార్కెట్ వర్గాల అంచనా. ప్రస్తుతం నోవో నార్డిస్క్ కంపెనీ వెగోవీ బ్రాండెడ్ వెయిట్ లాస్ ఔషధం కోసం డోసేజిని బట్టి నెలకు రూ.10,850 నుంచి రూ.16,400 ఖర్చు చేయాల్సి వస్తోంది. వచ్చే నెలతో ఆ కంపెనీకి వెగోవీపై పేటెంట్ హక్కులు తీరిపోతాయి. దీంతో పలు భారత ఔషధ కంపెనీలు దీనికి ప్రత్యామ్నాయంగా చౌకగా జనరిక్ ఔషధాన్ని తీసుకొచ్చే ప్రయత్నాల్లో ఉన్నాయి.

మూడో రోజూ లాభాలే

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా మూడో రోజూ లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ 283.29 పాయింట్ల లాభంతో 83,734.25 వద్ద ముగియగా నిఫ్టీ 50 సూచీ 93.95 పాయింట్ల లాభంతో 25,819.35 వద్ద క్లోజయింది. ట్రేడింగ్ చివర్లో బ్యాంకింగ్, మెటల్, ఎఫ్‌ఎంసీజీ కంపెనీల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం బుధవారం మార్కెట్‌ను లాభాల బాట పట్టించింది. రుణ వసూళ్లు సానుకూలంగానే ఉంటాయన్న అంచనాలు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ కంపెనీల షేర్లను లాభాల బాట పట్టించాయి. దీనికి తోడు ఇటీవల కరెక్షన్‌కు లోనైన కొన్ని ఎఫ్‌ఎంసీజీ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు సైతం మార్కెట్ వృద్ధికి ఊతంగా నిలిచాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	525
వరంగల్	522	గోదావరి	515
చిత్తూరు	593	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	120
వరంగల్	120	గుంటూరు	120
కరీంనగర్	120	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	108
కర్నూలు	120	నెల్లూరు	113
విశాఖపట్నం	120	అనంతపురం	113
గోదావరి	120		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,54,200 ▼	1,41,350 ▼	2,55,000 ▼
విజయవాడ	1,56,450 ▼	1,44,000 ▼	2,50,000 ▲
విశాఖపట్నం	1,59,610 ▲	1,41,300 ▼	2,60,000 ▼
రాజమండ్రి	1,54,400 ▼	1,41,350 ▼	2,36,000 ▼
ప్రొద్దుటూరు	1,53,300 ▼	1,41,040 ▼	2,46,000 ▲
ముంబై	1,51,865 ▲	1,39,110 ▼	2,32,955 ▼

అమెరికా-ఇండియా కనెక్ట్

● భారత్- యూఎస్ మధ్య ఏఐ కనెక్టివిటీకి బూస్ట్ ● సబ్‌సీ కేబుల్ ప్రాజెక్టును ఆవిష్కరించిన గూగుల్



న్యూఢిల్లీ: భారత్-అమెరికా మధ్య కృత్రిమ మేధ అనుసంధానాన్ని (ఏఐ కనెక్టివిటీ) పెంచేందుకు సముద్ర గర్భంలో ఫైబర్ ఆప్టిక్ కేబుల్ మార్గాలను ఏర్పాటు చేయనున్నట్లు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రకటించారు. అలాగే, భారత్‌లో గూగుల్ భారీ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టనుందని బుధవారం ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన వెల్లడించారు.

దేశంలో భారీ నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు..

విద్యార్థులు, కొత్తగా ఉద్యోగంలో చేరినవారి కోసం ఆంగ్లం, హిందీ భాషల్లో గూగుల్ ఏఐ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించనుంది. గూగుల్ క్లౌడ్ ద్వారా 2 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులకు భద్రమైన మౌలిక వసతిని అందించనున్నట్లు తెలిపారు. అంతేకాదు, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా 10,000 పాఠశాలలు, 1.1 కోట్ల మంది విద్యార్థులకు జనరేటివ్ ఏఐ టెక్నాలజీలో సహకారం అందించనున్నట్లు పిచాయ్ చెప్పారు. కాగా, ఏఐ టెక్నాలజీ ద్వారా క్వాంటమ్ కంప్యూటింగ్, క్లైమేట్ మోడలింగ్, ఇతర శాస్త్రీయ విభాగాల్లో ఆవిష్కరణల కోసం కృషి చేస్తున్న పరిశోధకులకు మద్దతిచ్చేందుకు గూగుల్ 3 కోట్ల డాలర్ల ఫండ్‌తో 'ఏఐ ఫర్ సైన్స్ ఇంపాక్ట్ ఛాలెంజ్'ను లాంచ్ చేసింది.

తదుపరి గ్లోబల్ ఏఐ చాంపియన్ భారత్ నుంచే..

టెక్నాలజీ వినియోగంతో భారత్ శరవేగంగా మారుతోందని, తదుపరి ప్రపంచ ఏఐ దిగ్గజం భారత్ నుంచే పుట్టుకు రావచ్చని సుందర్ పిచాయ్ అన్నారు.

సరికొత్త గేట్‌వేగా వైజాగ్ డేటా సెంటర్



ఏపీలోని విశాఖపట్టణంలో 1,500 కోట్ల డాలర్ల (రూ.1.35 లక్షల కోట్లు) పెట్టుబడితో ఏర్పాటు చేయబోతున్న ఏఐ డేటా సెంటర్ గిగావాట్ సామర్థ్యంతో కూడిన కంప్యూటింగ్ వసతితోపాటు అంతర్జాతీయ సముద్ర గర్భ కేబుల్ మార్గానికి గేట్‌వే కానుందని పిచాయ్ తెలిపారు. 'ఏఐ టెక్నాలజీలో భారత్ అసాధారణ పథాన్ని కలిగి ఉండబోతోంది. ఆ ప్రయాణంలో మేమూ భాగస్వాములం కావాలనుకుంటున్నాం" అని ఆయన పేర్కొన్నారు. ఏఐలో భారత్ అద్భుత సామర్థ్యాలను కలిగి ఉందన్నారు. "ఏఐ మన జీవితకాలంలో చూస్తున్న అతిపెద్ద మార్పు. అలాగే, భారత్ లాంటి దేశాలకు కూడా. తరాల నాటి అంతరాలను అధిగమించడంతో పాటు కొత్త అవకాశాలను ఏఐ సృష్టించనుంది" అన్నారు.

ఏంటీ ప్రాజెక్టు ..?

అమెరికా-ఇండియా కనెక్ట్ ప్రాజెక్టులో భాగంగా గూగుల్ భారత్ నుంచి సింగపూర్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య సముద్ర గర్భం నుంచి కొత్త కేబుల్ మార్గాలను ఏర్పాటు చేయనుంది. ఇందులో భాగంగానే వైజాగ్‌లో ఏర్పాటు చేస్తున్న ఏఐ డేటా సెంటర్‌ను కొత్త కేబుల్ మార్గాల ద్వారా సింగపూర్, దక్షిణాఫ్రికాతో అనుసంధానించనుంది. ముంబై నుంచి దక్షిణ ఆస్ట్రేలియాకు కేబుల్ రూట్‌ను ఏర్పాటు చేయనుంది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఈ మూడు కేబుల్ మార్గాలను ఇప్పటికే ఏర్పాటైన నాలుగు వ్యూహాత్మక ఫైబర్ ఆప్టిక్ కేబుల్ మార్గాలతో జోడించనుంది. తద్వారా భారత్‌తోపాటు దక్షిణ ప్రపంచంలోని పలు ప్రాంతాలకు చెందిన ఏఐ మౌలిక వసతులను అమెరికాతో అనుసంధానించనున్నట్లు గూగుల్ తెలిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా వైజాగ్ డేటా సెంటర్ అంతర్జాతీయ కేబుల్ గేట్‌వేగా అవతరించనుంది.

హురున్ ఇంపాక్ట్ జాబితాలో డాక్టర్ రెడ్డీస్, దివీస్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పర్పెచువల్ కాపిటల్ - హురున్ ఇండియా ఇంపాక్ట్ 50 - 2026 జాబితా వెలువడింది. ఐక్యరాజ్య సమితి పేర్కొన్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తున్న 50 దేశీయ కంపెనీలకు ఈ జాబితాలో చోటు లభించింది. వాతావరణ పరిరక్షణ, నీటి సద్వినియోగం, లింగ సమానత్వం వంటి 17 అంశాల ప్రాతిపదికన ఈ కంపెనీలను ఎంపిక చేసినట్టు హురున్ ఇండియా వ్యవస్థాపకులు మరియు ప్రధాన పరిశోధకులు అనస్ రెహమాన్ జునైద్ చెప్పారు. ఈ తాజా జాబితాలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్, దివీస్ లేబరేటరీస్ కంపెనీలకు కూడా చోటు లభించింది. ఈ సంవత్సరం జాబితాలో ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యూనిలీవర్ కంపెనీకి ప్రథమ స్థానం, ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌కు రెండవ స్థానం లభించాయి. మొత్తం 150 కంపెనీల పనితీరును పరిగణనలోకి తీసుకుని చివరికి 50 కంపెనీలను ఏ ఏడాది జాబితా కోసం ఎంపిక చేశామన్నారు. ప్రస్తుతం దాదాపు 1.8 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.162 లక్షల కోట్లు) మార్కెట్ క్యాప్ ఉన్న ఈ 50 కంపెనీలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) కింద 100 కోట్ల డాలర్లు (దాదాపు రూ.9,000 కోట్లు) ఖర్చు చేసినట్టు జునైద్ తెలిపారు.

కొత్త ఔషధాల అభివృద్ధికి జీసీసీల దన్ను: కేపీఎంజీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : కొత్త ఔషధాల అభివృద్ధిలో దేశంలోని ఫార్మా, లైఫ్ సైన్సెస్‌కు చెందిన గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాలది (జీసీసీ) కీలక పాత్ర అని ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ కేపీఎంజీ తెలిపింది. ప్రస్తుతం కొత్త ఔషధాల పరిశోధన, అభివృద్ధికి 10 నుంచి 15 సంవత్సరాల సమయం పడుతోంది. జీసీసీలు అందించే ఏఐ ఆధారిత సేవలతో ఇందుకు పట్టే సమయం ఏడాది నుంచి రెండేళ్లకు తగ్గుతుందని పేర్కొంది. దీంతో పరిశోధన, అభివృద్ధి ఖర్చులు కూడా ఐదు శాతం వరకు తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది. జీసీసీల మద్దతుతో పరిశోధన, అభివృద్ధి, ప్రీ క్లినికల్ ట్రయల్స్ సమయం ఐదారేళ్లు, క్లినికల్ ట్రయల్స్ సమయం నాలుగు నుంచి ఆరేళ్ల వరకు తగ్గవచ్చని కేపీఎంజీ అంచనా.

'పవర్ మెక్'కు రూ. 1,005 కోట్ల విలువైన ఆర్డర్లు

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే పవర్ మెక్ ప్రాజెక్ట్స్ కంపెనీ రూ.1,005 కోట్ల విలువైన రెండు ఆర్డర్లు సంపాదించింది. ఇందులో రూ.515 విలువైన ఆర్డర్ ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్ థర్మల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి, రూ.490 కోట్ల విలువైన మరో ఆర్డర్‌ను మహాన్ ఎనర్జీన్ లిమిటెడ్ కంపెనీ నుంచి సంపాదించింది. ఈ రెండు ఆర్డర్లను పవర్ మెక్ మూడేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ రెండు ప్రాజెక్టులూ ఒక్కోటి 1,600 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న 'అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన స్టీమ్ జెనరేటర్, స్టీమ్ టర్బైన్ జెనరేటర్, అనుబంధ పరికరాల ఏర్పాటు, టెస్టింగ్, కమిషనింగ్ వంటి క్లిష్టమైన సాంకేతిక పనులతో పాటు అవసరమైన నిపుణుల సేవలనూ అందించాల్సి ఉంటుంది.

మార్కెట్‌లో నిస్సాన్ 'ఎంపీవీ గ్రావైట్'

ప్రారంభ ధర రూ. 5.65 లక్షలు

ఉదయ్‌పూర్ : జపాన్ ఆటోమొబైల్ దిగ్గజం నిస్సాన్ మోటార్ ఇండియా భారత మార్కెట్‌లో మరో కొత్త కారును విడుదల చేసింది. 'ఎంపీవీ గ్రావైట్' పేరుతో విడుదల చేసిన ఏడు సీట్ల కారు ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధర రూ.5.65 లక్షలు. ఈ ఏడాది చివరికల్లా రెండు ఎస్‌యూవీలను విడుదల చేయబోతున్నట్టు కంపెనీ ఎండీ సౌరభ్ వత్స చెప్పారు.

వచ్చే దశాబ్ది కాలంలో మరో రూ.180 లక్షల కోట్లు

టెక్ కంపెనీలకు బొనాంజా

వచ్చే దశాబ్దకాలంలో టెక్నాలజీ కంపెనీలు స్టాక్ మార్కెట్ విలువకు మరో రూ.2 లక్షల కోట్ల డాలర్ల (రూ.180 లక్షల కోట్లు) మేర జోడించవచ్చని ప్రముఖ వెంచర్ క్యాపిటల్ ఫండ్ సంస్థ యాక్సెల్ పార్ట్‌నర్ అంచనా వేసింది. ప్రస్తుతం భారత మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో టెక్నాలజీ కంపెనీల వాటా కేవలం 4-5 శాతంగా ఉందని, వచ్చే 10 ఏళ్లలో ఈ వాటా 15-20 శాతానికి పెరగవచ్చన్నారు. అంటే, దేశంలోని పలు టెక్నాలజీ కంపెనీలు భవిష్యత్‌లో కనీసం 10,000 కోట్ల డాలర్ల (రూ.9 లక్షల కోట్లు) విలువైన కంపెనీలుగా అవతరించనున్నాయని కంపెనీ ప్రతినిధి ప్రయాంక్ స్వరూప్ అన్నారు.

రూ.1,360 కోట్లతో ఏఐ వెంచర్ ఫండ్: క్వాల్‌కామ్

శరవేగంగా వృద్ధి చెందుతున్న ఏఐ స్టార్టప్ వ్యవస్థకు మద్దతిచ్చేందుకు 15 కోట్ల డాలర్ల (సుమారు రూ.1,360 కోట్లు) విలువ గల వ్యూహాత్మక ఏఐ వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు అంతర్జాతీయ చిప్‌ల తయారీ దిగ్గజం క్వాల్‌కామ్ ప్రకటించింది. ఈ ఫండ్ ద్వారా అన్ని దశల్లోని ఏఐ, ఆటోమోటివ్, ఐఓటీ, రోబోటిక్స్, మొబైల్ సహా పలు విభాగాల స్టార్టప్‌లకు నిధులు సమకూర్చనున్నట్లు తెలిపింది.

రూ.4.50 లక్షల కోట్ల పెట్టుబడులు: మైక్రోసాఫ్ట్

దక్షిణ ప్రపంచంలో ఏఐ సేవల వినియోగాన్ని పెంచేందుకు ఈ దశాబ్దం చివరికల్లా 5,000 కోట్ల డాలర్ల (రూ.4.5 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు అమెరికన్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. దక్షిణ ప్రాంతంతో పోలిస్తే ఉత్తర ప్రపంచంలో ఏఐ వినియోగం రెండు రెట్లు అధిక స్థాయిలో ఉందని కంపెనీ పేర్కొంది.

భారత్‌తో విస్తృత భాగస్వామ్యాలు: ఎన్‌విడియా

భారీ సంఖ్యలో సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, స్టార్టప్‌లు, భాగస్వాములు కలిగి ఉన్న భారత్ ఏఐ ఆవిష్కరణలకు అత్యంత కీలక కేంద్రాల్లో ఒకటిగా మారిందని ఏఐ చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్‌విడియా దక్షిణాసియా విభాగం ఎండీ విశాల్ ధుపర్ అన్నారు. భారత్ ఏఐ పెట్టుబడులను ప్రస్తుత 120 కోట్ల డాలర్ల స్థాయి నుంచి మరింతగా పెంచాలని ఎన్‌విడియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శంకర్ త్రివేదీ చెప్పారు. భారత్‌లో ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటు ద్వారా ప్రపంచానికి సేవలందించే కంపెనీలకు 20 ఏళ్ల పాటు పన్ను రాయితీ కల్పించనున్నట్లు ఈ సారి బడ్జెట్లో ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

న్యూస్‌మేకర్



జన హృదయాలను గెలిచారు

ఇటీవల జరిగిన పుర పోరులో మహిళలు సత్తా చాటారు. జన హృదయాలను గెలిచి మేయర్ పీఠం దక్కించుకున్నారు. ఆ మహిళామణులే వీరు...

రాజకీయాలకు ఇల్లే శిక్షణాలయం

- కూరగాయల ఉమారాణి, నిజామాబాద్ మేయర్

"మాది మధ్యతరగతి కుటుంబం. మాకు ముగ్గురు పిల్లలు. దీనితో ఇంట్లో పని ఎక్కువే ఉంటుంది. దీనికి తోడు నాకు ఒక టైలరింగ్ దుకాణం కూడా ఉంది. దాని నిర్వాహణను కూడా చూసుకుంటూ ఉండాలి. ప్రతి రోజు నా షాపుకు అనేక మంది మహిళలు వస్తూ ఉంటారు. వారితో మాట్లాడుతున్నప్పుడు నాకు అనేక విషయాలు తెలుస్తూ ఉంటాయి. చాలా మంది నాయకత్వం అంటే బయటకు ఎక్కడికో వెళ్లి పనిచేయటం అనుకుంటారు. మన ఇంటిని సక్రమంగా.. అందరూ అభివృద్ధి చెందేడట్లు నిర్వహించగలిగితే అదే నిజమైన నాయకత్వం అని నేను అనుకుంటా. రాజకీయాల్లోకి వద్దామనుకొనే మహిళలకు ఇల్లే శిక్షణాలయం. దానిలో నెగ్గుకొస్తే చాలు. మాది ప్రేమ వివాహం. నా భర్త రమేష్ నాకు అన్ని విషయాలలోను తోడుగా ఉన్నారు. ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా చెప్పాలి. నా ఉద్దేశంలో చాలా మంది మహిళలకు రాజకీయాలంటే ఒక భయం ఉంటుంది. చాలా మంది వీటిలోకి రావటానికి ఇష్టపడరు. కానీ మహిళలు ముందుకు వస్తేనే సమాజంలో మార్పు వస్తుంది. కుటుంబాన్ని సక్రమంగా నడపగలిగిన వారు సమాజాన్ని కూడా నడపగలుగుతారు. కుటుంబం, సమాజం రెండింటినీ సమన్వయం చేసే శక్తి మహిళలలోనే ఎక్కువగా ఉంటుంది. నేను మొదటి సారి ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు అనేక అనుమానాలు ఉండేవి. అయితే ఆ తర్వాతి కాలంలో అవన్నీ తొలగిపోయాయి. అయితే మనం అనుకున్నది సాధించాలంటే- సహనం, పట్టుదల అవసరం. కేవలం మహిళలు మాత్రమే కాదు. యువత కూడా రాజకీయాలలోకి రావాలి. రాజకీయాలలోకి రావాలంటే మన చుట్టూ ఉన్న సమాజం పట్ల అవగాహన ఉండాలి. చాలా మంది రాజకీయాల్లోకి రావటం అంటే పదవుల కోసమే అనుకుంటారు. కానీ ఆ పదవి పొందటానికి వెనక సేవా భావం కూడా ఉండాలి. సమాజంలోని రుగ్మతలను గమనించాలి. వాటికి చికిత్స చేయటానికి ప్రయత్నించాలి.

- కసుపు వెంకటరమణ, నిజామాబాద్

కష్టపడి పనులు చేసి..

- గుమాల్ మమత, పాలమూరు కార్పొరేషన్ తొలి మేయర్

"మాది మహబూబ్‌నగర్ పట్టణంలోని అప్పన్నపల్లిలో చిన్న వ్యవసాయ కుటుంబం. నాన్న మొగులయ్య హమాలీ పనిచేసేవారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడితే కానీ గడిచేది కాదు. అంత కష్టంలో కూడా నాన్న నన్ను, మా తమ్ముళ్లను చదివించారు. పదోతరగతి పూర్తి అయిన తర్వాత నాకు వివాహం చేసేశారు. నా భర్త నాకు వివాహం ముందు నుంచి తెలుసు. ముందు ప్రేమ. ఆ తర్వాత పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నాం. మాకు ముగ్గురు పిల్లలు. మా అత్త లక్ష్మమ్మ, మామ వెంకన్నలు నన్ను సొంత కూతురిగా చూసుకొనేవారు. ఈ 18 ఏళ్ల దాంపత్య జీవితంలో అనేక కష్టనష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. నాకు వివాహం అయిన వెంటనే మా మెట్టింటి వారికి ఇబ్బందులు ఎదురయ్యాయి. దీనితో మాకున్న భూమి, డైరీఫాం.. చివరకు ఇష్టపడి కట్టుకున్న ఇల్లు కూడా అమ్ముకోవాల్సి వచ్చింది. ఆ సమయంలో మేము అద్దె కట్టలేమేమోనని మాకు ఇల్లు అద్దెకు ఇవ్వటానికి కూడా ఎవరు ముందుకు రాలేదు. అలాంటి సమయాల్లో కూడా మేము ఎప్పుడూ అధైర్యపడలేదు. ఈ సమయంలోనే మావారు అప్పు చేసి ఒక టిప్పర్ కొన్నారు. చిన్న చిన్న కాంట్రాక్టులు ప్రారంభించారు. మళ్లీ మంచి రోజులు వచ్చాయి. ఆర్థికంగా ఎదిగాం. మేము అమ్మేసిన ఇంటినే మళ్లీ కొనుక్కున్నాం. మొదటి నుంచి నేను రాజకీయాల్లో క్రియాశీలకంగా లేను. కానీ మా ఆయన మాత్రం రాజకీయంగా చురుకుగా ఉన్నారు. దీనితో అన్ని విషయాలు నాకు ఎప్పటికప్పుడు తెలుస్తూ ఉండేవి. అవన్నీ ఈ సారి పోటీ చేసినప్పుడు పనికొచ్చాయి. నేను మేయర్‌గా ఎన్నికవుతానని ఎప్పుడూ అనుకోలేదు. మేయర్‌గా ఎన్నికవటం వల్ల నా బాధ్యతలు చాలా పెరిగాయి. పాలమూరులో 60 డివిజన్లు ఉన్నాయి. వీటన్నింటినీ అభివృద్ధి చేయాలి. నగరంలో చెత్త లేకుండా శుభ్రంగా ఉండాలి. ఈ రెండింటి కోసం పనిచేస్తాను.

- నోముల రవీందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్
ఫొటో: **జి. రవికుమార్**



నా సమర్థత నిరూపించుకుంటా

- బుర్రి చైతన్య, నల్లగొండ మేయర్

"మా స్వగ్రామం రామన్నపేట మండలం జనంపల్లి. నేను డిగ్రీ వరకు చదువుకున్నాను. మా పుట్టింటివైపు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు. మాభర్త శ్రీనివాసరెడ్డి మాకు దూరపు బంధువులే. ఆయన మొదటి నుంచి రాజకీయాల్లోనే ఉన్నారు. దీనితో వివాహం తర్వాత నాకు రాజకీయాల గురించి అవగాహన పెరిగింది. నాకు భక్తి ఎక్కువ. రోజూ ఇంట్లో పూజలు చేస్తుంటాను.

దీనితో నన్ను నల్గొండలోని రామాలయం కమిటీకి ఛైర్‌పర్సన్‌గా ఎంపిక చేశారు. రెండు పర్యాయాలు ఆ బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తించా. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో మా భర్త ప్రాతినిధ్యం వహించే వార్డు రెండుగా చీలడంతో స్థానికులు నన్ను ఒక వార్డు నుంచి పోటీచేయాలని ఒత్తిడి తెచ్చారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడంతో మేం బాధ్యతగా భావించి నా భర్తతో పాటు నేను సైతం కౌన్సిలర్‌గా పోటీ చేసి ఇద్దరమూ గెలుపొందాం. ఇలా అనుకోకుండా పార్టీ , ప్రజల సూచనల మేరకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం జరిగింది. రాజకీయంగా నాకు వచ్చిన అవకాశం ద్వారా నల్లగొండ నగరంలో మహిళల సాధికారతకు నావంతుగా కృషి చేస్తా. నగరంలో పొదుపు సంఘాలను మరింతగా బలోపేతం చేసి ప్రతి మహిళా స్వయం సమృద్ధి సాధించేలా చేయాలనేది నా లక్ష్యం. మా కార్పొరేషన్‌కు వచ్చే నిధులు, ఇక్కడున్న సమస్యలు, పాలనాపరమైన అంశాలపై నాకు అవగాహన ఉంది. అందరిసమన్వయం, సహకారంతో నల్లగొండ కార్పొరేషన్ ని అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తా.

- చల్లా సాంబశివా రెడ్డి, నల్గొండ



కౌన్సెలింగ్

పిల్లల్లో కిడ్నీ స్టోన్స్

డాక్టర్, మా అబ్బాయికి పదేళ్లు. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడ్డాయి. రెండు పూటలా పాలు తాగుతాడు కాబట్టి ఈ సమస్య, పాలలోని క్యాల్షియం వల్ల వచ్చిందని అనుకోవాలా? మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

మూత్రపిండాల సమస్య పెద్దలకే పరిమితం కాదు. ఈ సమస్య పిల్లల్లో కూడా తలెత్తుతుంది. ఈ రుగ్మత కొన్ని లక్షణాల రూపంలో బయల్పడినా, తల్లితండ్రులు వాటిని అలక్ష్యం చేస్తూ ఉంటారు. అర్థం లేని అపోహలు, అనుమానాలతో మూత్రపిండాల్లో రాళ్ల సమస్యను మరింత జటిలం చేస్తూ ఉంటారు. కానీ నిజానికి పిల్లల్లో ఈ సమస్యను నియంత్రించుకునే వీలుంది.



హెచ్చరికల మీద కన్నేసి...

పిల్లల్లో కిడ్నీ స్టోన్ లక్షణాలు పెద్దల లక్షణాలనే పోలి ఉంటాయి. పదే పదే తిరగబెట్టే పొత్తికడుపు నొప్పి, వాంతులు, మూత్రవిసర్జన సమయంలో నొప్పి, తరచూ మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు, మూత్రంలో రక్తం.. ఈ లక్షణాలను అశ్రద్ధ చేయకూడదు.

అపోహలు - వాస్తవాలు

అపోహ: కిడ్నీస్టోన్స్ పెద్దలకే పరిమితం
వాస్తవం: శరీరంలో నీటి శాతం తగ్గిపోవడం, ఆహారపుటలవాట్ల మూలంగా పిల్లల్లో కూడా ఈ సమస్య తలెత్తుతుంది
అపోహ: పాలు, క్యాల్షియం వల్లే కిడ్నీస్టోన్స్ ఏర్పడతాయి
వాస్తవం: ఇది నిజం కాదు. నిజానికి పాలు, క్యాల్షియం పిల్లల ఎదుగుదలకు అవసరం. అదనపు ఉప్పు, నీళ్లు తక్కువ తాగడం, మెటబాలిక్ సమస్యలే కిడ్నీ స్టోన్స్‌కు ప్రధాన కారణాలు
అపోహ: నొప్పి తగ్గితే, సమస్య పరిష్కారమైనట్టే!
వాస్తవం: నొప్పి తగ్గినంత మాత్రాన రాయి పడిపోయిందని అనుకోకూడదు. రాళ్లు ఏర్పడడానికి కారణాన్ని సరిదిద్దనంతవరకూ పదే పదే రాళ్లు ఏర్పడుతూనే ఉంటాయి
అపోహ: కిడ్నీస్టోన్‌కు సర్జరీ తప్పనిసరి
వాస్తవం: పిల్లల్లో మందులతో, హైడ్రేషన్‌తో, ఆహార మార్పులతో ఈ సమస్యను సరిదిద్దవచ్చు. రాయి మూత్రానికి అవరోధంగా మారినప్పుడు, పదే పదే ఇన్‌ఫెక్షన్స్‌కు గురవుతున్నప్పుడు, పదే పదే నొప్పి తిరగబెడుతున్నప్పుడు లేదా మూత్రం ద్వారా రాయి బయటకు వెళ్లనప్పుడు మాత్రమే సర్జరీ అవసరమవుతుంది
అపోహ: చికిత్స తర్వాత సమస్య తిరగబెట్టదు
వాస్తవం: పెద్దలతో పోలిస్తే, పిల్లల్లో ఈ సమస్య తిరగబెట్టే అవకాశాలు ఎక్కువ. కాబట్టి కారణాన్ని కనిపెట్టి, పరిష్కరించుకుని, తగు జాగ్రత్తలు పాటించగలిగితే రాళ్లు తిరగబెట్టే సమస్య సమసిపోతుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

నీళ్లు ఎక్కువగా తాగేలా పిల్లలను ప్రోత్సహించాలి. మూత్రం లేత పసుపు రంగులో ఉండేలా చూసుకోవాలి. మూత్రాన్ని ఆపుకోవడం వల్ల రాళ్ల సమస్య తీవ్రమవుతుంది. కాబట్టి పిల్లలకు అర్థమయ్యేలా ఈ విషయం వివరించాలి. ఉప్పు జోడించిన చిరుతిళ్ల అలవాటు మాన్పించాలి. చిప్స్, ఫ్రైస్, ఇన్‌స్టంట్ నూడుల్స్, అల్ట్రా ప్రాసెస్డ్ ప్యాకేజ్డ్ ఫుడ్స్, శీతల పానీయాలు మాన్పించాలి. పదే పదే వేధించే పొట్ట నొప్పి, వాంతులు, మూత్రంలో రక్తం, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లను అశ్రద్ధ చేయకూడదు. తల్లితండ్రుల్లో, తోబుట్టువుల్లో ఈ సమస్య ఉంటే, వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి.

డాక్టర్ శృతి బల్లా
కన్సల్టెంట్ పీడియాట్రిక్ నెఫ్రాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, సికింద్రాబాద్

స్మార్ట్ కిచెన్... హ్యాపీ కుకింగ్



వంటింట్లో గంటల తరబడి శ్రమపడకుండా, పనులను చిటికెలో పూర్తి చేసేందుకు కొన్ని చిట్కాలు తెలిస్తే చాలు. మీ వంటను రుచికరంగా, మీ పనిని సులభంగా మార్చే కిచెన్ హ్యాక్స్ ఇవే..

ఉల్లి కోసేటప్పుడు కన్నీళ్లు రాకుండా: ఉల్లిపాయలను కోయడానికి 15 నిమిషాల ముందు ఫ్రిజ్‌లో పెట్టండి. లేదంటే వాటి తొక్క తీసి నీళ్లలో ఉంచండి. దీనివల్ల ఘాటు తగ్గి కళ్లలో నీళ్లు రావు.

మెత్తని ఇడ్లీల కోసం: ఇడ్లీపిండి రుబ్బేటప్పుడు అందులో గుప్పెడు అటుకులు లేదంటే కొంచెం అన్నం కలిపి రుబ్బితే ఇడ్లీలు మెత్తగా వస్తాయి.

బియ్యంలో పురుగులు పట్టకుండా: బియ్యం లేదా పప్పులు నిల్వచేసే డబ్బాల్లో కొన్ని ఎండు మిరపకాయలు లేదా బిర్యానీ ఆకులు వేస్తే పురుగులు పట్టవు.

కాళ్ల నొప్పులా?

నేను ఒక హౌస్‌వైఫ్‌ని. ప్రతి రోజు నాలుగైదు గంటలు కిచెన్‌లో గడపాల్సి ఉంటుంది. దీనివల్ల నాకు కాళ్ల నెప్పులు వస్తున్నాయి. వీటి నివారణకు ఏదైనా మార్గముందా?

వంటింట్లోని పనులు ఎక్కువమంది నిలబడే చేస్తూ ఉంటారు. దీని వల్ల శరీరపు బరువు అంతా కాళ్లపై పడుతుంది. దీని వల్ల నెప్పులు వస్తూ ఉంటాయి. చిన్న చిన్న మార్పుల ద్వారా ఈ నెప్పులను నివారించు కోవచ్చు. ఉదాహరణకు కూరలు తరగటం.. వంట వండటం వంటి పనుల మధ్యలో కొద్ది సేపు కూర్చోవటంవల్ల మన శరీరంలో కండరాలకు కొంత విశ్రాంతి దొరుకుతుంది. చిన్న చిన్న చిట్కాల ద్వారా నొప్పులను నివారించుకోవటం ఎలాగో తెలుసుకుందాం.

- కూరలు తరిగేటప్పుడు చాలామంది నిలబడతారు. కుర్చీ లేదా స్టూల్ మీద కూర్చుని తరిగితే కండరాలకు విశ్రాంతి దొరుకుతుంది.
- వంటిల్లు పెద్దగా ఉంటే ఒక టేబుల్‌ను వేసుకొని కూర్చుని తరిగితే ఎక్కువ శ్రమ అనిపించదు.
- ప్రస్తుతం మార్కెట్లో కిచెన్ టాప్‌పై వేసుకొని మ్యాట్స్ వచ్చాయి. వీటిపై పెడితే కటింగ్ బోర్డు కదలదు. దీని వల్ల కట్ చేయటం సులభమవుతుంది.
- మనం ఎక్కువగా వాడే వస్తువులు కిచెన్ టాప్‌పైనే పెట్టుకోవాలి. దీని వల్ల వాటిని వాడటం సులభమవుతుంది.



- ప్రతి 30 నిమిషాలకు ఒక సారి తప్పనిసరిగా 5 నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి. వీలైతే కాలి వేళ్లను కదపటం వంటి చిన్న చిన్న ఎక్సర్‌సైజ్‌లు చేస్తే మంచిది.
- వీలైనంత వరకు గిన్నెలను, బరువైన ఇతర సామగ్రిని ఒక చేతితో ఎత్తకూడదు. రెండు చేతులు ఉపయోగించాలి. దీని వల్ల శరీరంపై ఎక్కువ ఒత్తిడి ఉండదు.
- చాలా మంది వాడిన గిన్నెలన్నింటినీ సింక్‌లో వేసేసి ఒకే సారి తోముతారు. దీనివల్ల పని అయిపోయిన తర్వాత కూడా నిలబడాల్సి వస్తుంది. అలా కాకుండా వాడిన గిన్నెలను ఎప్పటికప్పుడు తోమితే బావుంటుంది. ఎప్పుడైనా ఎక్కువగా నొప్పి అనిపిస్తే ఐస్ ప్యాక్ పెట్టుకోవాలి.

ఆఫీసులో మీ ముద్ర

ఉద్యోగం చేసే మహిళలకు ఇంటిని, ఆఫీసును బ్యాలెన్స్ చేయడం కత్తిమీద సామే. ఆఫీసులో మీ పనితీరు మెరుగుపడటానికి, ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఈ చిట్కాలు పాటించండి.

టు డు లిస్ట్:
ఆఫీసుకు వెళ్లగానే ఆ రోజు చేయాల్సిన పనులను ప్రాధాన్య క్రమంలో రాసుకోండి. దీనివల్ల ఏ పని ఎప్పుడు పూర్తిచేయాలో స్పష్టత ఉంటుంది. హడావుడి తగ్గుతుంది.

నో చెప్పడం నేర్చుకోండి:
మీ శక్తికి మించిన పనిని లేదా మీకు సంబంధం లేని పనులను సున్నితంగా తిరస్కరించడం నేర్చుకోండి. ఇది మీ పని నాణ్యతను పెంచుతుంది.

నిరంతర అభ్యాసం:
మీ రంగంలో వస్తున్న కొత్త మార్పులను గమనిస్తూ ఉండండి. ఖాళీ సమయాల్లో ఆన్‌లైన్ కోర్సులు చేయడం వల్ల ప్రమోషన్లు రావడానికి, కెరీర్‌లో ఎదగడానికి అవకాశం ఉంటుంది.



చిన్న గాయాలకు ఇంటి వైద్యం

అకస్మాత్తుగా ఏదైనా దెబ్బ తగిలినా, అనారోగ్యం చేసినా కంగారు పడకుండా ఉండటానికి ప్రథమ చికిత్స బాక్స్ సిద్ధంగా ఉండాలి. అత్యవసర సమయంలో ఇది మీకు ఎంతగానో సహాయపడుతుంది.

కాలిన గాయాలకు: వంట చేసేటప్పుడు చేయి కాలితే వెంటనే ఆ ప్రదేశాన్ని చల్లని నీటి కింద ఉంచండి. ఐస్ ముక్కలను నేరుగా పెట్టకండి. దానివల్ల కణజాలం దెబ్బతింటుంది. అలోవెరా జెల్ రాయడం మంచిది.

పురుగు కుడితే: ఏదైనా పురుగు కుట్టినప్పుడు ఆ ప్రదేశంలో కొంచెం ఉల్లిపాయ ముక్కను రుద్దండి. లేదా తడిసున్నం పెట్టండి. ఇది విష ప్రభావాన్ని నివారించి నొప్పిని తగ్గిస్తుంది.



అరుగుదల సమస్య: కడుపు ఉబ్బరంగా లేదా అజీర్తిగా అనిపిస్తే కొంచెం వాము, చిటికెడు ఉప్పు కలిపి గోరు వెచ్చటి నీటితో తీసుకోండి. ఇది తక్షణ ఉపశమనం ఇస్తుంది.



'మాయా'జాలం

అత్యాధునిక సాంకేతికత అద్భుత సౌందర్యానికి ప్రాణం పోస్తే.. అది 'మాయా సుయా'! ఒక డిజిటల్ సృజనగా మొదలై.. నేడు డిజిటల్ మీడియాను శాసిస్తున్న ఈ ఏఐ భామ అటు క్రికెట్ దిగ్గజాలతో ఫొటోలు దిగుతూ, ఇటు అంతర్జాతీయ స్థాయి క్రీడా అంశాలపై స్పందిస్తూ నెటిజన్లను మాయ చేస్తోంది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్న ఈ వర్చువల్ సుందరి కథ ఇది.

నేటి ఆధునిక కాలంలో స్మార్ట్‌ఫోన్ అనేది ఒక పరికరం మాత్రమే కాదు, అదొక మాయా ప్రపంచం. ఆ ప్రపంచంలో ప్రతి రోజు వేల సంఖ్యలో కొత్త ముఖాలు కనిపిస్తుంటాయి. కానీ ఆ రద్దీలో కూడా కొందరు మాత్రమే ప్రత్యేకంగా నిలుస్తారు. స్ర్కీన్ మీద వారు కనిపించగానే మన వేళ్లు స్ర్కోలింగ్‌ను ఆపేస్తాయి. ఆ కళ్లలో ఏదో తెలియని మెరుపు, ఆ నవ్వులో ఒక ఆకర్షణ, ప్రతి కదలికలోనూ ఒక మ్యాజిక్ కనిపిస్తుంది. అచ్చం అలాంటి మ్యాజిక్ చేస్తూ సోషల్ మీడియా ప్రపంచంలో మాయా సుయా ఒక సరికొత్త సెన్సేషన్‌గా అవతరించింది. అయితే, ఆమె రక్తమాంసాలతో ఉన్న మనిషి కాదు.. అత్యాధునిక ఏఐ (కృత్రిమ మేధ) సృష్టించిన ఒక అద్భుత రూపం అని తెలిసినప్పుడు నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు.

క్రికెట్ ప్రపంచంలో హల్‌చల్

మాయా సుయా కేవలం ఫ్యాషన్ రంగానికే పరిమితం కాకుండా భారతీయులకు ఎంతో ఇష్టమైన క్రికెట్‌పై స్పందిస్తున్న తీరు ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో భారత స్టార్ క్రికెటర్లతో కలిసి ఫొటోలు తీసుకుంటున్నట్టుగా ఉన్న చిత్రాలు ఇప్పుడు సోషల్ మీడియాను ఊపేస్తున్నాయి. ఏఐ టెక్నాలజీతో రూపొందించిన ఈ చిత్రాలలో భారత క్రికెట్ దిగ్గజాలతో పక్కపక్కనే కూర్చుని ఫొటోలకు పోజులిచ్చిన తీరు చూస్తుంటే అది కృత్రిమ మేధ సృష్టించిన చిత్రమని ఎవరూ అనుకోరు.

'బెటర్ లక్ నెక్స్ట్ టైమ్ బాయ్స్'

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ దారుణంగా ఓడిపోయింది. ఈ సందర్భంగా మాయా సుయా చేసిన ఓ పోస్ట్ వైరల్ అయింది. పాక్ ఆటగాళ్లను ఉద్దేశించి ఆమె పెట్టిన 'బెటర్ లక్ నెక్స్ట్ టైమ్ బాయ్స్' అనే పోస్ట్ క్షణాల్లో వైరల్ అయింది. వేలాది లైకులు, షేర్లతో సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేసింది.

క్వాలిటీలో నో రాజీ

సోషల్ మీడియాలో చూసే వారికి 15 సెకన్ల రీల్ చాలా సులభంగా అనిపించవచ్చు. కానీ ఆ వీడియో వెనుక గంటల కొద్దీ శ్రమ, ప్లానింగ్ ఉంటాయని చాలామందికి తెలియదు. మాయా సుయా వీడియోలను నిశితంగా గమనిస్తే ఆమె క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడరని అర్థమవుతుంది. లిప్ సింకింగ్ ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. వెస్ట్రన్ డ్రెస్సుల నుంచి సంప్రదాయ చీరకట్టు వరకు ఆమె ఏది ధరించినా అది ఒక ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌లా మారుతుంది. అందుకే ఆమె వీడియోలు భాషాభేదం లేకుండా వైరల్ అవుతుంటాయి.

నెటిజన్ల నీరాజనాలు

సోషల్ మీడియాలో లభించే క్రేజ్ రెండు అంచుల కత్తిలాంటిది. అయితే మాయా సుయా నెగిటివిటీని కూడా చాలా హుందాగా స్వీకరిస్తోంది. ఆమె ప్రతి పోస్ట్‌కు వచ్చే వేలకొద్దీ కామెంట్లు ఆమె పాపులారిటీకి అద్దం పడుతున్నాయి. అభిమానులతో ఆమె కనెక్ట్ అయ్యే విధానం, అప్పుడప్పుడు ఆమె పంచుకునే వ్యక్తిగత అభిప్రాయాలు ఆమెను ఒక సాధారణ అమ్మాయిగా నెటిజన్లకు మరింత దగ్గర చేశాయి. గ్లామర్ ప్రపంచంలో ఉంటూనే అందరితో ఒక ఫ్రెండ్లీ బాండింగ్‌ను కొనసాగించడం ఆమెలోని గొప్ప లక్షణం.

రేపటి వెండితెర ఆశాకిరణం

మారుతున్న ట్రెండ్‌ను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ, తన కంటూ ఉన్న ఒరిజినాలిటీని కోల్పోకుండా వీడియోలు రూపొందించడమే మాయా సుయా విజయ రహస్యం. ఇప్పటికే పలు మ్యూజిక్ వీడియోలు, షార్ట్ ఫిలిమ్స్‌లలో తన ప్రతిభను చాటుకున్న ఈ భామ భవిష్యత్తులో వెండితెరపై మెరిసినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

బ్రాండ్ వాల్యూ... క్రేజ్

మాయా సుయాని కేవలం ఒక అందమైన అమ్మాయిగా అభివర్ణించడం సరికాదు. ఆమె ఒక తెలివైన బ్రాండ్ బిల్డర్ కూడా. ఫ్యాషన్ పట్ల ఆమెకున్న లోతైన అవగాహన అద్భుతం. ఆధునిక యువత ఏ రకమైన స్టైల్స్‌ను ఇష్టపడుతున్నారు అనే విషయాలపై ఆమె నిరంతరం అప్డేట్ అవుతుంటారు. ఈ కారణంగానే ప్రముఖ కాస్మెటిక్, క్లోథింగ్ బ్రాండ్స్ తమ ఉత్పత్తులను ప్రమోట్ చేయడానికి ఆమెను మొదటి చాయిస్‌గా ఎంచుకుంటున్నాయి. ఒక సాధారణ కంటెంట్ క్రియేటర్ నుంచి ఒక పవర్‌ఫుల్ బ్రాండ్‌గా ఆమె ఎదిగిన తీరు డిజిటల్ మీడియాలో కెరీర్ నిర్మించుకోవాలనుకునే ఎందరో యువతులకు స్ఫూర్తినిస్తోంది.

నటి తమన్నా భాటియా ఫిట్‌నెస్ వెనుక ఆమె ఫిట్‌నెస్ ట్రైనర్ సిద్ధార్థ్ సింగ్ కృషి ఎంతో ఉంది. తాజాగా అతను డైటింగ్ పోకడలతో తలెత్తే నష్టాల గురించి సామాజిక మాధ్యమాల్లో ఒక వీడియో పోస్ట్ చేశాడు. డైట్ ట్రెండ్స్, వాటితో ఆరోగ్యానికి కలిగే హాని గురించి అతనేమంటున్నాడంటే...

కార్బ్స్ కాదు... క్యాలరీలు తగ్గించాలి

ఫిట్‌నెస్ ట్రెండ్స్ వేగంగా వచ్చి వెళ్లిపోతూ ఉంటాయి. కాబట్టి వాటిలో ఏ ట్రెండ్ ప్రభావాన్ని కనబరుస్తుందో కనిపెట్టడం చాలా కష్టం. పైగా ప్రతిరోజూ ఇంటర్నెట్‌లో ఏదో ఒక కొత్త డైట్ ఫ్యాడ్ ప్రత్యక్షమవుతూనే ఉంటుంది. కాబట్టి ఆ హైప్‌లో చిక్కుకుపోవడం సహజమే! అయితే ఏ డైట్ మన శరీరానికి నప్పుతుందో కనిపెట్టడం చాలా ముఖ్యం.



లో కార్బ్/ క్యాలరీ డెఫిసిట్

సాధారణంగా త్వరితంగా ఫలితాన్ని కనబరిచే డైట్స్‌కు ఎక్కువగా అట్రాక్ట్ అయిపోతూ ఉంటాం. అలాంటిదే లో కార్బ్ డైట్. వేగంగా బరువు తగ్గడం కోసం పిండిపదార్థాలను పూర్తిగా మానేయడం కొత్త ట్రెండ్‌గా మారిపోయింది. నిజానికి క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవాళ్లు ఈ ట్రెండ్‌కు దూరంగా ఉండడం మంచిది. ఈ డైట్‌తో త్వరగా బరువు తగ్గే మాట నిజమే అయినా, పిండిపదార్థాలను పూర్తిగా తొలగించుకోవడం వల్ల హార్మోన్లలో అవకతవకలు తలెత్తుతాయి. ఆకలి వేధిస్తుంది. కాబట్టి లో కార్బ్ డైట్‌కు బదులుగా క్యాలరీ డెఫిసిట్ డైట్‌ను ఎంచుకోవడం ఉత్తమం. పిండి పదార్థాలను ఆస్వాదిస్తూనే, ఎక్కువ ప్రొటీన్‌ను తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేయగలిగితే, కచ్చితంగా బరువు తగ్గుతారు.



డిటాక్స్ టీ

ఇటీవలి కాలంలో పలు రకాల డిటాక్స్ టీల ట్రెండ్ పెరిగింది. ఇలాంటి క్లీన్సింగ్ ఉత్పత్తులన్నీ మోసపూరితమైనవని గ్రహించాలి. ఏ టీ లేదా సప్లిమెంట్ మనల్ని డిటాక్స్ చేయలేదు. మన శరీరాలు, విషాలను విసర్జించుకునే అంతర్గత డిటాక్స్ వ్యవస్థను కలిగి ఉంటాయి. కాబట్టి పీచు సమృద్ధిగా కలిగి ఉండే ఆహారం, ప్రొటీన్ తినాలి. వ్యాయామం లేదా నడకలను జీవితంలో భాగం చేసుకోవాలి. కంటి నిండా నిద్రపోవాలి. ఇలా మనలోని సహజసిద్ధ డిటాక్స్ వ్యవస్థను బలపరిచే జీవనశైలిని అలవరుచుకోవాలి.

సరిపడా నిద్ర

ఉరుకులు పరుగుల జీవితాల్లో నిద్రకు సరిపడా సమయాన్ని కేటాయించలేకపోతున్నాం. నిజానికి ఇదొక పెద్ద ఫిట్‌నెస్ మిస్టేక్. నిద్ర లోపిస్తే, నిస్సత్తువ ఆవరించడమే కాకుండా కొవ్వు కరిగే ప్రక్రియ నెమ్మదిస్తుంది. ఆకలి పెరుగుతుంది, శరీరం కోలుకునే వేగం తగ్గుతుంది. ఇవన్నీ శరీరంలో మరింత కొవ్వు పేరుకుపోడానికి దారి తీస్తాయి. కాబట్టి బరువు తగ్గాలనుకునేవాళ్లకు నిద్రకు ప్రాధాన్యం ఇవ్వాలి. రోజుకు కనీసం 7 నుంచి 8 గంటలు తప్పనిసరిగా నిద్రపోవాలి.

పోలవరం పనులు బాగుబాగు!

▸ అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ ప్రాథమిక నివేదిక

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం పనుల్లో వేగం పెరిగిందని అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ సంతృప్తి వ్యక్తం చేసింది. ప్రస్తుతం పనులు చూస్తుంటే.. వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తవుతాయన్న విశ్వాసం కలుగుతోందని పేర్కొంది. ప్రాజెక్టు పనులపై అధ్యయనం.. సిఫారసులు, సూచనలు ఇచ్చేందుకు కేంద్ర జలసంఘం నియమించిన నలుగురు సభ్యుల బృందంలోని ముగ్గురు నిపుణులు డేవిడ్ బి.పాల్, గియాస్ ఫ్రాంకో డి.సిక్కో (అమెరికా), సీన్ హించ్‌బెర్జర్ (కెనడా) గతనెల 19-21 మధ్య ప్రాజెక్టు క్షేత్రంలో పర్యటించారు. గతేడాది 2025 ఆగస్టులో జరిపిన పర్యటనలో పరిశీలించిన అంశాలతో కలిపి తమ ప్రాథమిక నివేదికను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ద్వారా జల సంఘానికి పంపించారు. డయాఫ్రం వాల్ పనుల్లో నాణ్యత బాగుందని తెలిపారు. వాల్ ఎత్తు భూమిపైన 20 మీటర్ల ఎత్తులో ఉండాలని నిర్ధారించుకున్నా.. తర్వాత దాన్ని 19 మీటర్లకు కుదించామని.. అయితే 18.5మీటర్లే ఉండేలా 'కట్' చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఎత్తును 19 మీటర్లకు పెంచాలని స్పష్టం చేశారు. ఈసీఆర్ఎఫ్ డ్యాం ఎత్తు 53.38 మీటర్లు ఉండాలన్న డిజైన్‌ను ఆమోదించారు. కాగా.. వీరు తమ తుది నివేదికను త్వరలోనే కేంద్ర జల సంఘానికి అందజేస్తారని జల వనరుల శాఖ అధికారులు వెల్లడించారు.

సముద్రంలో కలిసే వరదనే వాడుకుంటాం

▸ జీఆర్ఎంబీ చైర్మన్‌కు స్పెషల్ సీఎస్ వివరణ

▸ మంత్రి నిమ్మలతో బీపీ పాండే భేటీ

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యటనలో ఉన్న గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) చైర్మన్ బీపీ పాండే బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు.. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, కృష్ణా డెల్టా సీఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు గురించి సాయిప్రసాద్ క్లుప్తంగా పాండేకు వివరించారు. ఏటా సముద్రంలో కలుస్తున్న దాదాపు 3,000టీఎంసీల వరద జలాల్లో రోజుకు రెండు టీఎంసీల చొప్పున వంద రోజుల్లో 200 టీఎంసీలు మాత్రమే నల్లమలసాగర్‌కు పంపి కరువు జిల్లాలకు వినియోగించడం దీని ఉద్దేశమని చెప్పారు. పోలవరం ప్రాజెక్టుకు దిగువన గోదావరి జలాలను వినియోగించుకునేందుకు మరో రాష్ట్రం లేదని.. చిట్టచివరన ఉన్న రాష్ట్రం ఏపీనేనని గుర్తుచేశారు. వృధాగా సముద్రంలో కలుస్తున్న వరద జలాలను సద్వినియోగం చేసుకుంటే.. ఎగువ రాష్ట్రాలకు వచ్చే నష్టమేమీ లేదన్నారు. జీఆర్ఎంబీ నిర్వహణ కోసం రూ.2.5 కోట్లు విడుదల చేయాలని పాండే కోరగా.. విడుదల చేస్తామని ప్రభుత్వం తరఫున సాయిప్రసాద్ హామీ ఇచ్చారు.

త్వరలో పశు జనరిక్ ఔషధ కేంద్రాలు: అచ్చెన్న

అమరావతి, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పశు జనరిక్ ఔషధ విక్రయ కేంద్రాలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు వ్యవసాయ, పశుసంవర్థక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. పశుపోషకులకు సబ్సిడీపై మందులు పంపిణీ చేసేలా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తొలి దశలో 150 పశు జనరిక్ ఔషధ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు బుధవారం తెలిపారు. గొర్రెల పెంపకం సహకార సంఘాల ద్వారా ఈ ఔషధ విక్రయ కేంద్రాలను పశువైద్యశాలల ఆవరణలో నిర్వహిస్తామని, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

మార్కెట్ యార్డుల ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలు

రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెలాఖరులోగా ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించడానికి వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందుకోసం 15 జిల్లాలకు రూ.50వేలు చొప్పున, 11 జిల్లాలకు రూ.30 వేలు చొప్పున నిధులు ఖర్చు చేయడానికి అనుమతిస్తూ మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ విజయసునీత ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్: సుజనా చౌదరి

▸ బడ్జెట్‌తో ప్రజల్లో భరోసా పెరిగింది: ఎమ్మెల్యేలు

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్‌లో ట్రిపుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది. ఇది రాష్ట్రాన్ని పునర్నిర్మించే బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది' అని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కొనియాడారు. బుధవారం అసెంబ్లీల్లో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయనతో పాటు ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరీ, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, తాడేపల్లి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండ శంకర్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ప్రసంగించారు. 'రాష్ట్రాభివృద్ధికి కేంద్ర నిధులు కూడా వాడుకోవాలి. ఈ ఏడాది 16వ ఆర్థిక సంఘం, రాష్ట్రానికి దాదాపు రూ.60 వేల కోట్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. ప్రభుత్వం ఇచ్చే నిధులతో పాటు సీఎస్ఆర్ నిధులను తెప్పించుకుని, వాటితో నియోజకవర్గాల అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉంది. ప్రభుత్వం ఎమ్మెల్యేలకు కొంత మేర నిధులు ఇవ్వాలి' అని సుజనా కోరారు. రాష్ట్ర బడ్జెట్ సామాన్యుడికి భరోసా, నమ్మకం కల్పించే విధంగా ఉందని జగ్గంపేట ఎమ్మెల్యేల జ్యోతుల నెహ్రూ అన్నారు. ఈ బడ్జెట్ దూరదృష్టి కలిగిన నాయకత్వానికి ప్రతిబింబమని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పేదరికం లేని సమాజ సాధనే లక్ష్యమని, కొవ్వూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు.

24న క్యాబినెట్ సమావేశం

అమరావతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈ నెల 24న జరగనుంది. 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం కానుంది.

మద్యం కేసులో ఐదు పిటిషన్లపై 27న తీర్పు

విజయవాడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో సిట్ అధికారులు తొలిసారిగా సీజ్ చేసిన రూ.11 కోట్లకు సంబంధించి దాఖలైన ఐదు పిటిషన్లపై ఏసీబీ కోర్టు తీర్పును 27కి వాయిదా వేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని అరెస్టు చేసిన తర్వాత శంషాబాద్‌లోని సులోచన ఫాంహౌస్‌లో భద్రపరిచిన రూ.11 కోట్లను సిట్ అధికారులు గత ఆగస్టులో సీజ్ చేశారు. దీనికి సంబంధించి కసిరెడ్డి దాఖలు చేసిన ఐదు పిటిషన్లపై బుధవారం వాద ప్రతివాదనలు ముగిశాయి. 27న తీర్పు వెలువరిస్తామని న్యాయాధికారి పి.భాస్కరరావు వెల్లడించారు.

విద్యారంగంలో వన్ నేషన్-వన్ సబ్‌స్క్రిప్షన్!

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో వన్ నేషన్-వన్ సబ్‌స్క్రిప్షన్(ఓఎన్ఓఎస్) అమలుకు త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. గుజరాత్‌లోని గాంధీనగర్‌కు చెందిన ఇన్‌ఫ్లిబినెట్ సెంటర్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, రాష్ట్రానికి చెందిన 20 యూనివర్సిటీల రిజిస్ట్రార్ల మధ్య ఈ అవగాహన ఒప్పందం జరిగింది. నాగార్జున యూనివర్సిటీలో బుధవారం ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఓఎన్ఓఎస్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఇన్‌ఫ్లిబినెట్ ప్రతినిధులు, యూనివర్సిటీల రిజిస్ట్రార్లు, లైబ్రేరియన్లు పాల్గొన్నారు. ఉన్నత విద్యలో నాణ్యమైన ఈ-రిసోర్స్‌లను పొందడం, పరిశోధనల బలోపేతానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి తెలిపారు.

మోహన్‌బాబు, విష్ణులను అరెస్టు చేయాలి: ఎస్ఎఫ్ఐ

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అరెస్టు నుంచి రక్షణ కల్పించలేమని హైకోర్టు స్పష్టం చేసినందున సినీనటులు మంచు మోహన్‌బాబు, విష్ణులను వెంటనే అరెస్టు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. ఉన్నత విద్య కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా మోహన్‌బాబు యూనివర్సిటీ గుర్తింపును రద్దుచేసి, ఆ వర్సిటీ బాధ్యతలను ఎస్వీయూకు అప్పగించాలని బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

యువతకు మేలు చేసే బడ్జెట్: నిరుద్యోగ జేఏసీ

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ విద్యార్థులు, యువతకు మేలు చేస్తుందని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే కూటమి ప్రభుత్వంలో విద్యా రంగానికి, యువతకు భారీగా నిధులు కేటాయించారన్నారు. మొత్తం బడ్జెట్‌లో విద్యా రంగానికి 10శాతం నిధులు కేటాయించారని తెలిపారు.

29,021 కోట్లు 22,407

పెట్టుబడులు ఉద్యోగాలు



▸ విద్యుత్తు రంగంలో 11,943 కోట్లతో 9,690 ఉద్యోగాల కల్పన

▸ ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదం

▸ సీఎం చంద్రబాబు అధ్యక్షతన భేటీ

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.29,021 కోట్ల పెట్టుబడులతో 22,407 మందికి ఉద్యోగాలు కల్పించేలా పలు ప్రాజెక్టులకు రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదం తెలిపింది. బుధవారం ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో ఆయన అధ్యక్షతన జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. విద్యుత్తు రంగంలో రూ.11,943 కోట్ల పెట్టుబడులతో 9,690 మందికి ఉద్యోగాలు కల్పించే ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. యశస్వ పవర్ ప్రాజెక్టు రూ.1200 కోట్లతో 690 మందికి ఉద్యోగాలు ఇచ్చేలా 200 మెగావాట్ల ఏసీ/300 మెగావాట్ల డీసీ పవర్ పార్కును ఏర్పాటు చేయనుంది. క్రోమా అలార్ ఇంటర్నేషనల్ ఎఫ్ జెడ్ రూ.2000 కోట్లతో 5,000 మందికి ఉద్యోగాలు కల్పించేలా రోజుకు 200 టన్నుల కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి ప్లాంటును ఏర్పాటు చేసేందుకు ఆమోదించింది. క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రీడ్ ట్వల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1391 కోట్లతో 200 మందికి ఉద్యోగాలు కల్పించేలా 160 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టుకు ఆమోద ముద్ర వేసింది. రెన్యూ ఫొటోవోల్టాలిక్స్ రూ.1461 కోట్లతో 500 మందికి ఉద్యోగాలు కల్పించేలా 125 మెగావాట్ల విండ్ సోలార్ హైబ్రీడ్ ప్రాజెక్టుకు ఎస్ఐపీబీ అంగీకరించింది. ఎన్‌టీపీసీ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ రూ.4,500 కోట్ల పెట్టుబడితో 3,100 మందికి ఉద్యోగాలు కల్పించే 900 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సమావేశంలో మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, పి.నారాయణ, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇతర ప్రాజెక్టులకు ఆమోదాలు

- అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ సంస్థ రూ.2,387.81 కోట్లతో 1000 మందికి ఉద్యోగాలు కల్పించే ప్లాంటును అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం తర్లువాడ గ్రామంలో ఏర్పాటు చేయనుంది.
- కంపాస్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.101.28 కోట్లతో 150 మందికి ఉద్యోగాల కల్పన. 2024-29 ప్రోత్సాహక విధానాన్ని అమలు చేయాలని ఎస్ఐపీబీ నిర్ణయించింది.
- అకాడ హోటల్స్ అండ్ రిసార్ట్స్ రూ.330 కోట్ల పెట్టుబడితో 372 మందికి ఉద్యోగాలను కల్పించనుంది. ఈ సంస్థకు ప్రభుత్వ విధానాల మేరకు ప్రోత్సాహకాలను ఇవ్వాలని నిర్ణయించింది.
- వీరాంజనేయ హాస్పిటాలిటీ రూ.89.32 కోట్లతో 150 మందికి ఉద్యోగాలు కల్పించనుంది.
- అక్షయ హోటల్స్ అండ్ రిసార్ట్స్ రూ.54.02 కోట్లతో 80 మందికి ఉద్యోగాల కల్పన.
- ఎకో-ఐఎస్ఎల్ఈ రిసార్ట్స్ రూ.262.87 కోట్లతో చేపట్టే ప్రాజెక్టులో 500 మందికి ఉద్యోగ కల్పనకు ఆమోదం.
- మెసర్స్ సైబర్‌సిటీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1226 కోట్లతో చేపట్టే ప్రాజెక్టులో 1500 మందికి ఉద్యోగాల కల్పన.
- కేపీసీ ప్రాజెక్టు రూ.280.51 కోట్ల పెట్టుబడితో 310 మందికి ఉద్యోగాలు ఇచ్చే టూరిజం ప్రాజెక్టు ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్.
- రుషికొండ బీచ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.424.20 కోట్లతో 450 మందికి ఉద్యోగాలు కల్పన.
- ఎస్వీఎస్ కన్‌స్ట్రక్షన్స్ రూ.104 కోట్లతో 300 మందికి ఉపాధి కల్పన.
- రాధికా వెజిటబుల్ ఆయిల్స్ రూ.240 కోట్లతో 304 మందికి ఉద్యోగాల కల్పన.
- హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ రూ.209.58 కోట్లతో 35 మందికి ఉపాధిని కల్పించేలా పాల ఉత్పత్తుల తయారీకి ఆమోదం.
- ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ రూ.786.15 కోట్లతో 1000 మందికి ఉద్యోగాలు ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం.
- స్నేహా ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతిపాదనలకు ఆమోదం.
- రామాయపట్నం కార్గో రిసెప్షన్ టెర్మినల్స్ ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్.
- వారీ ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.8,175 కోట్లతో 3000 మందికి ఉపాధి కల్పన.
- సగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.314.66 కోట్లతో 780 మందికి ఉద్యోగాల కల్పన ప్రతిపాదనలకు ఆమోదం.

వేగంగా పట్టాలెక్కాలి

(మొదటి పేజీ తరువాయి)

అడ్డంకులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. భూకేటాయింపులు జరిపిన తర్వాత నిర్ణీత కాలవ్యవధిలో పనులు ప్రారంభించాలని, ఆయా సంస్థలతో సంప్రదింపులు జరపాలని సూచించారు. నిర్మాణాలకు ముందుకు రాకుంటే భూములు వెనక్కు తీసుకునేందుకు వెనుకాడవద్దని స్పష్టం చేశారు. దీనిపై మంత్రుల కమిటీ దృష్టి సారించాలని అన్నారు. అవసరమైతే అనుమతులు రద్దు చేయాలన్నారు. ప్రతి ఒప్పందం వేగంగా సాకారం కావాలన్నారు. రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేలా ఎన్నారైలను ఆహ్వానించాలని మంత్రులు, అధికారులకు సూచించారు. రాష్ట్రంలో సెమీ కండక్టర్ ప్రాజెక్టులు మరిన్ని వచ్చేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అలాగే సొంత భూముల్లో ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకునేవారికి అదనపు ప్రోత్సాహకాలను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారు.

విశాఖలో ఐకానిక్‌గా 'భారత్ మండపం'

విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లుగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. సూర్యలంక, పోలవరం, పులికాట్, గండికోట, శ్రీశైలం, మదనపల్లె, హార్స్‌లీ హిల్స్ వంటి క్లస్టర్లు ఏర్పాటు చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ఆయా క్లస్టర్లలో షాపింగ్ మాల్స్, హోటల్స్ వంటివి వస్తే పర్యాటకుల్ని మరింతగా ఆకట్టుకోవచ్చన్నారు. విశాఖలో భారత మండపం వస్తోందని, ఐకానిక్‌గా నిలిచేలా చూడాలని అన్నారు. అలాగే ప్రతి జిల్లాలో శిల్పారామాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాకినాడ, ఏలూరు లాంటి ప్రాంతాలు సహా రాష్ట్రంలో మరిన్ని హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లు రావాలన్నారు. జాతీయ స్థాయి ఈవెంట్లు కూడా జరగాల్సి ఉందన్నారు. స్పోర్ట్స్ సిటీ, క్రియేటివ్ సిటీ ఎకోసిస్టమ్ క్రియేట్ చేయాలన్నారు. డైరీ, పౌల్ట్రీ లైవ్‌స్టాక్, మీట్ ఎగుమతులూ పెరగాలని చెప్పారు. ఉద్యోగాల వివరాలతో నైపుణ్యం పోర్టల్ ప్రారంభించాలని సూచించారు. ఇకపై ప్రతినెలా ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష చేస్తానని సీఎం అన్నారు.

ఎఫ్‌డీలు పెట్టు.. అక్రమాస్తులు పట్టు!

(మొదటి పేజీ తరువాయి)

రూ.వందల కోట్లకు చేరి ఉంటుంది. కానీ రూ.10 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు పెడతాం.. జప్తు నుంచి తమ ఆస్తులు విడుదల చేయాలని మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసుల్లోని నిందితులు కోర్టును అడుగుతున్నారు. ఇలా చిల్లర పడేసి.. నేరంతో అనుసంధానమై ఉన్న రూ.వందల కోట్ల విలువైన ఆస్తులను నగదు చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో విశాఖ రాంకీ ఫార్మా సిటీ గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు విషయంలో భారీగా లబ్ధి పొందిన రాంకీ ఫార్మా.. జగన్ కంపెనీల్లో క్విడ్ ప్రోకోలో భాగంగా పెట్టుబడులు పెట్టిందని ప్రధాన ఆరోపణ. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన ఈడీ.. ప్రొసీడ్స్ ఆఫ్ క్రైం (నేరపూరిత సొమ్ము)తో నేరుగా సంబంధం ఉన్న విశాఖ ఫార్మా సిటీలో 16 ఫార్మా ఇండస్ట్రియల్ ప్లాట్లను జప్తు చేసింది. ఇది చెల్లదని ఆ కంపెనీ.. ఈడీ అడ్జుడికేటింగ్ అథారిటీని ఆశ్రయించగా సదరు ప్లాట్లను విడుదల చేయాలని అథారిటీ తీర్పు ఇచ్చింది. అయితే సదరు ప్లాట్లలో ఎలాంటి నిర్మాణాలూ చేపట్టరాదని, విక్రయించరాదని.. థర్డ్ పార్టీ ఆసక్తులు సృష్టించరాదని స్పష్టంగా పేర్కొంది. దీనిపై రాంకీ ఫార్మా తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై బుధవారం జస్టిస్ శ్యాంకోషీ, జస్టిస్ నర్సింగ్‌రావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. రాంకీ ఫార్మా తరఫున సీనియర్ న్యాయవాది, వైసీపీ రాజ్యసభ ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈడీ చేసిన జప్తు అక్రమమని పేర్కొన్న తర్వాత కూడా సదరు ప్లాట్లలో ఎలాంటి పనులూ చేయకుండా అడ్జుడికేటింగ్ అథారిటీ ఆదేశాలివ్వడం సమంజసం కాదని.. తాము సదరు ప్లాట్లకు విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు సమర్పిస్తామని, వాటిని విడుదల చేయాలని కోరారు. గతంలో ఇదే తరహా కేసుల్లో సమానమైన సొమ్ముకు ఎఫ్‌డీలు పెట్టడానికి న్యాయస్థానాలు అంగీకరించాయన్నారు.

అది నేరపూరిత సొమ్ము: అదనపు సొలిసిటర్ జనరల్

ఎట్టి పరిస్థితుల్లోనూ సదరు ఆస్తుల విడుదలకు ఆదేశాలు ఇవ్వొద్దని ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ బి.నరసింహ శర్మ అభ్యర్థించారు. అవి నేరుగా నేరపూరిత సొమ్ముకు అనుసంధానమై ఉన్న ఆస్తులని తెలిపారు. క్రిమినల్ చర్యల ద్వారా వచ్చిన సొమ్ముకు సంబంధించిన ఆస్తులని.. ట్రయల్ ముగిసే వరకు అవి జప్తులోనే ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఫార్మా సిటీ లోపల 500 మీటర్ల వరకు ఉండాల్సిన గ్రీన్ బెల్ట్ బఫర్ జోన్‌ను కేవలం 50 మీటర్లకు అక్రమంగా తగ్గించారని.. తద్వారా రాంకీ ఫార్మా భారీగా లబ్ధిపొందిందని తెలిపారు. అప్పటి ప్రభుత్వం రాంకీ ఫార్మాకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుందన్నారు. సదరు నేపూరిత ఆస్తుల బదులుగా ఫిక్స్‌డ్ డిపాజిట్లను అంగీకరించవద్దని కోర్టును కోరారు. నేరపూరిత సొమ్ముకు సమానమైన ఏదైనా ఆస్తిని జప్తు చేస్తే అటువంటి ఆస్తిని విడుదల చేయాలని గతంలో తీర్పులు వచ్చాయని.. అయితే ప్రస్తుత ఆస్తి నేరుగా ప్రొసీడ్స్ ఆఫ్ క్రైంకు సంబంధించిన ఆస్తి అని.. ఇలాంటి ఆస్తులను విడుదల చేయాలంటూ తీర్పులు లేవని వెల్లడించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

కేంద్రం తీరుతో..

మా హక్కులకు భంగం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకెళ్లింది. కృష్ణా జలాలను రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 ప్రకారం ఏపీ, తెలంగాణకు ప్రాజెక్టుల వారీగా కేటాయించాలని తొలుత నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం తొలుత బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు కేంద్రం మార్గదర్శకాలు జారీచేసింది. అయితే దీనివల్ల తెలంగాణకు అన్యాయం జరుగుతోందని, అంతరాష్ట్ర నదీజలాల చట్టం-1956లోని సెక్షన్ 3 ప్రకారం కృష్ణాజలాల పునఃపంపిణీ చేపట్టాలని కేంద్రాన్ని ఆ ప్రభుత్వం కోరింది. సుదీర్ఘకాలం తర్వాత 2023 అక్టోబరు 6న కేంద్రం ట్రైబ్యునల్‌కు నూతన మార్గదర్శకాలిచ్చింది. సెక్షన్ 3 ప్రకారం ఇరురాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పంపిణీ చేపట్టాలని నిబంధనావళి(టీవోఆర్) జారీచేసింది. ఈ టీవోఆర్‌ను రద్దు చేయాలని ఏపీ అదే ఏడాది అక్టోబరు 17న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం నీటి కేటాయింపులకు రక్షణ ఉందని, ఇప్పటికే సెక్షన్ 89ఏ, బీ కింద.. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటిని ప్రాజెక్టుల వారీగా కేటాయించే అంశాన్ని ట్రైబ్యునల్ పరిశీలిస్తుండగా.. కొత్త అంశాలు చేర్చడం తగదని తన పిటిషన్‌లో స్పష్టం చేసింది. ఆ వ్యాజ్యం బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలితో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఏపీ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. విభజన చట్టం-2014లోని నిబంధనలకు విరుద్ధంగా కేంద్రం కొత్త టీవోఆర్ జారీ చేసిందని, అది చెల్లదని తెలిపారు. కృష్ణాజలాల పంపిణీలో చట్టబద్ధమైన ట్రైబ్యునల్ పరిధిని కుదించేలా కేంద్రం వ్యవహరించడం సరికాదన్నారు.

సెక్షన్ 89 ప్రకారమే జలాల పంపిణీ

ఏపీ, తెలంగాణ విడిపోయిన తర్వాత విభజన పంపకాలు జరిగాయని ఏపీ తరఫు న్యాయవాదులు తెలిపారు. 'రాష్ట్ర విభజన చట్టం-2014లోని సెక్షన్ 89 ప్రకారం కృష్ణాజలాల పంపిణీ జరగాలనేది పార్లమెంటు వేదికగా తీసుకున్న నిర్ణయం. కానీ కేంద్రం కొత్తగా సెక్షన్ 3 కింద టీవోఆర్‌ను తీసుకురావలసిన అవసరం ఏముంది? ఇది ముమ్మాటికీ ఏపీకి నష్టం చేకూర్చే పనే. రెండు రాష్ట్రాల మధ్య ఏమైనా సమస్యలు తలెత్తితే కేంద్రం జోక్యం చేసుకుని పరిష్కరిస్తే మంచిదే. అయితే సెక్షన్-3 టీవోఆర్‌తో రెండు రాష్ట్రాల మధ్య జల వివాదం మరింత జటిలంగా మారింది' అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టులవారీగా నీటి కేటాయింపులు సరికాదని.. రాష్ట్రం మొత్తమ్మీద ఒకే విధంగా ఉండాలన్నారు. కృష్ణా జలాలపై బచావత్ ట్రైబ్యునల్-1 ఉమ్మడి ఏపీకి 800 టీఎంసీలు కేటాయించిందని.. ఆ నీటిపై దిగువ రాష్ట్రాలకు సంపూర్ణ హక్కు ఉంటుందని.. ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకకు ఏ ప్రమేయం ఉండదని తెలిపారు. 'అంతర్రాష్ట్ర నదీజలాల విషయంలో ఒక ఒప్పందం కుదిరిన తర్వాత.. ఆ నీటిని తమ అవసరాలకు అనుగుణంగా ఎలా ఉపయోగించుకోవాలనే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉంటుంది. ప్రాజెక్టుల వారీగా ఆంక్షలు విధించడం లేదా రాష్ట్రాల అంతర్గత నీటి వినియోగంలో కేంద్రం మితిమీరి జోక్యం చేసుకోవడం సరికాదు. ఇది ముమ్మాటికీ ఆ రాష్ట్రాల హక్కులను హరించడమేనని సుప్రీంకోర్టు 1996లో జల వివాదాలకు సంబంధించి స్పష్టమైన తీర్పు ఇచ్చింది' అని గుర్తుచేశారు. కేంద్రం తీరుతో శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల నిర్వహణలోనూ ఇబ్బంది తలెత్తుతోందని తెలిపారు. 2015లోని తాత్కాలిక ఒప్పందం ప్రకారమే నీటి పంపిణీ జరుగుతోందని తెలిపింది. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ.. 2002లోపు ఇచ్చిన ట్రైబ్యునల్ తీర్పులు, నీటి కేటాయింపులకు చట్టపరమైన రక్షణ ఉందని.. వాటిపై పునఃసమీక్ష సాధ్యం కాదని స్పష్టత ఇచ్చారు. ఇదేసమయంలో విభజన చట్టం-2014లోని సెక్షన్ 89, కొత్త రిఫరెన్స్‌ల ప్రకారం సెక్షన్ 3 మధ్య ఉన్న వైరుధ్యాలను లోతుగా పరిశీలించాల్సి ఉందన్నారు. ఈనెల 25న మధ్యాహ్నం 2 గంటలకు సమగ్రంగా వాదనలు వింటామని స్పష్టం చేస్తూ విచారణను వాయిదా వేశారు.

కర్లపాలెం ఎస్ఐ, కానిస్టేబుళ్లు కోర్టుకు రావాలి

▸ కస్టోడియల్ టార్చర్ కేసులో హైకోర్టు ఆగ్రహం.. విచారణ 25కు వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తనను పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేశారని, బాధ్యులైన పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ విజయబాబు అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. బాధితుడి ఒంటిపై ఉన్న గాయాలకు సంబంధించిన ఫొటోలను పరిశీలించిన కోర్టు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి విచారణలో వ్యక్తిగతంగా తమ ముందు హాజరుకావాలని కర్లపాలెం పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, కానిస్టేబుళ్లు బాలకృష్ణారెడ్డి, తిరుపతయ్యలను ఆదేశించింది. విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. బాపట్ల జిల్లా, కర్లపాలెం గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి రేగులగడ్డ విజయబాబు ఈ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది సీహెచ్ విద్యాసాగర్ వాదనలు వినిపించారు. .

విద్యుత్ సరఫరా తొలగించే ముందు నోటీసివ్వాల్సిందే!

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఒకసారి విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన తర్వాత, ఏదైనా కారణంతో విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని అధికారులు భావిస్తే సంబంధిత వినియోగదారుడికి ముందుగా నోటీసు ఇవ్వాల్సిందేనని హైకోర్టు తేల్చిచెప్పింది. చట్టబద్ధమైన విధానాన్ని అనుసరించకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేయడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని పేర్కొంది. తప్పుడు పత్రాలు సమర్పించి విద్యుత్ కనెక్షన్ పొందారని భావిస్తే, అధికారులు నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాల్సిందని స్పష్టంచేసింది. అధికారుల చర్య ఏమాత్రం సమర్థనీయం కాదంది. వారంలోగా ఆ ట్రస్ట్‌కు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతోపాటు మీటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. వ్యాజ్యంపై విచారణను మూసివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య ఇటీవల తీర్పు ఇచ్చారు. ప్రకాశం జిల్లా అద్దంకి పట్టణానికి చెందిన కాకతీయసేవా ట్రస్ట్ చైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు 2025లో ఈ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు.

ఏయూలో విద్యార్థి సంఘాల ఘర్షణ

▸ ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ/ఏఐఎస్ఎఫ్ నాయకుల మధ్య వాగ్వాదం

విశాఖపట్నం, అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘాల మధ్య బుధవారం ఉదయం ఘర్షణ జరిగింది. బీజేపీ అనుబంధ విద్యార్థి సంఘం ఏబీవీపీ, కమ్యూనిస్టు పార్టీల అనుబంధ విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ సంఘాల మధ్య కొద్దిరోజులుగా కోల్డ్‌వార్ జరుగుతోంది. ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని, మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరోపిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి లా కాలేజీ ఎదురుగా బాస్కెట్‌బాల్ మైదానంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ శాఖ నిర్వహిస్తుండగా అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపించారు. ఆ తరువాత మరోసారి గొడవకు దిగే ప్రయత్నం చేయగా, పోలీసులు అడ్డుకున్నారు. బుధవారం ఉదయం ఏబీవీపీ నాయకులు వీసీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తమపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇది తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్‌కు చెందిన విద్యార్థి సంఘాల నేతలు అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాలు పోటాపోటీగా నినాదాలు చేస్తూ ఒకరిపైకి ఒకరు దూసుకువెళ్లే ప్రయత్నం చేశారు. ఒకానొక దశలో కొట్టుకునేంత వరకూ వెళ్లగా పోలీసులు, ఏయూ సెక్యూరిటీ సిబ్బంది పరిస్థితిని అదుపుచేశారు. అంతకుముందు ఇరువర్గాలకు చెందిన విద్యార్థి సంఘ నాయకులతో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు చర్చలు జరిపారు. ఈ తరహా గొడవలకు వర్సిటీని కేంద్రంగా చేయవద్దని, మతపరమైన కార్యకలాపాలు నిర్వహించవద్దని సూచించారు.కాగా, 'ఉనికి కోల్పోతున్న కమ్యూనిస్టులు హింసకు పాల్పడితే చూస్తూ ఊరుకోం. తగిన బుద్ధి చెబుతాం' అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు హెచ్చరించారు. 'నాలుగు దశాబ్దాలుగా ఏయూలో కార్యక్రమాలు నిర్వహిస్తోన్న స్వయం సేవక్‌లపై దాడులు చేయడం పిరికిపంద చర్య. కమ్యూనిస్టులను మేం రాజకీయ పరమైన ప్రత్యర్థులుగా చూస్తున్నాం తప్ప శత్రువులుగా చూడటం లేదు. అలా కాదని హింసను ఎంచుకుంటే వారికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం' అని నాగోతు హెచ్చరించారు.

పంచాయతీరాజ్‌లో పదోన్నతుల పండుగ

▸ జడ్పీ సీఈఓలుగా 74 మందికి పదోన్నతి

▸ డీడీఓ, డీపీఓ, డిప్యూటీ సీఈఓలకు అవకాశం


అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు పదోన్నతుల పండుగ వచ్చింది. 74 మంది డీపీఓ, డీడీఓ, డిప్యూటీ సీఈఓలకు జడ్పీ సీఈఓలుగా పదోన్నతులు కల్పిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీరాజ్ చరిత్రలో ఈ పదోన్నతులు ఒక మైలురాయిగా నిలిచాయి. ఈ శాఖ ప్రారంభమైనప్పటి నుంచి ఇతర శాఖల అధికారులే జడ్పీ సీఈఓలుగా విధులు నిర్వహిస్తుండగా, తొలిసారి 74 మంది పంచాయతీరాజ్ అధికారులకు జడ్పీ సీఈఓ హోదా కల్పించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ పదోన్నతులకు కారణమైన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల సంఘం నేతలు కేఎస్ వరప్రసాద్, కేఎన్‌వీ ప్రసాద్, డి.వెంకట్రావు, బుజ్జి, సూర్యనారాయణ తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

మీవన్నీ తప్పుడు ఆరోపణలు

▸ వెంటనే క్షమాపణలు చెప్పండి.. మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోండి

▸ లేకుంటే సివిల్, క్రిమినల్ చర్యలు.. బొత్సకు హెరిటేజ్ లీగల్ నోటీసులు

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): హెరిటేజ్ సంస్థపై తప్పుడు ఆరోపణలు చేసినందుకుగాను వైసీపీ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు ఆ సంస్థ లీగల్ నోటీసులు ఇచ్చింది. హెరిటేజ్ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సాంబమూర్తి తరఫున న్యాయవాది మల్లికార్జున్ లీగల్ నోటీసులు పంపారు. అసత్య, నిరాధార ఆరోపణలతో సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్రకు పాల్పడ్డారని నోటీసుల్లో పేర్కొన్నారు. అత్యున్నత ప్రమాణాలు పాటిస్తూ దశాబ్దాలుగా ప్రజల నమ్మకాన్ని పొందిన సంస్థపై చేసిన తప్పుడు ప్రచారంపై వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. 'హెరిటేజ్ సంస్థ చట్టబద్ధంగా నడుస్తూ పారదర్శక విధానాలతో పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రశంసలు, గుర్తింపు పొందింది. పూర్తి స్థాయిలో ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ దేశంలోనే ప్రీమియం బ్రాండ్‌గా గుర్తింపు పొందింది. శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఉన్న మీరు ఇతర వైసీపీ నేతలతో కలిసి మీడియాలో తప్పుడు వ్యాఖ్యలతో సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగేలా అసంబద్ధ ఆరోపణలు చేశారు. ఇందాపూర్ డెయిరీతో ఎటువంటి సంబంధం లేకపోయినా 2014-19 మధ్య ఆ సంస్థ పేరుతో హెరిటేజ్ టీటీడీకి నెయ్యి సరఫరా చేసిందంటూ తప్పుడు ఆరోపణలు చేశారు. 22 సంస్థలతో హెరిటేజ్ సిండికేట్ ఏర్పాటు చేసిందంటూ నిరాధార ఆరోపణలు చేశారు. తక్షణమే క్షమాపణ చెప్పి మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి. లేని పక్షంలో హెరిటేజ్ మీపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటుంది' అని బొత్సకు జారీ చేసిన నోటీసుల్లో పేర్కొన్నారు.



ఫ్లైట్ టికెట్టూ నాదే.. మ్యాచ్ టికెట్టూ నాదే



» నీ దుడ్లు ఏమైనా ఖర్చు చేస్తినా జగన్: లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): 'ఫ్లైట్ టికెట్టూ నాదే! మ్యాచ్ టికెట్టూ నాదే! నా దుడ్డుతో నేను మ్యాచ్ చూస్తిని.. నీ దుడ్లు ఏమైనా ఖర్చు చేస్తినా జగన్' అని మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. కొలంబోలో జరిగిన భారత్-పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌కు లోకేశ్ ప్రభుత్వ ధనం వెచ్చించి వెళ్లారని వైసీపీ ప్రచారం చేస్తుండటంపై ఆయన పైవిధంగా స్పందించారు. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని, మంత్రి లోకేశ్ తన కొలంబో పర్యటన కోసం ప్రభుత్వ ధనం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, ఇలాంటి అసత్య వార్తలు నమ్మవద్దంటూ ఏపీ గవర్నమెంట్ ఫ్యాక్ట్ చెక్ వివరాలను తన పోస్టుకు ట్యాగ్ చేశారు.


అసెంబ్లీ సందర్శనకు వచ్చిన విద్యార్థులతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

త్వరలో పోలవరం సందర్శనకూ అవకాశం

» అసెంబ్లీకి వచ్చిన విద్యార్థులతో స్పీకర్

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు సందర్శనకు త్వరలో విద్యార్థులకూ అవకాశం కల్పిస్తామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. బుధవారం అసెంబ్లీ సమావేశాలను వీక్షించేందుకు వచ్చిన విద్యార్థులతో అయ్యన్న మాట్లాడారు. విద్యార్థులందరితోనూ పాఠశాలల వారీగా స్పీకర్, ఎమ్మెల్యేలు గ్రూప్ ఫొటోలు దిగారు.

ఒకే పార్టీ.. విరుద్ధ తీర్మానాలు: లోకేశ్

శాసనమండలిలో వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ పార్టీ ఎమ్మెల్సీలపై పట్టు కోల్పోయారని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో బుధవారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. మండలిలో వైసీపీ ఎమ్మెల్సీల తీరును ఎండగట్టారు. ఒకే పార్టీ నుంచి ఇద్దరు ఎమ్మెల్సీలు పరస్పర విరుద్ధంగా రెండు వాయిదా తీర్మానాలు ఇచ్చారన్నారు. ఒకరు లడ్డూ కల్తీపై చర్చకు డిమాండ్ చేస్తుంటే, మరొకరు ఇందాపూర్ డెయిరీపై చర్చకు డిమాండ్ చేస్తున్నారని అన్నారు. వారి కొట్లాటలో ఎవరు పైచేయి సాధిస్తారో తెలుసుకోవాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని అన్నారు.

ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధికి కొత్త పాలసీ

» హైవేలపై ట్రామా సెంటర్ల ఏర్పాటు: సత్యకుమార్



అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం కొత్త పాలసీని రూపొందిస్తోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. హైవేలపై ట్రామా సెంటర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, ముప్పిడి వెంకటేశ్వరరావు, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, జ్యోతుల నెహ్రూ, యార్లగడ్డ వెంకటరావు మాట్లాడుతూ తమ నియోజకవర్గాల్లోని 50 పడకల ఆసుపత్రులను 100 పడకల ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

22ఏ నుంచి విముక్తి కల్పిస్తాం: అనగాని

నిషేధిత జాబితా 22ఏ నుంచి భూములను తొలగించే ప్రక్రియను మరింత సరళతరం చేస్తామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.22ఏ భూముల సమస్యపై ప్రభుత్వ మార్గదర్శకాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పీకరు సూచించారు.

గోదావరి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం: అచ్చెన్న

ఉభయ గోదావరి జిల్లాల్లో డ్రైనేజీల సమస్య శాశ్వత పరిష్కారం కోసం సర్వే జరుగుతోందని, ఈ ప్రాజెక్టుకు రూ.17 కోట్లు విడుదల చేశామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సర్వే పూర్తయిన వెంటనే బ్యాంకుల సహకారంతో సమగ్ర చర్యలు చేపడతామన్నారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. కేసనపల్లి, శంకరగుప్తం తదితర గ్రామాల్లో లక్ష కొబ్బరి చెట్లు పాడైపోయిన నేపథ్యంలో చెట్టుకు రూ.1,000 చొప్పున రూ.18 కోట్ల నష్టపరిహారాన్ని అందించే ప్రతిపాదనలను ఆర్థిక శాఖ ఆమోదం కోసం పంపించినట్లు మంత్రి తెలిపారు.

రోడ్లకు ఇరువైపులా చెట్లు: బీసీ జనార్దనరెడ్డి

గత ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి పర్యటనల సందర్భంగా రహదారులకిరువైపులా ఏళ్ల తరబడి పెరుగుతున్న చెట్లను నరికివేశారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రహదారులకిరువైపులా పచ్చదనం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి తెలిపారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

చైర్మన్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారు: పంచుమర్తి

శాసనమండలి చైర్మన్ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ ఆరోపించారు. సంబంధంలేని కంపెనీలు, వ్యవహారాల గురించి వైసీపీ సభ్యులు దూషించేవిధంగా వాయిదా తీర్మానాలు ఇచ్చి, సభా సమయాన్ని వృథా చేస్తున్నారన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద అనురాధ మాట్లాడారు. చైర్మన్ సభను అదుపులో పెట్టడంలో విఫలం అయ్యారని, పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

స్తంభింపజేయడం సరికాదు: మర్రి రాజశేఖర్

తిరుమల లడ్డూ కల్తీ విషయంపై మండలిలో చర్చకు నిరాకరించడంపై ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మీడియాలో, సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతున్నా, సీబీఐ చార్జ్‌షీట్ కూడా వేసిన అంశంపై చర్చించడానికి వాయిదా తీర్మానం ఇచ్చామని, చైర్మన్ దాన్ని తిరస్కరించారని చెప్పారు. అత్యంత ముఖ్యమైన అంశంపై చర్చకు నిరాకరించి, ప్రజలకు సంబంధంలేని హెరిటేజ్ అంశాన్ని పట్టుకుని వ్యక్తిగత ఎజెండాతో వైసీపీ సభ్యులు సభను స్తంభింపజేయడం సరికాదన్నారు. కల్తీ లడ్డూపై సభలో చర్చించేందుకు వైసీపీ ఎందుకు సిద్ధంగా లేదని ఎమ్మెల్సీ బి.కల్యాణ చక్రవర్తి నిలదీశారు. తాము రాజీనామా చేసి 14 నెలలైనా ఆమోదించలేదన్నారు.

రెండోరోజూ పనిచేయని మైకులు

శాసనసభలో బుధవారం కూడా మైకులు పనిచేయలేదు. సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మంగళవారం మాన్యువల్ మైకులతో సభను నడిపించాల్సి వచ్చింది. బుధవారం ఉదయం 9 గంటలకు సభను ప్రారంభించిన స్పీకర్ అయ్యన్న మాట్లాడుతూ.. సర్వర్‌లో సమస్యలు పరిష్కారం కానందున ఈరోజు కూడా మైకులు పని చేయడం లేదన్నారు.

సాయంత్రం 3 నుంచి 6 వరకూ సచివాలయంలో ఉండాల్సిందే: సీఎస్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నడుస్తున్న నేపథ్యంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు సచివాలయంలో అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకూ సచివాలయంలోనే కచ్చితంగా అందుబాటులో ఉండాలని ఆదేశిస్తూ బుధవారం సీఎస్ విజయానంద్ ప్రత్యేక మెమో జారీ చేశారు.

14 నిమిషాల్లో ముగిసిన మండలి

» చైర్మన్ పోడియంను చుట్టుముట్టిన వైసీపీ

» ఇందాపూర్, హెరిటేజ్‌లపై చర్చకు పట్టు

» సభా సమయం వృథా చేస్తోంది: హోం మంత్రి





అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో రెండో రోజు బుధవారమూ వైసీపీ తన ఆందోళనను కొనసాగించింది. తిరుమల లడ్డూ కల్తీ, ఇందాపూర్ డెయిరీ పేరుతో హెరిటేజ్ నెయ్యి సరఫరాపై తమ వాయిదా తీర్మానాలను చర్చకు అనుమతించాలంటూ వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. పోడియంను చుట్టుముట్టారు. దీంతో బుధవారం మండలి ఆరంభమైన తొమ్మిది నిమిషాలకే వాయిదా పడింది. చైర్మన్ మోషేన్ రాజు ఐదు నిమిషాలు మాత్రమే వాయిదా వేసినా... సభ తిరిగి 1.04 గంటలకు ప్రారంభమయింది. వైసీపీ సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో మండలిని గురువారం ఉదయానికి వాయిదా వేస్తున్నట్లు సభాపతి ప్రకటించారు. దీంతో మొత్తం 14 నిమిషాలు మాత్రమే సభ జరిగినట్లు రికార్డుల్లో నమోదయింది. కాగా ఉదయం 10.03 గంటలకు మండలి సమావేశమైనప్పుడు.. మాజీ ఎమ్మెల్సీలు ఐలాపురం వెంకయ్య, టీ రత్నాబాయి మృతికి సంతాపం తెలుపుతూ చైర్మన్ తీర్మానం ప్రవేశపెట్టారు. సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం.. వైసీపీ ఎమ్మెల్సీల వాయిదా తీర్మానాన్ని తిరస్కరించినట్లు చైర్మన్ ప్రకటించారు. అయినా వైసీపీ సభ్యుల నినాదాలు ఆగకపోవడంతో... టీడీపీ సభ్యులు కూడా నినాదాలకు దిగారు. వైసీపీ వ్యవహార శైలిపై మంత్రులు లోకేశ్, కేశవ్ అసహనం వ్యక్తం చేశారు. సభ వాయిదా పడింది. పునఃప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యులు తిరిగి ఆందోళనకు దిగారు. తిరస్కరించిన తీర్మానాలపై చర్చ ఉండదని చైర్మన్ ప్రకటించినప్పటికీ వైసీపీ సభ్యులు విరమించలేదు. వారిపై హోం మంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నిన్నటి నుంచి సంబంధం లేని అంశాన్ని తెచ్చి, సభా సమయాన్ని వృథా చేస్తున్నారు. ప్రజాహితం కోసం సభలో ఎలాంటి చర్చకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కల్తీ లడ్డూపై చర్చకు సిద్ధమో కాదో వైసీపీ సభ్యులు తేల్చుకోవాలి. వైసీపీ వాళ్ల రాజకీయాల కోసం దేవుడిని వాడుకోవడం బాధాకరం. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వారు వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వంలో తిరుమల లడ్డూల్లో వాడిన నెయ్యిలో కల్తీ జరిగిందని మేం చెప్పడం కాదు. సీబీఐ చార్జిషీట్‌లోనే స్పష్టం చేసింది. అయినా సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు' అంటూ మండిపడ్డారు. ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... 'తప్పు చేయనప్పుడు మేమిచ్చిన వాయిదా తీర్మానంపై ప్రభుత్వం చర్చకు అనుమతించాలి' అని డిమాండ్ చేశారు. వైసీపీ సభ్యుల ఆందోళనల నేపథ్యంలో మండలిని గురువారం ఉదయానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ మధ్యాహ్నం 1.09 గంటలకు ప్రకటించారు.

ఇందాపూర్‌తో చీకటి ఒప్పందం: బొత్స

'దేవదేవుడి ప్రసాదంపై టీడీపీ అసత్యాలు ప్రచారం చేసింది. ప్రసాదంలో ఎలాంటి కొవ్వు లేదని సీబీఐ తేల్చింది' అని బొత్స సత్యనారాయణ తెలిపారు. అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. 'హెరిటేజ్ సంస్థ ఇందాపూర్‌తో చీకటి ఒప్పందం చేసుకుంది. దోచుకోవడమే హెరిటేజ్ ఆలోచన. ఎందుకు సభలో చర్చించడానికి ఈ ప్రభుత్వానికి భయం? బడ్జెట్‌తోపాటు ఇందాపూర్‌పైనా సభలో చర్చించాలి' అని డిమాండ్ చేశారు.


ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఈనెలలో నిర్వహించనున్న క్రీడాపోటీల్లో ఇచ్చే ట్రోఫీలతో స్పీకర్ అయ్యన్న, డిప్యూటీ స్పీకర్ రఘురామ, శాసన సభ్యులు

ప్రజాప్రతినిధుల ఆటల పోటీలపై స్పీకర్ సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఈ నెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్న ఆటల పోటీలపై స్పీకర్ అయ్యన్న పాత్రుడు బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా క్రీడల ఎంపిక, విజేతలకు అందించే ట్రోఫీలు, వారికి అందించే క్రీడా దుస్తులు (జెర్సీ)పై చర్చించారు. పరుగు పందెం, వాలీబాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, క్రికెట్, టెన్నికాయిట్, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్, షటిల్ బాడ్మింటన్, షాట్‌పుట్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్స్ వంటి క్రీడలను నిర్వహించాలని నిర్ణయించారు. సమీక్ష సమావేశంలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్, ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు, శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలపై పన్ను రాయితీ

» నిర్మాణం పూర్తయ్యేవరకూ 50% చెల్లిస్తే చాలు

» పురపాలక చట్టాల సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చేలా ఖాళీల స్థలాల పన్ను(వీఎల్‌టీ)పై ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. నిర్మాణాలకు ముందు ఖాళీ స్థలాలపై విధించే పన్నులో 50శాతం రాయితీ ఇవ్వనుంది. ఈమేరకు పురపాలక చట్టాల సవరణ బిల్లుకు బుధవారం శాసనసభ ఆమోదం తెలిపింది. పురపాలక మంత్రి పి.నారాయణ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం నిర్మాణాలకు ముందు ఖాళీ స్థలాలపై వంద శాతం పన్ను విధించే విధానం ఉందని, ఇకపై నిర్మాణ అనుమతులు పొందిన నాటి నుంచి నిర్మాణం పూర్తయ్యేవరకూ 50శాతం పన్ను చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ బిల్లుపై రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హర్షం వ్యక్తంచేశారు. ఈ నిర్ణయం రియల్‌ఎస్టేట్ రంగానికి జీవం పోస్తుందన్నారు. తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఈ బిల్లుతో పట్టణీకరణ శరవేగంగా వ్యాప్తి చెందుతుందన్నారు. అయితే నిర్మాణం పేరుతో సుదీర్ఘకాలం రాయితీ పొందాలనుకునే వారికి అడ్డుకట్ట వేయాలన్నారు. నిర్మాణానికి కాలపరిమితి నిర్ణయించాలన్నారు. నిర్మాణం మధ్యలో నిలిచిపోతే రాయితీ రికవరీ చేయాలన్నారు. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ ఈ పన్ను రాయితీ పేద, మధ్య తరగతి వర్గాలకు కూడా మేలు చేకూరుస్తుందన్నారు. అయితే అనుమతులు లేని లేఅవుట్లపై చర్యలు చేపట్టాలన్నారు.

విద్యుత్ సుంకం జీవోలు సభ ఆమోదం పొందాలి

ఏపీ విద్యుత్ డ్యూటీ చట్టంపై తీసుకొచ్చిన సవరణ బిల్లును మంత్రి గొట్టిపాటి రవికుమార్ శాసనసభలో ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది. విద్యుత్ చట్టం-2003 ప్రకారం వినియోగదారుల కేటగిరీలను చట్టంలో చేర్చామని, వాలిడేషన్ సెక్షన్‌ను కొత్తగా జత చేశామని మంత్రి వివరించారు. అలాగే ఇకపై విద్యుత్ సుంకం చట్టం కింద ప్రభుత్వం జారీచేసే ఏ జీవో అయినా ఉభయసభల ఆమోదం పొందాల్సి ఉంటుందని తెలిపారు.

చట్టాల నుంచి 'కుష్టు వ్యాధి' తొలగింపు

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పలు చట్టాల నుంచి 'కుష్టు వ్యాధి' అనే పదాన్ని తొలగిస్తూ చేసిన సవరణ బిల్లును అసెంబ్లీ ఆమోదించింది. మున్సిపల్ చట్టాలు, దేవదాయ చట్టం, శ్రీవెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం నిబంధనల నుంచి ఈ పదాన్ని తొలగిస్తూ ఆయా శాఖల మంత్రులు పి.నారాయణ, ఆనం రాంనారాయణరెడ్డి ప్రవేశపెట్టిన బిల్లులను సభ ఆమోదించింది.

360 డిగ్రీస్ స్కానింగ్!

» ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం వరుస సమీక్షలు

» జిల్లా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్, ఎస్పీతో భేటీలు

» రోజూ అసెంబ్లీ అనంతరం క్యాంపు కార్యాలయంలో నిర్వహణ

» సమస్యలపై చర్చ... అప్పటికప్పుడే పరిష్కారం దిశగా చర్యలు

» అద్దంలో మా ముఖాన్ని మాకే చూపుతున్నట్టుంది: ఎమ్మెల్యేలు

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఏ ఎమ్మెల్యే ఎన్నిసార్లు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు? స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు ఎన్నిసార్లు చేపట్టారు? ఎన్ని ప్రజా దర్బార్లు పెట్టారు? ప్రెస్‌మీట్లు ఎన్ని నిర్వహించారు? సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్‌గా ఉన్నారు?.. తదితర అంశాలపై స్పష్టమైన సమాచారం ఉన్న నివేదికలతో ఎమ్మెల్యేల పనితీరును సీఎం చంద్రబాబు సమగ్రంగా సమీక్షిస్తున్నారు. కేవలం ఒక్క నివేదికపైనే ఆధారపడకుండా ఆరేడు నివేదికలు, సర్వే రిపోర్టుల ఆధారంగా తమ పనితీరును ఆయన విశ్లేషిస్తున్న తీరు ఎమ్మెల్యేలనే ఆశ్చర్యపరుస్తోంది. అద్దంలో తమ ముఖాన్ని తమకే చూపుతున్నట్లు ఈ సమీక్షలు ఉంటున్నాయని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నెల 12 నుంచి ఇప్పటివరకు కృష్ణా, చిత్తూరు, కడప, అరకు, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం సమీక్షలు నిర్వహించారు. రోజూ అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేల పనితీరు, నియోజకవర్గ స్థితిగతులు, అధికారుల పనితీరు, జిల్లాలో పరిస్థితులపై నివేదికల ఆధారంగా 360 డిగ్రీల్లో సమగ్రంగా.. సూక్ష్మంగా సీఎం సమీక్షిస్తున్నారు. మండల స్థాయి సమస్యలు, తాగు, సాగునీటి ప్రాజెక్టులు, పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు, రోడ్లు, మున్సిపాలిటీల్లో సమస్యలు తదితరాలపై చర్చ, పరిష్కారం దిశగా ఈ సమావేశాలు జరుగుతున్నాయి.

ఇన్‌చార్జి మంత్రుల తీరుపైనా..

జిల్లా ఇన్‌చార్జి మంత్రుల పనితీరుపైనా సీఎం విశ్లేషిస్తున్నారు. ఎమ్మెల్యేలు, అధికారులతో ఎన్నిసార్లు సమావేశాలు నిర్వహించారని ఓ ఇన్‌చార్జి మంత్రిని ఆయన ప్రశ్నించగా.. ఆ మంత్రి రెండుసార్లు అని చెప్పడంతో.. మీ పనితీరుకు ఆ సంఖ్యే సమాధానమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఇన్‌చార్జి మంత్రులు మరింత బాధ్యతతో పనిచేయాలని, సమస్యల పరిష్కారం, పనిచేసిన వారికి గుర్తింపు వంటి విషయాల్లో క్రియాశీలంగా పనిచేయాలని సూచిస్తున్నారు.

ఎమ్మెల్యేల్లో సంతోషం

సీఎంతో జరుగుతున్న సమావేశాలపై ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంత ఎక్కువగా జనాల్లో ఉంటే అంత ఎక్కువగా నిధులు ఇస్తానని సీఎం చెప్పడంపై ఓ ఎమ్మెల్యే స్పందిస్తూ.. పనిచేసే వారికి ఇలాంటివి మరింత ఉత్తేజాన్ని కలిగిస్తాయని వ్యాఖ్యానించారు. పనిచేయని, సమస్యలు సృష్టిస్తున్న అధికారులను భరించాల్సిన అవసరం లేదని, పనితీరు మార్చుకోకపోతే వారి స్థానంలో వేరే వారిని నియమించాలని ఎమ్మెల్యేల సమక్షంలోనే కలెక్టర్, ఎస్పీని సీఎం స్పష్టంగా ఆదేశిస్తున్నారు. ఇది అధికారులపై చాలా ప్రభావం చూపిస్తుందని, వారు మరింత వేగంగా.. జవాబుదారీతనంతో పనిచేసేందుకు ఉపయోగపడుతుందని ఎమ్మెల్యేలు పేర్కొంటున్నారు.

వారికి చురకలు.. వీరికి ప్రశంసలు

బాగా పనిచేసే వారిని ప్రశంసిస్తూనే వెనుకబడి వారికి చంద్రబాబు సుతిమెత్తగా చురకలు అంటిస్తున్నారు. వారు ఏయే విభాగాల్లో వెనుకబడి ఉన్నారో వివరంగా చెబుతూ మరింత బాగా పనిచేయాలని సూచిస్తున్నారు. జిల్లా అధికారులనూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ విభాగాల పనితీరు, సిబ్బంది కొరత, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, బస్సు సౌకర్యం, పారిశుద్ధ్యం వంటి పలు అంశాలపై సర్వేల ఆధారంగా వారి పనితీరుపై సమగ్రంగా సమీక్షిస్తున్నారు. ఎమ్మెల్యేలు, అధికారులతో ఒకేసారి సమావేశం కావడం ద్వారా జిల్లాలో ఉన్న ప్రధాన సమస్యలపై సవివరమైన చర్చ జరగడమే కాకుండా అక్కడికక్కడే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే వెసులుబాటు కలుగుతోంది. చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ వాటికి అవసరమైన నిధుల విడుదలకు సీఎం అక్కడికక్కడే ఆదేశాలు ఇస్తున్నారు. తక్కువ ఖర్చుతో పూర్తిచేసి అందుబాటులో తెచ్చే ప్రాజెక్టులకు వెంటనే నిధులు విడుదల చేయాలని చెబుతున్నారు.

అన్నీ తెలిసే.. నన్ను ఆడుకుంటున్నారుగా!

» టీడీపీ ఎమ్మెల్యేలతో వైసీపీ ఎమ్మెల్యే చంద్రశేఖర్

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఆవరణలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, టీడీపీ ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఎంఎస్ రాజు తదితరులు మాట్లాడుకుంటున్న సమయంలో ఎర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అక్కడికి వచ్చారు. 'బిల్ గేట్స్ స్థాయి తెలియకుండా ఆయన్ను కూడా విమర్శించే స్థాయికి మీ పార్టీ దిగజారిపోయిందేంటి? అసెంబ్లీకి వచ్చి బడ్జెట్ లెక్కలు అడక్కుండా ప్రెస్‌మీట్ పెట్టి బిల్ గేట్స్ టీ, కాఫీ ఖర్చులు చెప్పాలనడం ఏమిటి?' అంటూ టీడీపీ ఎమ్మెల్యేలు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. చంద్రశేఖర్ స్పందిస్తూ.. 'అన్నీ తెలిసే నన్ను ఆడుకుంటున్నారుగా.. మీకో నమస్కారం' అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఏడాదిలో 4 సార్లు ఓటు నమోదు

» పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఓటుహక్కు నమోదు చేసుకునేవారికి శుభవార్త. ఇకపై సంవత్సరంలో నాలుగుసార్లు ఓటు హక్కు నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించనుంది. ఈ మేరకు పంచాయతీరాజ్ చట్టం సవరణ బిల్లుకు అసెంబ్లీ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుత విధానంలో కొత్తగా ఓటు హక్కు నమోదు ఏడాదిలో ఒక్క జనవరి 1న మాత్రమే ఉంది. దీనివల్ల జనవరి 1 తర్వాత 18 ఏళ్లు నిండే యువత ఓటు నమోదుకు దాదాపు ఏడాది కాలం ఎదురుచూడాల్సిన పరిస్థితి. ఇంత జాప్యం లేకుండా ఓటు హక్కు నమోదుకు కేంద్రం ఏడాదిలో నాలుగు సార్లు.. జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరు నెలల్లో 1న ఓటు హక్కు నమోదుకు అవకాశం కల్పిస్తూ చట్టాల్లో సవరణలు చేసింది. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లోనూ ఈ విధానం అమలవుతోంది. ఇప్పుడు పంచాయతీరాజ్ చట్టంలోనూ సవరణలు చేయడం వల్ల గ్రామాల్లోనూ నాలుగు సార్లు ఓటు నమోదు చేసుకునే అవకాశం ఏర్పడింది. ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ బదులుగా పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టగా.. సభ ఆమోదించింది.

ఆయుష్ క్లినిక్స్‌కు ప్రభుత్వ గుర్తింపు

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆయుష్ సేవల విస్తృతికి, నాణ్యతను పెంచుతూ ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంచేందుకు అవసరమైన చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. మంత్రి సత్యకుమార్ బుధవారం అసెంబ్లీలో 'ఏపీ ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్-2002 చట్టాని'కి సవరణ బిల్లును ప్రతిపాదించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయుష్ క్లినిక్‌లు, ఆసుపత్రులు ప్రస్తుతం ప్రభుత్వ నియంత్రణలో లేవన్నారు. వాటిని కూడా ప్రభుత్వ పరిధిలోకి తెస్తేనే.. వాటిపై నియంత్రణ ఉంటుందని అందుకే బిల్లును ప్రతిపాదించామని చెప్పారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు: మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్

చట్ట సవరణ బిల్లును ఆమోదించడంతో ప్రభుత్వానికి, మంత్రి సత్యకుమార్‌కు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ డైరెక్టర్ వేముల భానుప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు. ఇది చరిత్రాత్మక నిర్ణయమన్నారు. ఈ చట్టం ద్వారా ఆయుష్ క్లినిక్స్, హాస్పిటల్స్ రిజిస్ట్రేషన్ జరిగి, చట్టబద్ధ గుర్తింపు లభిస్తుందన్నారు.

అసెంబ్లీ ఆవరణలో చేనేత స్టాళ్లు

» బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకూ నిర్వహణ

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. తాజాగా బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో చేనేత స్టాళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో అసెంబ్లీకి, మండలికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆప్కో ఆధ్వర్యంలో 12 స్టాళ్లను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకూ ఈ స్టాళ్లను కొనసాగించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా తయారవుతున్న ప్రఖ్యాతిగాంచిన చేనేత ఉత్పత్తులను ఇక్కడ విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారు. పొందూరు చొక్కాలు, పంచెలు, కుండువాలు, మాధవరం, వెంకటగిరి, ధర్మవరం, రాజమండ్రి, ఉప్పాడ, బందరు మానపల్లి పట్టు, సాధారణ చీరలతోపాటు రెడీమేడ్ దుస్తులను అమ్మకానికి ఉంచనున్నారు. ఈ స్టాళ్లను చేనేత జౌళిశాఖ మంత్రి సవిత బుధవారం పరిశీలించారు. ఏయే వస్త్రాలు విక్రయించనున్నారో అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చేనేత వస్త్రాలను, పట్టు చీరలను అమ్మకానికి పెట్టాలని ఆదేశించారు. చేనేత స్టాళ్లతోపాటు ఫొటో స్టాల్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ దంపతులు, సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ సహా పలువురు ప్రముఖులు చేనేత ఎగ్జిబిషన్లను సందర్శించిన, చేనేత వస్త్రాలు కొనుగోలు చేసిన, ధరించిన దృశ్యాలను ఈ ఫొటోస్టాల్‌లో ప్రదర్శనకు ఉంచారు. నేతన్నలతో సీఎం చంద్రబాబు సంభాషిస్తున్న దృశ్యాలు కూడా ప్రదర్శనకు పెట్టారు.


నేతన్నకు ఆర్థిక భరోసా: సవిత

చేనేత దుస్తుల వినియోగం పెంచడమే లక్ష్యంగా ఈ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. బడ్జెట్ సమావేశాలకు వచ్చినవారంతా చేనేత వస్త్రాలు కొనుగోలు చేయడం ద్వారా నేతన్నలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ప్రజలంతా వారంలో ఒక రోజు చేనేత దుస్తులు ధరించడం ద్వారా సంప్రదాయమైన చేనేత వృత్తికి వెన్నుదన్నుగా నిలిచినవారవుతారని తెలిపారు.


అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటుచేసిన చేనేత స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రి సవిత



ఫ్లీట్‌లో పాల్గొన్న యుద్ధ నౌకలు





విమాన వాహక యుద్ధనౌక 'ఐఎన్ఎస్ విక్రాంత్'



ఐఎన్ఎస్ సుమేధ నౌక పైనుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, భారత నౌకాదళాధిపతి దినేశ్ త్రిపాఠి, తూర్పు నౌకాదళాధిపతి సంజయ్ భల్లా ఉన్నారు

భళా.. భారత నేవీ..!

విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ.. రాష్ట్రపతి, గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం హాజరు

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో భారత్ నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) బల ప్రదర్శన కాదని.. అంతరాత్జీయ స్నేహసంబంధాలకు ప్రతీక అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. విశాఖ సాగర తీరాన బుధవారం ఉదయం ఆమె ఫ్లీట్ రివ్యూ నిర్వహించారు. ఆరు వరుసల్లో 80కి పైగా నౌకలు బారులు తీరి ఉండగా... వాటి మధ్య నుంచి ప్రత్యేక రథం (ఐఎన్ఎస్ సుమేధ)పై ఆమె ప్రయాణిస్తూ ఆయా నౌకల సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఇందులో భారత నేవీకి చెందిన నౌకలు 60, విదేశీ నౌకలు 19, కోస్ట్ గార్డ్, మర్చంట్ నేవీ, సర్వే నౌకలు మరో ఏడింటితో పాటు మూడు సబ్‌మెరైన్లు, సెయిలింగ్ నౌకలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా భారత వైమానిక దళం సాహస విన్యాసాలు ప్రదర్శించింది. అనంతరం రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ.. ఐఎఫ్ఆర్‌లో పాల్గొనడం అపారమైన గౌరవంతో పాటు ఆనందాన్ని కలిగిస్తోందని అన్నారు. భారత నౌకాదళం 'సురక్షిత సముద్రం-సమృద్ధి భారత్' లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధం, సముద్ర దోపిడీ నియంత్రణ వంటి అంశాల్లో ఒక దేశానికి మరో దేశం సహకరించుకోవాల్సి ఉందన్నారు. భారత నౌకాదళం మరింత బలోపేతం కావాలని, ప్రపంచశాంతి స్థాపనలో ముందుండాలని ఆమె ఆకాంక్షించారు. సమీక్షకు ముందు రాష్ట్రపతి జెట్టీ వద్దకు రాగా 150 గార్డులు గౌరవ వందనం చేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఆయన భార్య అన్నా లెజినోవా, భారత నౌకాదళాధిపతి దినేశ్ త్రిపాఠి, తూర్పు నౌకాదళాధిపతి సంజయ్‌భల్లాతో కలిసి ఐఎన్ఎస్ సుమేధపై సముద్రంలోకి వెళ్లి నౌకాదళ సమీక్ష చేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

'సముద్రాల ద్వారా ఏకమవుదాం..'

విశాఖలో బుధవారం జరిగిన ఐఎఫ్ఆర్‌లో 74 దేశాలు పాల్గొన్నాయి. సముద్రంలో 85 నౌకలను మోహరించారు. వాటిలో 19 విదేశీ నౌకలు కూడా ఉన్నాయి. సమీక్షకు ఏర్పాటుచేసిన ఆరు వరుసల్లో 52 నౌకలను యాంకరింగ్‌లో నిలిపి ఉంచారు. ఈ విన్యాసాల్లో నేవీకి చెందిన నౌకలు 60వరకూ ఉన్నాయి. 'సముద్రాల ద్వారా ఏకమవుదాం..' అనే నినాదంతో చేపట్టిన ఐఎఫ్ఆర్ విజయవంతమైందని నేవీ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రపంచస్థాయి ప్రమాణాలతో భారత నేవీ: రామ్మోహన్

భారత నౌకాదళం ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఎదుగుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. విశాఖలో బుధవారం జరిగిన ఐఎఫ్ఆర్‌లో ఆయన సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఐఎఫ్ఆర్‌లో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ సమీక్ష భారత సముద్ర శక్తిని, ప్రపంచ దేశాలతో పెంచుకుంటున్న భాగస్వామ్యాన్ని ప్రతిబింబించిందన్నారు. ఇందులో విమాన వాహక యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రాంత్ కూడా పాల్గొనడం గర్వకారణమన్నారు.

నేడు విశాఖకు రాజ్‌నాథ్.. 'మిలాన్-2026' ప్రారంభం

కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ గురువారం విశాఖపట్నం రానున్నారు. భారత నౌకాదళం నిర్వహిస్తున్న 'మిలాన్-2026' ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా నౌకాదళ ఉన్నతాధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చిస్తారు. సముద్రిక ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో దేశ, విదేశీ ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సాయంత్రం ఢిల్లీ బయల్దేరి వెళ్లిపోతారు.



మికోయన్ మిగ్-29కె జెట్ విమానాలు

రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు

రెండు రోజుల పర్యటన నిమిత్తం నగరానికి వచ్చిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం సాయంత్రం తిరిగి ఢిల్లీ పయనమయ్యారు. నేవల్ ఎయిర్ స్టేషన్ ఐఎన్ఎస్ డేగాలో ఆమెకు గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, కలెక్టర్ హరేంధిరప్రసాద్, నేవీ ఉన్నతాధికారులు వీడ్కోలు పలికారు.

నేడు ఇంటర్నేషనల్ సిటీ పరేడ్

విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌రోడ్డులో గురువారం సాయంత్రం ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ జరుగనుంది. భారత నౌకాదళం ఈ నెల 15 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష, మిలాన్-2026లో భాగంగా ఈ పరేడ్ ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని బీచ్‌రోడ్డులో కవాతు నిర్వహిస్తారు. వారి దేశాలకు చెందిన సంస్కృతీ, సంప్రదాయాలను ప్రదర్శిస్తారు. దీనికి ముందు నేవీ వైమానిక విభాగం సాహస విన్యాసాలు చేయనుంది. దీనికి గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.



సిటీ పరేడ్‌లో పాల్గొన్న ఆస్ట్రేలియన్ నేవీ బృందం



ఐఎన్ఎస్ తరంగిణి నౌక



ఐఎఫ్ఆర్‌లో పాల్గొన్న కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దంపతులు

ప్రత్యేక ఆకర్షణగా 'ఐఎన్ఎస్ విక్రాంత్'

▸▸ రెండు గంటలకు పైగా నౌకాదళ సమీక్ష

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరాన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) బుధవారం రెండు గంటలకు పైగా సాగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సరయూ క్లాస్‌కు చెందిన 'సుమేధ' నౌకపై అతిథులతో కలిసి జెట్టీ నుంచి ఉదయం 10.20 గంటలకు సమీక్షకు బయల్దేరారు. తీరానికి సుమారు పది కిలోమీటర్ల దూరాన సముద్రంలో ఆరు వరుసల్లో లంగరు వేసిన 80కి పైగా నౌకల మధ్య నుంచి నెమ్మదిగా సాగుతూ, వాటిని పరిశీలిస్తూ, నావికులు చేసిన గౌరవ వందనం స్వీకరిస్తూ సమీక్షించారు. వాటిలో ప్రధానంగా విమాన వాహక యుద్ధనౌక 'ఐఎన్ఎస్ విక్రాంత్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాష్ట్రపతి రథం 'సుమేధ' వెంట అదే సరయూ క్లాస్‌కు చెందిన గస్తీ నౌకలు సుమిత్ర, సుకన్య, సునయలపై ప్రత్యేక ఆహ్వానితులను తీసుకువెళ్లారు. వివిధ నగరాల పేరుతో నేవీ ఆపరేట్ చేస్తున్న ఐఎన్ఎస్ మైసూర్, ఐఎన్ఎస్ విశాఖపట్నం, ఐఎన్ఎస్ చెన్నై తదితర నౌకలు ఆకట్టుకున్నాయి. సమీక్షలో చివరిగా సబ్‌మెరైన్లు సింధుకీర్తి, సింధుకేసరి, శాంకుల్ సముద్రంలో నుంచి తల పైకెత్తి బయటకు వచ్చి, కొద్దిసేపటికే మళ్లీ అదృశ్యమైపోయాయి. మెరైన్ కమెండోలు జెమినీ బోట్లపై తుపాకులు పేలుస్తూ సముద్రంలో దూసుకువెళ్లిన తీరు వారి ధైర్యసాహసాలను చాటింది.

ఆకట్టుకున్న నేవీ రిహార్సల్స్

ఐఎఫ్ఆర్‌లో భాగంగా బుధవారం సాయంత్రం ఆర్కే బీచ్‌లో నిర్వహించిన పూర్తిస్థాయి రిహార్సల్స్ ఆకట్టుకున్నాయి. చేతక్ హెలికాప్టర్లు, మిగ్ 29కే యుద్ధ విమానాలు, నిఘా విమానం పీ8ఐ, కమోవ్ హెలికాప్టర్లు ఇందులో పాల్గొన్నాయి. విన్యాసాల అనంతరం సిటీ పరేడ్ రిహార్సల్స్ నిర్వహించారు. ఇండియన్ నేవీ బ్యాండ్, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ బృందాలతోపాటు ఫ్లీట్ రివ్యూలో పాల్గొంటున్న దేశాలకు చెందిన నౌకాదళ సిబ్బంది భాగస్వామ్యమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారుల బృందాలు పరేడ్‌లో ప్రదర్శన ఇచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన శకటాలు కూడా పాల్గొన్నాయి. అనంతరం నౌకలపై నుంచి లేజర్ షో, తీరంలో ఫైర్ వర్క్స్ నిర్వహించారు.



విన్యాసాల్లో భాగంగా బాంబులు వేస్తున్న హాక్ యుద్ధ విమానాలు

అంబటి విడుదల

▸▸ సీఎంను బూతులు తిట్టిన కేసు సహా పలు నేరారోపణలపై 18రోజులు జైలులో..

▸▸ వైసీపీ హడావుడి.. బల ప్రదర్శనలా ర్యాలీ



రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు రహదారిలో అంబటి ర్యాలీ వల్ల ట్రాఫిక్‌లో ఇరుక్కున్న అంబులెన్స్

రాజమహేంద్రవరం, గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిని బూతులు తిట్టిన కేసు సహా పలు నేరారోపణలపై రిమాండ్‌లో ఉన్న వైసీపీ నేత అంబటి రాంబాబు బుధవారం బెయిల్‌పై రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ శ్రేణులు జైలు ఆవరణలో హడావుడి చేశారు. దారంతా పూలు చల్లుతూ, భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్లకు ఉండే ఫుట్ స్టెప్‌పై వేలాడుతూ కేకలు వేస్తూ హల్‌చల్ సృష్టించారు. జైలు వద్ద 200 మంది గుమిగూడారు. అంబటి రాంబాబుతో ర్యాలీగా మాజీ వైసీపీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంటికి చేరుకున్నారు. కాగా, రాంబాబు ర్యాలీలో ఓ అంబులెన్స్ ఇరుక్కుపోయింది. ట్రాఫిక్ స్తంభించడంతో జనంతిప్పలు పడ్డారు.

ఏమయిద్దని అడుగుతున్నా.. : అంబటి

జైలు వద్ద అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. "సంతోషం. జైలుకు వెళ్లేటప్పుడు సంతోషం. తిరిగి వస్తున్నప్పుడూ సంతోషమే. మళ్లీ వస్తానని చెప్పే వచ్చాను" అని ఆయన తెలిపారు. అసభ్యంగా తిడితే దాడులు చేయరా, అంటూ కొందరు వ్యాఖ్యానించారని, వారికి రేపు (గురువారం) గుంటూరు వెళ్లాక సమాధానమిస్తానన్నారు. "నా ఇల్లు దహనం చేయడానికి ప్రయత్నం చేశారు. నా ఆఫీస్ పగలగొట్టారు. నా పెళ్లాం, బిడ్డల్ని తరిమికొట్టారు. నన్ను చంపడానికి ప్రయత్నం చేశారు. ఏమయింది?" అని వ్యాఖ్యానించారు. డబ్బున్న వాళ్లం కదా...మంచి ఆహారం తినాలని అనుకుంటామని, కానీ కోర్టు అనుమతి ఇవ్వలేదన్నారు కాగా, బుధవారం రాత్రికి ఆయన గుంటూరు చేరుకుంటారని తొలుత భావించారు. అయితే, గురువారం ఉదయం విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి గుంటూరు వరకు భారీ ర్యాలీని వైసీపీ నాయకులు ప్లాన్ చేశారు. దీంతో ఆయన రాత్రికి రాజమండ్రిలోనే బస చేశారు. కాగా, గుంటూరు నగరంలో అమల్లోని 30 పోలీస్ యాక్ట్ ను అతిక్రమించి ర్యాలీ నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు.

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యలో.. అనంతబాబు భార్యకూ పాత్ర!

▸▸ పరారీలో అనంతలక్ష్మీదుర్గ.. 'బెయిల్' కోసం హైకోర్టులో పిటిషన్

కాకినాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తన కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని దారుణంగా హత్య చేసి.. మృతదేహాన్ని అతడి ఇంటికే డోర్ డెలివరీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు వ్యవహారంలో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ఈ హత్యలో ఆయన భార్య అనంతలక్ష్మీదుర్గ పాత్ర కూడా ఉందని ప్రాసిక్యూషన్ తాజాగా పేర్కొంది. ఈ కేసులో ఆమెను ఏ-2గా చేరుస్తూ కోర్టులో అనుబంధచార్జిషీటు దాఖలుచేసింది. హత్య సమయంలో అనంతబాబుతోపాటు ఆమె కూడా ఉన్నారని.. మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసేముందు.. దానిని కారులోనే ఉంచి తమ అపార్ట్‌మెంట్‌లోకి ఇద్దరూ లిఫ్టులో వెళ్లినట్లు సీసీ ఫుటేజీ ఆధారాలు ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు. హత్య అనంతరం ఆమె కాల్ డేటా ఆధారంగా కూడా ఆమె పాత్రను నిర్ధారించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు.. దళితుడైన తన కారుడ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని 2022 మే 19న హత్య చేసి, మృతదేహాన్ని అతడి ఇంటికి డోర్‌డెలివరీ చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదైనా దర్యాప్తు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత, తదుపరి విచారణకు ప్రాసిక్యూషన్ అనుమతి కోరగా.. రాజమండ్రి అట్రాసిటీ కోర్టు సమ్మతించింది. ఈనేపథ్యంలో ప్రాసిక్యూషన్ సప్లిమెంటరీ చార్జిషీటు దాఖలు చేసింది. కాగా, అనంతబాబు భార్య పరారీలో ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు. కాగా.. తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆమె ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

'గంగమ్మ' రాస్తున్న మరణ శాసనం

▸▸ తుని చెరువులో దూకిన నారాయణ రావు

▸▸ 'మదనపల్లె' చెరువులో తేలిన కులవర్ధన్

నీళ్లలో తేలుతున్న రేపిస్టులు.. మైలవరం డ్యామ్‌లో రహమతుల్లా శవం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పోలీసులకు పట్టుబడి కోర్టు మెట్లు ఎక్కాల్సిన బాలికల రేపిస్టుల జీవితాలు నీళ్లల్లో మునిగి పోతున్నాయి. అభం శుభం తెలియని చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న కీచకులకు 'గంగమ్మ' మరణ శాసనం లిఖిస్తోంది. రాష్ట్రంలో మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్న వ్యక్తులు జైల్లో చిప్పకూడు తింటుంటే, మైనర్లపై దారుణాలకు తెగబడుతున్న రేపిస్టులు కడతేరిపోతున్నారు. ఆడబిడ్డల జోలికి ఎవరైనా వస్తే అదే ఆఖరి రోజు అంటూ ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న హెచ్చరికలు.. మరోవైపు ఆగ్రహావేశాలతో ప్రజలు రోడ్డెక్కుతుండటంతో రేపిస్టుల గుండెలు జారిపోతున్నా యి. అనూహ్యంగా వారి జీవితాలు గంగ లో కలిసిపోతున్నాయి. మదనపల్లిలో ఇంటి ముందు ఆడుకొంటున్న ఏడేళ్ల బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి కులవర్ధన్ అత్యాచారం చేసి, చంపేశాడు. డ్రమ్ములో ఆ చిన్నారి శవాన్ని దాచిపెట్టాడు. పోలీసులు అదుపులోకి తీసుకోగా, అంగళ్లు సమీపంలోని చెరువులో కులవర్ధన్ శవమై కనిపించాడు. ఈ విషయం మీడియాకు అన్నమయ్య జిల్లా ఎస్పీ వెల్లడించారు.

మూడేళ్ల బాలికపై దారుణం

కడప జిల్లా జమ్మలమడుగు సమీపంలోని మైలవరం మండలం కంబాల దిన్నె గ్రామంలో గత ఏడాది మే 23న స్థానిక కల్యాణ మండపం వెనుక మూడేళ్ల బాలిక శవం తీవ్ర గాయాలతో కనిపించింది. తల్లితండ్రులతో కలిసి బంధువుల పెళ్లికి వచ్చిన ఆ బాలికను రహమ తుల్లా(26) అనే వ్యక్తి అరటి పండు ఇస్తానంటూ కల్యాణ మండపం వెనక్కి తీసుకెళ్లి అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసినట్లు తేలింది. లైంగిక నేరాల నుంచి మైనర్లను రక్షించే(పోక్సో) చట్టంతో పాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నివారణ చట్టం కింద కేసు నమోదు చేసి రహమతుల్లాను అదుపులోకి తీసుకున్నారు. కోపోద్రిక్తులైన ప్రజలు కామాంధుడి స్వగ్రామమైన మోరగుడిలో అతని ఇంటిని కూల్చేశారు. విషయం తెలిసిన వెంటనే శాంతి భద్రతల్ని పరిరక్షించేందుకు పోలీసులు అటు వెళ్లగా, రేపిస్ట్ పారిపోయాడు. గాలింపు చేపట్టిన పోలీసులకు మైలవరం డ్యామ్‌లో రహమతుల్లా శవం జూన్ 5న లభ్యమైంది.

తాతయ్య వయసులో పాడు పని

కాకినాడ జిల్లా తుని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ తోటలో వృద్ధుడు నారాయణ రావు(63)... పదమూడేళ్ల బాలికతో అభ్యంతర కర స్థితిలో ఉన్న వీడియో ఒకటి 2025 అక్టోబరు చివరి వారంలో సోసల్ మీడియాలో వైరల్ అయింది. నారాయణ రావు తన కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి అక్టోబరు 22న తుని రూరల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై రేప్, కిడ్నాప్, ఫోక్సో సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు అదే రోజు రాత్రి పది గంటల సమయంలో జడ్జి ముందు ప్రవేశ పెట్టేందుకు తీసుకెళుతున్నారు.మార్గం మధ్యలో కాలకృత్యాలు తీర్చుకోవాలంటూ నారాయణరావు వాహనం దిగి అక్కడున్న కోమటి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

రేపిస్టులకు 'మృత్యు'దండనే.

▸▸ అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కొప్పుగుండ పాలెంలో జూలై 2024లో మైనర్ బాలికను సురేశ్ అనే యువకుడు హత్య చేశాడు. అప్పుడే కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. భయపడ్డ నిందితుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

▸▸ గుంటూరు జిల్లా దాచేపల్లిలో మైనర్ బాలికపై సుబ్బయ్య(55) అఘాయిత్యానికి పాల్పడి ఇంటి వద్ద దించి వెళ్లాడు. 2018లో జరిగిన ఘటనపై ప్రజలు రోడ్డెక్కి నిరసనకు దిగారు. ప్రత్యేక పోలీసు టీమ్‌లు రంగంలోకి దిగాయి. దీంతో భయపడిపోయి చెట్టుకు ఉరి వేసుకున్న సుబ్బయ్య శవాన్ని రెండు రోజుల తర్వాత పోలీసులు గుర్తించారు.

నాడు ఆడబిడ్డలకు నరకమే..

మహిళలపై అత్యాచారానికి పాల్పడితే 21రోజుల్లోని ఉరిశిక్ష అంటూ ఆనాడు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్క ఉరిశిక్ష కూడా వేయించలేక పోయారు. కనీసం తాను గొప్పగా ప్రకటించిన దిశ చట్టాన్ని కూడా తీసుకు రాలేక పోయారు. ఆఖరికి తన ప్యాలెస్‌కు సమీపంలోని కృష్ణా నది తీరంలో కాబోయే భర్త ముందే యువతిపై అత్యాచారానికి పాల్పడిన ప్రధాన నిందితుడిని అరెస్టు చేయలేక పోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆడబిడ్డల జోలికి వస్తే అదే ఆఖరి రోజు అంటోన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరికల్ని 'గంగమ్మ' అమలు చేస్తుండటం గమనార్హం. మరో వైపు ఫోక్సో కేసులు, అత్యాచార కేసుల్లో శిక్షల శాతం బాగా పెరిగిందని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా చెబుతున్నారు. నేరాలకు కారణమైన గంజాయి నిర్మూలనలో ప్రజల సహకారం పోలీసులకు అందించాలని కోరారు.

రేపిస్టులు బయట ఉండేందుకు అనర్హులు

▸▸ చిన్నారులు, మహిళల జోలికొస్తే సహించం

▸▸ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా హెచ్చరిక

▸▸ కూటమి వచ్చిన 588 రోజుల్లో 524 శిక్షలు..

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి 588 రోజులైతే.. చిన్నారులు, మహిళలపై నేరాలకు పాల్పడిన కేసుల్లో 524 శిక్షలు పడ్డాయి. అందులో ఏడుగురికి మరణ శిక్షలు..138 మందికి యావజ్జీవం విధించిన కోర్టులు.. 119 కేసుల్లో 20నుంచి 25ఏళ్ల జైలు శిక్షలు విధించాయి. ఐదేళ్లు, ఏడేళ్లు, పదేళ్లు విధించిన శిక్షలు 370 దాకా ఉన్నాయి. విజయనగరం జిల్లా 50కి పైగా కేసుల్లో శిక్షలతో అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో విజయవాడ పోలీస్ కమిషనరేట్, ఏలూరు జిల్లా, పీఎస్ఆర్ నెల్లూరు, విశాఖపట్నం కమిషనరేట్ ఉన్నాయి. ఈ విషయమై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పోక్సో కేసుల్లో స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 164 శక్తి బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం మహిళలకు భద్రత కల్పిస్తున్నామని.. డయల్ 112, శక్తి యాప్స్‌కు ర్యాపిడ్ రెస్పాన్స్ యూనిట్లు క్షణాల్లో స్పందిస్తున్నాయని చెప్పారు. బాధితులు శక్తి వాట్సాప్ 79934 85111 కు ఫిర్యాదు చేస్తే బాధితులు లైవ్, సేఫ్ ట్రాకింగ్ సదుపాయాలు పొందవచ్చని సూచించారు.

చెరువులో శవమయ్యాడు

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు ప్రకటించారు. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బుధవారం ఉదయం కడప జిల్లా వీరబల్లి మండలం రాగిమానుదిన్నెపల్లెలో కుటుంబ సభ్యులు, బంధువుల కన్నీటి వీడ్కోలు నడుమ చిన్నారికి అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం....మద్యం, గంజాయి మత్తులో ఉన్న కులవర్ధన్ చిన్నారిపై హత్యాచారం చేశాక తన గదిలో నిద్రపోయాడు. సోమవారం అర్ధరాత్రి పోలీసులు తలుపు తట్టినా తీయలేదు. దీంతో మంగళవారం ఉదయం తలుపు బద్దలు కొట్టి, ఇంట్లోకి వెళ్లి చూడగా పాప మృతదేహం నీటి డ్రమ్ములో ఉంది. ఘటన గురించి తెలియగానే పట్టణంలో వందలాది మంది మంది ప్రజలు రోడ్డుపైకి వచ్చారు. నిందితుడిని తక్షణమే శిక్ష విధించాలని, అతణ్ని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆందోళన నిర్వహించారు. ఈ క్రమంలో పోలీసులు కులవర్ధన్‌ను అదుపులోకి తీసుకుని రక్షక్ వాహనంలో తీసుకెళ్తుండగా దారిలో వాహనం నుంచి దూకి పారిపోయాడు. అతని కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తుండగా, తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం కనసానివారిపల్లెచెరువులో మృతదేహం ఉన్నట్లు వీఆర్వో సుస్మిత బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ మృతదేహాన్ని కులవర్ధన్‌దిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని చూసేందుకు అతని తల్లి, చెల్లెలు ఎవరూ రాలేదు. సమీప బంధువు నుంచి స్టేట్‌మెంట్ తీసుకుని పోస్టుమార్టం నిర్వహించారు.

మదనపల్లెలో సంబరాలు

కులవర్ధన్ ఆత్మహత్యపై మదనపల్లెలో బాణసంచా పేల్చి జనం ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారి ఇంటి వద్ద నుంచి మహిళలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. చిన్నారికి ఆమె స్వగ్రామం కడప జిల్లా వీరబల్లి మండలంలో కుటుంబ సభ్యులు, బంధువులు అంత్యక్రియలు జరిపి కన్నీటి వీడ్కోలు పలికారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి స్థానికుల పాలాభిషేకం

కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడు: ఎస్పీ

కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్పీ ధీరజ్ బుధవారం మీడియాకు తెలిపారు. "కులవర్ధన్ పోలీసుల అదుపులోంచి తప్పించుకుని పారిపోయాడు. అనంతరం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు" అని వివరించారు.

వాడు బతికుంటే నేనే చంపేసేదాన్ని

▸▸ చిన్నారి తల్లి ఆగ్రహం

అన్నమయ్య, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'వాడు చచ్చిపోయాడు. ఆత్మహత్య చేసుకున్నాడో, మరెలా చచ్చాడో తెలియదు. కానీ వాడు బతికుంటే నేనే చంపేసేదాన్ని. వాళ్లమ్మకు కూడా విషయం తెలుసంటున్నారు. ఆమెను వెతకాలి. వాళ్లిల్లు కూలకొట్టాలి' అంటూ చిన్నారి తల్లి ఆగ్రహంతో ఊగిపోయారు. కాగా, ఈ హత్యాచారాన్ని నిరసిస్తూ మంగళవారం జరిగిన ఆందోళనలో కొందరు ఉద్దేశ్యపూర్వకంగానే ప్రజలను రెచ్చగొట్టారని పోలీసులు కనిపెట్టారు. ప్రభుత్వానికి, వ్యవస్థకు వ్యతిరేకంగా వారు నినాదాలు చేసినట్టు గుర్తించారు. ఆ సమయంలో డ్రోన్ కెమెరాలతో రికార్డు చేసిన దృశ్యాలను పరిశీలించారు. కొందరు వ్యక్తులు తమ రాజకీయ, రహస్య ఎజెండాను నెరవేర్చుకోవడానికి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని తెలుసుకున్నారు. ఈ వ్యవహారంలో పలువురికి పోలీసుల నుంచి పిలుపు వచ్చినట్లు సమాచారం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.